# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 132 | హైదరాబాద్ | బుధవారం 12-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో


అందెశ్రీ పాడెను మోసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



## ముగిసిన జూబ్లీహిల్స్
# ఉప ఎన్నిక పోలింగ్..

క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అవకాశం

- మాగంటి గోపీనాథ్ అకాల మృతితో ఉప ఎన్నిక
- ఈ నెల 14న ఓట్ల లెక్కింపు
- జూబ్లీహిల్స్ బరిలో 58 మంది అభ్యర్థులు



11లో

## నేటి భారతం

- నువ్వెప్పుడైతే ఎక్కువుగా
  ఆశపడతావో..
  అప్పుడే నీ పతనం
  మొదలవుతుంది..
- అయాచితంగా వచ్చేది
  ఏదైనా సరే..
  నిర్మోహమాటంగా నాకు
  వద్దు అని చెప్పడం ఎంతో
  మంచిది..
- నీకు ప్రాప్తం ఉన్నది నువ్వు
  ఎక్కడ ఉన్నా నిన్ను
  చేరుతుంది..
- నీది కానీ దానికోసం
  అర్రులు చాస్తే
  కాలం కూడా నీకు
  సహకరించదు..
- అందుకే నిన్ను
  మోసం చేసే వాళ్ళు
  పెరిగిపోతున్నారు..
  అడుగడుగునా
  నీ కదలికలను
  గమనిస్తున్నారు..
  నిన్ను నట్టేట
  ముంచడానికి పథకాలు
  రచిస్తూ ఉంటారు..
- నువ్వు ఓట్లేసి
  గెలిపించుకున్న
  ప్రభుత్వం..
  నిన్ను కాపాడే బదులు..
  అక్రమార్కులకు
  సహకరిస్తోంది..
- అందుకే ఎవరినీ
  నమ్మకు..
  అత్యాశకు పోకు..
- నిజాయితీగా ఉండు..
  నువ్వనుకున్నది
  సాధించు..

– బోయినపల్లి రమణా రావు,
సీనియర్ జర్నలిస్ట్..

## అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలి..
# ప్రధానిని కోరతా: సీఎం

- అందెశ్రీ కీర్తిని శాశ్వతం చేస్తామన్న రేవంత్
- ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ
- ఆయన మరణం ఆప్తుడిని కోల్పోయిన బాధను కలిగించిందని వ్యాఖ్య



11లో

## ఢిల్లీ పేలుడు.. భారత్ కు
# ప్రపంచదేశాల సంఘీభావం

- ఢిల్లీ ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద కారు పేలుడు
- ఘటనలో 8 మంది దుర్మరణం, పలువురికి గాయాలు
- ఐర్లాండ్, చైనా, జర్మనీ దేశాల నుంచి సంతాప సందేశాలు
- ఉక్రెయిన్, యూకే నేతలు సైతం తీవ్ర దిగ్భ్రాంతి
- పేలుడు ఘటనపై వెల్లువెత్తిన అంతర్జాతీయ స్పందన



11లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో
## కాంగ్రెస్ పార్టీదే గెలుపు: ఎగ్జిట్ పోల్ సర్వేలు

11లో



## ఛత్తీస్‌గఢ్‌లో...
# భారీ ఎన్‌కౌంటర్

- ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు
- బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఘటన
- భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం
- మావోయిస్టుల ఉనికి తగ్గిపోయిందన్న బస్తర్ రేంజ్ ఐజీ
- తప్పించుకున్న మావోల కోసం అడవులను జల్లెడ పడుతున్న బలగాలు

11లో

# బీహార్‌లో మళ్లీ ఎన్డీయే ప్రభంజనం..
## ముక్తకంఠంతో చెబుతున్న ఎగ్జిట్ పోల్స్!

- బీహార్ లో నేడు ముగిసిన రెండో విడత పోలింగ్
- ఎగ్జిట్ పోల్స్ వెల్లడి.. ఎన్డీయేకు భారీ మెజారిటీ అంచనా
- మహాగట్బంధన్‌కు నిరాశ తప్పదంటున్న సర్వేలు
- పనిచేయని ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' ఫ్యాక్టర్
- ఎన్డీయే వైపు భారీగా మొగ్గు చూపిన మహిళా ఓటర్లు
- దాదాపు అన్ని సర్వేల్లోనూ బీజేపీ కూటమికే పట్టం



11లో



11లో

## అమరావతి విచ్చేసిన
# కేంద్రమంత్రి శివరాజ్ సింగ్

ఏపీ సమస్యలు వివరించిన సీఎం చంద్రబాబు

భారత శక్తి

# ఎన్నాళ్లీ మారణహోమం

దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం సాయంత్రం ఎర్రకోట సమీపంలో బాంబు పేలుళ్లు జరిగాయి. ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ దగ్గర గేట్ -1 వద్ద పార్కింగ్ చేసిన ఓ కారులో పేలుళ్ళు జరిగాయి. ఈ ఘటనలో ఐదు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సమీపంలో ఉన్న దుకాణాల తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటన జరిగిన తర్వాత బాంబ్ స్క్వాడ్ బృందాలతో ఘటన స్థలానికి చేరుకున్నారు. దర్యాప్తు మొదలుపెట్టారు.మొదట్లో ఈ ఘటనలో ఒకరు మృతి చెందినట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత చనిపోయిన వారి సంఖ్య ఎనిమిదికి పెరిగింది. పేలుడు ఘటనలో 8 మంది దుర్మరణం చెందారు. పేలుడు వల్ల 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారి శరీరాలు పూర్తిగా ఛిద్రమయ్యాయి. గాయపడిన వారిని ఎల్ ఎన్ జీ పీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో చాలావరకు వాహనాలు ధ్వంసమైనట్టు తెలుస్తోంది. ఘటనా స్థలంలో దర్యాప్తు బృందాలు విచారణ మొదలుపెట్టాయి. ఈ పేలుడు వెనక ఉగ్ర ఉందేమోనన్న కోణంలో దర్యాప్తును మొదలు పెట్టాయి. ఆదివారం యాంటీ టెర్రరిజం స్క్వాడ్ విస్తృతంగా దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఉగ్ర మూలాలు ఉన్న వ్యక్తులను అరెస్ట్ చేసింది. వారిని అరెస్టు చేసిన తర్వాత ఒకరోజు వ్యవధిలో ఈ ఘటన జరగడం విశేషం.ఉగ్రవాదులు మనదేశంలో దాడులు జరపడానికి కుట్రలు పన్నారని యాంటీ టెర్రరిజం స్క్వాడ్ దర్యాప్తులో తేలింది. పలు ప్రాంతాలలో ఉగ్రవాదులను దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇది జరిగిన ఒక రోజు వ్యవధిలోనే ఈ దారుణం చోటుచేసుకుంది. దీని వెనుక ఉగ్రవాదులు ఉన్నారని దర్యాదు బృందం అధికారులు అనుమానిస్తున్నారు. లోతుగా దర్యాప్తు మొదలుపెట్టారు. మన దేశంలో గడిచిన వారం రోజుల వ్యవధిలో ఉగ్రవాద వ్యతిరేక పోలీసుల బృందం విస్తృతంగా దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో నలుగురు డాక్టర్లు అరెస్టు అయ్యారు.. వీరి వద్ద నుంచి పోలీసులు ఏకంగా 2900 వందల కిలోల పేలుడు పదార్థాలను, రైఫిళ్ళు, పిస్టల్స్, రిసిన్, అమోనియం నైట్రేట్ వంటి విష పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.. ఈ పరిణామం జరిగిన గంటల వ్యవధిలోనే ఢిల్లీలో భారీ పేలుడు చోటుచేసుకుంది.వాస్తవానికి ఈ పేలుడు అనేక సంచలన విషయాలను బయటపెట్టింది. ఉగ్రవాద వ్యతిరేక బృందం నలుగు డాక్టర్లను అరెస్ట్ చేసిన తర్వాత.. ఉగ్ర కుట్ర బయటపడింది. ఢిల్లీ ప్రాంతంలోని ఫరీదాబాద్ లో ఆల్ ఫలాయ్ యూనివర్సిటీ లో అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ ముజమిల్ షకీల్, జమ్మూ కాశ్మీర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ ఆదిల్ అహ్మద్ రథర్, గుజరాత్ లోని డాక్టర్ అహమ్మద్ మోహియుద్దీన్ సయ్యద్, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర చెందిన మహిళ డాక్టర్ ను ఉగ్రవాద వ్యతిరేక పోలీసుల బృందం అరెస్ట్ చేసింది.. జమ్ము కాశ్మీర్, ఫరీదాబాద్ ప్రాంతాలలో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు.. ఇందులో ఏకంగా నలుగురు పట్టు పడ్డారు. సమాజంలో వీరిని ఎవరు కూడా అనుమానించారనే ఉద్దేశంతోనే ఉగ్రవాద సంస్థలకు నిత్యం అందుబాటులో ఉండేవారు. దేశవ్యాప్తంగా దాడులకు ప్రణాళిక రూపొందించారు.అరెస్ట్ అయిన వైద్యులు జైషే ఏ మహమ్మద్, అన్సార్ గజ్వతుల్ హింద్ అనే ఉగ్రవాద సంస్థల తో సంబంధం ఉన్నట్టు విచారణలో తేలింది. డాక్టర్ కాబట్టి ఎవరూ అనుమానించరనే ఉద్దేశంతోనే వీరు ఉగ్రవాద సంస్థలకు టచ్ లో ఉండేవారని తెలుస్తోంది. ఇక అరెస్టు అయిన వారిలో ఇద్దరు డాక్టర్లు 2018 -2021 కాలంలో భారత భద్రతా దళాల దాడిలో గాయపడిన ఉగ్రవాదులకు చికిత్స అందించారని తెలుస్తోంది.. ఇక ఇదే క్రమంలో ఇంటెలిజెన్స్ వర్గాలు ఈ మాడ్యూల్ మొత్తాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.. ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు కూడా ఉగ్రదాడి అని అనుమానాలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో.. ఈ నలుగురు పట్టుబడ్డారు.దేశ రాజధానిలో పేలుడు జరిగిన నేపథ్యంలో ఈ ఘటన సంచలనంగా మారింది.సరిగ్గా ఆదివారం ఆముదంతో విషయం తయారు చేసే వందల మందిని చంపడానికి కుట్ర చేసిన హైదరాబాద్ ఉగ్రవాది సయ్యద్ అహ్మద్ మోహియుద్దీన్, మరో ఇద్దరు ఐసిస్ సానుభూతిపరులను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ ఘటన జరిగిన ఒక రోజు వ్యవధిలోనే ఈ దారుణం చోటు చేసుకోవడం గమనార్హం. ఆముదం గింజలను ప్రాసెస్ చేసి.. మిగిలిపోయిన వ్యర్థాలతో అత్యంత ప్రమాదకరమైన రైసిన్ అనే విష రసాయనాన్ని తయారు చేశారు. ఈ వ్యవహారం దర్యాప్తు బృందం అధికారుల విచారణలో తేలింది.గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఇటీవల ముగ్గురు ఉగ్రవాదులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. వీరు దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు కుట్ర చేశారని భద్రతా అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నిఘా వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. భారత్ చుట్టూ ఉగ్రవాదాన్ని విస్తరించేందుకు పాకిస్తాన్ కుట్రలు చేస్తోందని పేర్కొన్నాయి. అందులో భాగంగా భారత సరిహద్దు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లో.. ఉగ్ర స్థావరాలు, శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపాయి. భారత సరిహద్దులకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉగ్ర నివాసాలన ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పాయిఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్ర స్థావరాల ఏర్పాటు మరింత వేగవంతమైనట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఉగ్రవాద ట్రైనింగ్ తీసుకునే వారి కోసం బంగ్లాదేశ్, నేపాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో శిక్షణ శిబిరాలు, నివాస సముదాయాలు ఏర్పాటు చేస్తున్నాయని తెలిపాయి. కాగా, ఇటీవల బంగ్లా, నేపాల్ సరిహద్దుల్లో ఉన్న పలు రాష్ట్రాల్లో ఉగ్రవాద అనుమానితులను భద్రతా సంస్థలు అరెస్ట్ చేశాయి. ఈ నేపథ్యంలో ఈ హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే భారత సరిహద్దు ప్రాంతాల్లో భద్రత పెంచినట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా బంగ్లా, నేపాల్‌లలో విదేశీ నిధులతో నిర్మితమవుతున్న పలు ప్రాజెక్టులపై కూడా ఇంటెలిజెన్స్ వర్గాలు నిఘా పెట్టినట్లు తెలిపాయి.లష్కరే తొయిబా, జైషే మహమ్మద్‌లు సమన్వయ దాడులకు సిద్ధమవుతోన్నట్టు ఇటీవల నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ఉగ్రవాద సంస్థలు చొరబాట్లు, గూఢచర్యం, సరిహద్దు లాజిస్టిక్స్ కార్యకలాపాలను గణనీయంగా పెంచాయని వెల్లడించాయి. తాజాగా మళ్లీ.. లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ నేపాల్‌లో తమ సంస్థలను విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించడం గమనార్హం. అల్-ఖైదా, ఐసిస్ గత ఐదు నెలలుగా బంగ్లాదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడానికి ప్రయత్నాలు వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నాయి. అందులో భాగంగా పాక్‌లోని పలు ప్రాంతాల నుంచి బంగ్లాదేశ్‌కు, నేపాల్‌కు నిరంతరం ఉగ్రవాదుల వలసలు కొనసాగుతున్నాయని తెలిపాయి. అయితే ఆ ప్రాంతాల్లో ఉగ్రవాద శిబిరాల నిర్మాణానికి టర్కీ (తుర్కియే) నుంచి నిధులు అందుతున్నట్లు నిఘా సంస్థలు గుర్తించినట్లు తెలుస్తోంది.గతేడాది మహమ్మద్ యూనస్ నేతృత్వంలో బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు అయింది. అప్పటి నుంచి భారత్ వ్యతిరేక శక్తులకు బంగ్లా వేదికగా మారింది. మహమ్మద్ యూనస్ సారథ్యంలో ఈ వ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నాయి. దీంతో పాకిస్తాన్ ఉగ్రవాదులకు బంగ్లాదేశ్ కొత్త గమ్యస్థానంగా మారిపోయింది.

# 5 శాతం ఎమ్మెల్యేలు గీత దాటేసారా

విజయవాడ, నవంబర్ 11,

తెలుగుదేశం పార్టీ నలభై ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉంది. కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీలో క్రమశిక్షణ కట్టు తప్పుతుంది. కొత్త వాళ్లను ఎంపిక చేయడం తాను చేసిన తప్పా? అన్న చంద్రబాబు చేసిన వ్యాఖ్యల్లో కొంత మాత్రమే నిజముంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సమయంలోనూ ఎన్టీఆర్ ఎందరో కొత్త వాళ్లకు రాజకీయంగా అవకాశం కల్పించారు. అప్పుడు కూడా పార్టీ లైన్ ఎవరూ దాటే ప్రయత్నం చేయలేదు. 1995లో చంద్రబాబు పార్టీని తన చేతుల్లోకి తీసుకున్న తర్వాత కూడా తటస్థులంటూ కొత్త వారికి టిక్కెట్లు ఇవ్వడం జరిగాయి. ఆ ప్రయోగమూ విఫలం కాలేదు. కానీ ఎన్నడూ లేని విధంగా ఈసారి మాత్రం ఎమ్మెల్యేలు అందులోనూ కొత్తగా మొదటి సారి గెలిచిన ఎమ్మెల్యేలు మాత్రమే కట్టుతప్పుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. కానీ క్రమశిక్షణ చర్యలను తీసుకునే పరిస్థితుల్లో పార్టీ నాయకత్వం లేదన్నది వాస్తవం. కొలికపూడి శ్రీనివాసరావు నుంచి మొదలుపెడితే ఎవరూ ఏమీ తక్కువ కాదన్నట్లు కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, తంబళ్లపల్లి ఇన్ ఛార్జి జయప్రకాష్ రెడ్డి ఇలా ఒక్కరు కాదు.. అనేక మంది యువ ఎమ్మెల్యేలు అనేక వివాదాల్లో వరసగా చిక్కుకుంటున్నారు. మొన్నటి ఎన్నికల్లో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడంతో వాటిని సంపాదించుకునేందుకు తపన పడే వారి సంఖ్య ఎక్కువగా కననపడుతుంది. అందులోనూ ఇసుక, మద్యం వంటి అంశాల్లోనూ ఎమ్మెల్యేల జోక్యం ఉండటంతో అధినాయకత్వానికి తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. వారిని ఆపడం ఎలాగో తెలుగుదేశం పార్టీ నాయకత్వానికి కూడా అంతు చిక్కని సమస్యగా మారింది. అపార రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు సయితం ఏమీ చేయలని పరిస్థితుల్లో ఉన్నారు.. ఇక తాజాగా 48 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల్లోనూ పాల్గొనడం లేదంటే ఏ రేంజ్ లో వారి ధిక్కార స్వరం వినిపపడుతుందో అర్థం చేసుకోవచ్చు.

ఎన్నడూ లేనిది తెలుగుదేశం పార్టీలో ఇలాంటి పరిస్థితి రావడానికి నాయకత్వం యాభై శాతం కారణమయితే.. ఎన్నికల్లో పెరిగిపోయిన విపరీతమైన ఖర్చు కూడా మరొక కారణంగా చెప్పాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నా 48 మంది ఎమ్మెల్యేలు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటే నాయకత్వాన్ని కేర్ చేయకపోవడమేనని స్పష్టంగా అర్థమవుతుంది. ఇది రానున్న ప్రమాదానికి సంకేతాలుగానేన చెప్పాలి. ఉన్న 135 ఎమ్మెల్యేల్లో 48 మంది ఎమ్మెల్యేలంటే 38 శాతం అస్సలు ప్రభుత్వాన్ని పార్టీని పట్టించుకోలేదనే భావించాలి. వీరంతా సొంత పనులు, వ్యాపారాలకు మాత్రమే పరిమితమయ్యారు. టీడీపీకి నిజంగా ఇది వేకప్ కాల్. దీని నుంచి బయట పడకపోతే ఇబ్బందులు తప్పవు. అందుకే చంద్రబాబు నాయుడు సరైన సమయంలో సరైన నిర్ణయం అని నాన్చకుండా సీరియస్ యాక్షన్ దిగాలని పార్టీ క్యాడర్ కోరుకుంటుంది.

సరైనా సమయంలో సరైన నిర్ణయం

తిరువూరు వివాదంలో తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కమిటీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుదే తప్పని తేల్చింది. ఇది ఊహించని విషయమేమీ కాదు. కొలికపూడికి వివాదమూ కొత్తేమీ కాదు. గతంలో అనేక వివాదాల్లో చిక్కుకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. చంద్రబాబు హెచ్చరికలంటే ఆయనను దగ్గర నుంచి చూసిన వారికి అందరికీ తెలుసు. చంద్రబాబు నాయుడు హెచ్చరికల కంటే రాజకీయ భవిష్యత్ పైనే ఎక్కువగా హిత బోధ చేయడం అలవాటు. అందుకే కొలికపూడి పెద్దగా పట్టించుకోలేదన్న టాక్ కూడా పార్టీలో వినిపిస్తుంది. అయితే క్రమశిక్షణ కమిటీ ఈ వివాదంలో కొలికపూడి శ్రీనివాసరావుదే తప్పని తేల్చినా ఇప్పటికిప్పుడు చర్యలు తీసుకునే అవకాశాలు ఎంత మాత్రం లేవన్నది వాస్తవం... పోలింగ్ పెరిగితే ఎవరికి లాభం? ఇంకా మూడేళ్ల సమయం... శాసనసభ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉంది. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై సస్పెన్షన్ వేటు వేయడం వేరు. కానీ కొలికపూడి రూటు వేరు. ఆ సంగతి పార్టీలో ప్రతి ఒక్కరికీ తెలుసు. కొలికపూడిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే మూడేళ్ల పాటు తలనొప్పులు భరించాల్సి ఉంటుంది. అసెంబ్లీలోనూ, బయటా ఆయన వ్యవహార శైలి మారుతుంది. ఆయనను అడ్డుకునే పరిస్థితి ఎవరూ చేయరు. కొలికపూడి శ్రీనివాసరావును సామాజికవర్గంలో చూడకపోయినా, ఆయన రాజకీయాలను లోతుగా అధ్యయనం చేసిన వ్యక్తి అని తెలుసు. ఆయన టీడీపీలో ప్రతి రోజూ ఏదో ధౌంజడ్ వాలాను పేలుస్తూ వెళతాడు. అసలు విషయాలు పక్కదారి పట్టి కొలికపూడి హైలెట్ అయ్యే అవకాశాలున్నాయి. అందుకే చంద్రబాబు నాయుడు సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటానని చెప్పడం వెనక కూడా ఇదే కారణం. వచ్చే ఎన్నికల వరకూ ఓపిగ్గా కొలికపూడి శ్రీనివాసరావును భరించడం తప్ప మరో మార్గం చంద్రబాబుకు లేదు. వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా కొలికపూడికి టిక్కెట్ ఇవ్వకపోవచ్చు. ఆ విషయం కొలికపూడికి కూడా అర్థమయి ఉంటుంది. కానీ ఈ మూడేళ్ల పాటు ఆయనపై పార్టీ ఎటువంటి చర్యలు తీసుకోకుంటేనే ఇద్దరికీ ఉత్తమం అన్న అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతుంది. దూకుడా అధినాయకత్వం నిర్ణయం తీసుకుంటే ఇక కొలికపూడి వేసే సర్జికల్ స్ట్రయిక్స్ ను నిత్యం భరించాల్సి వస్తుంది. అంత సాహసం పార్టీ నాయకత్వం చేయకపోవచ్చు. కాబట్టి కొలికపూడి శ్రీనివాసరావుపై ఇప్పట్లో చర్యలు తీసుకోరన్నది వాస్తవం. అదే సమయంలో వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వరన్నది కూడా అంతే నిజం. అందుకోసమే చంద్రబాబు బహుశా చంద్రబాబు ఆ డైలాగ్ వాడి ఉంటారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# వైజాగ్ కు ఐటీ కంపెనీల క్యూ

విశాఖపట్టణం, నవంబర్ 11

: విశాఖపట్నం ఐటీ హబ్‌గా, ఏఐ సిటీగా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. గూగుల్, టీసీఎస్ వంటి సంస్థలు రాకతో నగరంలో స్థిరాస్తికి డిమాండ్ పెరిగింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కానుండటంతో పెట్టుబడులు ఆకర్షిస్తున్నాయి. ఈ నెల 14-16 తేదీల్లో వైజాగ్ ప్రాపర్టీ ఫెస్ట్-2025 స్థిరాస్తి రంగంపై అవగాహన కల్పించనుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగరతీర నగరం విశాఖపట్నంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. నగరాన్ని ఐటీ హబ్‌గా, ఏఐ సిటీగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే గూగుల్, టీసీఎస్ కాగ్నిజెంట్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీలతో పాటుగా మరొకిన్ని సంస్థలు విశాఖపట్నంలో కంపీనలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి. మరికొన్ని ఐటీ కంపెనీలు కూడా విశాఖపట్నంవైపు చూస్తున్నారు. గత నెలలో గూగుల్ డేటా సెంటర్ ఎంవోయూతో విశాఖపట్నం దశ తిరిగింది. విశాఖపట్నం కేంద్రం ఐటీ కంపెనీలు, పర్యాటక, సేవారంగ సంస్థలు త్వరలోనే కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. ఈ క్రమంలో చాలామంది నగరంలో స్థిర నివాసం కోసం చూస్తున్నారు. నగరంలో రియల్ బూమ్ వచ్చింది.. స్థిరాస్తి రంగం కూడా నగరానికి అన్ని వైపులా విస్తరిస్తోంది.విశాఖపట్నంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతుండటంతో, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో ప్రారంభం కానుండటంతో, ప్రజలు స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారు. తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికి స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారు. దీంతో ఉత్తరాంధ్రలో నిర్మాణ రంగం పుంజుకుంది.. రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగింది. నగరంలో అన్ని ప్రాంతాల్లోనూ కొత్త నిర్మాణాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం అపార్టుమెంట్లలో పది వేలకు పైగా ఫ్లాట్లు అందుబాటులో ఉన్నాయి. వీటి ధరలు రూ.35 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉన్నాయి. విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. సొంతంగా ఇల్లు కట్టుకోవాలనుకునే వారి కోసం ఉత్తరాంధ్రలో 50 వేలకు పైగా ఖాళీ స్థలాలు సిద్ధంగా ఉన్నాయి. నరెడ్కో (జాతీయ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) గుర్తింపు పొందిన పలువురు బిల్డర్లు, అందుబాటు ధరల్లో గృహ సముదాయాలను నిర్మిస్తున్నారు.విశాఖపట్నంలో




ఈ నెల 14, 15, 16 తేదీల్లో వైజాగ్ ప్రాపర్టీ ఫెస్ట్-2025 పేరుతో ఒక ప్రత్యేకమైన స్థిరాస్తి ప్రదర్శన జరగనుంది. నరెడ్కో ఆధ్వర్యంలో గాదిరాజు ప్యాలెస్‌లో జరిగే ఈ కార్యక్రమంలో, సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు వచ్చే దేశ, విదేశీయులకు విశాఖపట్నం స్థిరాస్తి రంగంపై సమగ్ర అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రదర్శనలో వివిధ రకాల ప్రాజెక్టుల వివరాలను పండగ వాతావరణంలో అందించనున్నారు. ఈ వైజాగ్ ప్రాపర్టీ ఫెస్ట్-2025లో భాగంగా, జీఎంఆర్ ఆధ్వర్యంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నమూనాను ఒక భారీ స్టాల్‌లో ప్రదర్శిస్తారు.అలాగే, భోగాపురం ఏరియా డెవలప్‌మెంట్ కింద ఆ పరిసర ప్రాంతాల్లోని స్థిరాస్తి ప్రాజెక్టులను కూడా పరిచయం చేస్తారు. వీఎంఆర్‌డీఏ, మెట్రో ప్రాజెక్టులకు కూడా ఈ ప్రదర్శనలో ప్రత్యేక స్థానం కల్పించారు. ప్రతి గంటకు లక్కీ డ్రాలు నిర్వహిస్తారు. ఈ డ్రాలలో బైకుల్ని బహుమతులుగా అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ, యూబీఐ, ఎల్‌ఐసీ, బ్యాంకు ఆఫ్ బరోడా వంటి ప్రముఖ బ్యాంకులు పాల్గొంటున్నాయి. ప్రదర్శనలో 60కి పైగా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు.ఈ ప్రదర్శన ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఇళ్లు మాత్రమే కాదు విశాఖపట్నంలో భూముల్ని కొనుగోలు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే చాలామంది నగరంలో భూముల కొనుగోలు చేయగా.. మరికొందరు కొనుగోలు చేసే పనిలో ఉన్నారు. విశాఖపట్నంలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, ఆనందపురం, మధువాడ, అక్కయ్యపాలెం వంటి చాలా ప్రాంతాల్లో భూములకు డిమాండ్ పెరిగింది. అలాగే నగరంలోని పలు ఫ్లాట్లు కొనుగోలు చేసేందుకు జనాలు ఆసక్తి చూపిస్తున్నారు. మొత్తానికి విశాఖపట్నంలో భూమి, ఫ్లాట్లు ఉంటే చాలు వాళ్ల పంట పండినట్లే.

# ప్రతి మండలంలోనూ 20 నుంచి 30 వర్క్ స్టేషన్లు

రాజమండ్రి, నవంబర్ 11,

ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి మండలంలోనూ 20 నుంచి 30 వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వర్క్ స్టేషన్ల ఏర్పాటు కోసం ముందుకు వచ్చేవారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని ఏపీ కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఐటీ, ఐటీ ఆధారిత సంస్థల ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానంలో పనిచేసుకునేందుకు వీలుగా.. ఈ వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ వర్క్ స్టేషన్ల ద్వారా ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ చేసుకునే వెసలుబాటు కలుగుతుంది. అటు వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం నుంచి సాయం, ఉపాధి లభించనుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి మండలంలో వర్క్ స్టేషన్లు ఏర్పాటుచేయాలని సంకల్పించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో డిజిటల్ అనుసంధానమైన స్పేర్ వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి మండలంలోనూ 20 నుంచి 30 వరకూ వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. అలాగే వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసే వారికి ఆర్థిక సాయం కూడా అందించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. కేబినెట్ భేటీలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది.మరోవైపు రాష్ట్రంలోనియువతకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానంద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతున్న సంగతి తెలిసిందే. 18 నుంచి 50 ఏళ్లలోపు ఉండి.. టెక్నాలజీపై అవగాహన, విద్యార్హత కలిగిన వారికి ఈ విధానంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కౌశలం సర్వే చేపట్టారు. ప్రస్తుతం సర్వే పూర్తవగా.. వివరాలను నమోదు చేసుకున్న వారికి తదుపరి ప్రక్రియ ప్రారంభించనున్నారు. వీరితో పాటుగా.. వివిధ కంపెనీలలో పనిచేస్తూ ఇప్పటికే వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న వారికిప్రతి మండలంలో వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసి.. బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ, ఇతరత్రా సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ వర్క్ స్టేషన్‌లో కనీసం 20 నుంచి 25 మంది పని చేసుకునేలా సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తారు. మరోవైపు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగుల్లో ఏపీకి చెందిన వారు చాలా మంది ఉంటున్నారు. మారుమూల గ్రామాల నుంచి పట్టణాల వరకూ ఏపీకి చెందిన యువత ఐటీ ఉద్యోగాలు చేస్తున్నారు.

అయితే ఇలాంటి వారు ఇంటి నుంచి పనిచేసేలా వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేస్తే.. వారికి ఇంటి అద్దె, రవాణా, ఇతర ఖర్చులు తగ్గటంతో పాటుగా ఆయా కంపెనీలకు నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ వర్క్ స్టేషన్ల ఆలోచన చేశారు. ఇవి కార్యరూపం దాల్చిన తర్వాత.. ప్రభుత్వం ప్రైవేటు ఐటీ, ఇతర సంస్థల యాజమాన్యాలతో చర్చలు జరపనుంది. ఇవి అమల్లోకి వస్తే అటు ఉద్యోగులతో పాటుగా.. ఏర్పాటు చేసే వారికి కూడా ఉపాధి, ప్రభుత్వ సాయం అందుతుంది.

# ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో మూవీ టీం సందడి

విశాఖపట్నం నవంబర్ 11,

రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వంలో తిరువీర్,టీనా శ్రావ్య జోడీ గా మాస్టర్ రోహన్ కీలక పాత్రలో నటించిన చిత్రం ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో.సందీప్ అగరం, అస్మితా రెడ్డి బాసిని నిర్మించారు. కల్పనా రావు సహ నిర్మాతగా వ్యవహ రించిన ఈ సినిమా విడుదలై హిట్ టాక్ ని సంపాదించు కుంది.ఇటీవల కాలం లో వచ్చిన బెస్ట్ కామెడీ చిత్రమిదని సినిమా చూసిన ప్రేక్షకులు చెబుతు న్నారు. సోషల్ మీడియాలోనూ ఈ సినిమాపై ప్రశంసల వర్షం కురిపిస్తు న్నా సందర్భంగా విశాఖలో మూవీ టీం సందడి చేసింది.చిత్ర విజయోత్సవ ర్యాలీలో భాగంగా విశాఖలో ని ఒక సినిమా హాల్లో సినిమా యూనిట్ ప్రేక్షకులతో సినిమా చూసి అభి మానుల మధ్య ఆనందం గా విజయోత్సవం జరుపుకు న్నారు ఈ సందర్భంగా హీరో తిరువీర్ హీరోయిన్ టీనా శ్రావ్య, దర్శకుడు రాహుల్ శ్రీనివాస్, నిర్మాత బాపిరాజు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

## రైల్వే స్టేషన్లలో భద్రతా తనిఖీలు

సికింద్రాబాద్.. నవంబర్ 11

ఢిల్లీలో కారులో బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అప్రమత్తమయ్యారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లోని ప్లాట్ ఫామ్ లు, కార్ల పార్కింగ్ తో పాటు రైళ్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆర్పిఎఫ్ బాంబు డాగ్ స్క్వాడ్ సహాయంతో పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులను సైతం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలతో పాటు రైల్వే స్టేషన్ కు వచ్చే ప్రయాణికులను ప్రధాన ద్వారం వద్ద విస్తృతంగా తనిఖీ చేసిన అనంతరం లోపలికి అనుమతిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటూ భద్రత కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. జూబ్లీ బస్ స్టేషన్ లో మారేడుపల్లి పోలీసులు తనిఖీలు చేపట్టారు. బస్సులతోపాటు ప్లాట్ ఫామ్ లపై ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

## వోట్లు వేసిన ప్రధాన అభ్యర్థులు

హైదరాబాద్ , నవంబర్ 11

మంగళవారం ఉదయం 9 గంటలకు వెంకటగిరి కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ నాజర్ యూ పి స్కూల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి పోలింగ్ బూత్ నెంబర్ 301, శ్రీనగర్ కాలనీ, నాగార్జున నగర్, నాగార్జున కమ్యూనిటీ హాల్లో ఓటు వేసారు. టిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత నవోదయ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ నగర్ వెల్ఫేర్ కేంద్రంలో ఉదయం 7 గంటల నుండి 7:30 గంటల మధ్యలో తన ఓటు హక్కును ఆమె వినియోగించుకున్నారు.


## ముంచుకొస్తున్న మరో తుపాను?. అతి భారీ వర్షాలు

విశాఖపట్నం , నవంబర్ 11

ఇటీవల మొంథా తుపానుతో రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు తాజాగా మరో తుపాను హెచ్చరికను వాతావరణ శాఖ జారీ చేసింది. ఈ నెల 19 లేదా 20న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పనున్నట్లు వెల్లడించింది. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవడంతో పాటు బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నట్లు స్పష్టం చేసింది. ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది.

# ఏపీ కొత్త జిల్లాలు ఇవే

విజయవాడ, నవంబర్ 11,




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుపై కసరత్తు పూర్తయింది. ఈరోజు జరగనున్న మంత్రి వర్గ సమావేశంలో దీనిపై చర్చించే అవకాశముంది. ఏపీలో ఇప్పటి వరకూ 26 జిల్లాలు ఉండగా అదనంగా మరొక ఆరు జిల్లాలను ఏర్పాటు చేసి మొత్తం 32 జిల్లాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కొత్త జిల్లాల పునర్విభజన, ఏర్పాటుపై నియమించిన మంత్రి వర్గ ఉపసంఘం ఈ మేరకు చంద్రబాబు నాయుడుకు నివేదిక అందించింది. జిల్లాల్లో పర్యటించిన ఉపసంఘం సభ్యులు ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకుని, వారి అభ్యంతరాలను తెలుసుకున్న తర్వాత ముప్పయి రెండు నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదిక అందినట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త జిల్లాలను ఏర్పాటుచేసింది. దీంతో ఏపీలో మొత్తం 26 జిల్లాలయ్యాయి. ఆయన పార్లమెంటు నియోజకవర్గాలను ప్రాతిపదికగా చేసుకుని జిల్లాలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా జిల్లాల విభజన చేసిందన్న భావనతో కూటమి ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుకు సిద్ధమయింది. నిజంగా కొన్ని ప్రాంతాలు జిల్లా కేంద్రానికి దూరమయ్యాయి. ఒంగోలు జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉండే అద్దంకి నియోజకవర్గాన్ని బాపట్ల జిల్లాలో కలపడం కూడా అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమస్యలు అనేక చోట్ల ఉన్నాయి. అందుకే ఈ సారి జిల్లాల పునర్విభజనలో ప్రజలకు పరిపాలనపరంగా ఇబ్బందులు లేకుండా చూడాలని కూటమి ప్రభుత్వం భావిస్తుంది బంది నియోజకవర్గాలను... పలాస జిల్లా (ఇచ్ఛా పురం, పలాస, టెక్కలి, పాతపట్నం అసెంబ్లీ), శ్రీకాకుళం జిల్లా (శ్రీకాకుళం, ఆముదాలవలస, నరసన్న పేట, ఎచ్చె ర్ల, రాజాం),పార్వతీపురం మన్యం జిల్లా(పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ), విజయనగరం జిల్లాలో (విజయనగరం, చీపురుపల్లి, గజపతినగరం, నెల్లిమర్ల, శృంగవరపుకోట, బొబ్బిలి ), విశాఖపట్నం జిల్లాలో (భీమిలి, విశాఖ ఈస్ట్, స్విశాఖ వెస్ట్, స్విశాఖ నార్త్,విశాఖ సౌత్, గాజువాక, పెందుర్తి ), .. అల్లూరి సీతారామరాజు జిల్లాలో (అరకు, పాడేరు, మాడుగుల), అనకాపల్లి జిల్లాలో (అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం , యలమంచిలి, పాయకరావుపేట, తుని) కాకినాడ జిల్లాలో కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గం పేట, పెద్దాపురం, రామచంద్రాపురం) తూర్పుగోదావరి జిల్లాలో( రాజమండ్రి సిటీ,రాజమండ్రి రూరల్, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, రాజానగరం, రంపచోడవరం), బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో (అమలాపురం, ముమ్మిడివరం, గన్నవరం, రాజోలు, కొత్తపేట్ట , మండపేట)... నరసాపురం జిల్లాలో (తణుకు, ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి, తాడేపల్లిగూల్లి డెం), ఏలూరు జిల్లాలో ( ఏలూరు, దెందులూరు,ఉంగుటూరు, గోపాలపురం, చింతలపూడి, పోలవరం), మచిలీపట్నం జిల్లాలో (కైకలూరు, గుడివాడ, పెడన, మచిలీపట్నం , అవనిగడ్డ, పామర్రు), ఎన్టీఆర్ విజయవాడ జిల్లాలో (విజయవాడ ఈస్ట్, స్విజయవాడ వెస్ట్,ఈస్ట్, విజయవాడ సెంట్రల్, తిరువూరు, నూజివీడు, గన్నవరం, పెనమలూరు, మైలవరం),అమరావతి జిల్లాలో పెదకూరపాడు, తాడికొండ, మంగళగిరి,జగ్గయ్యపేట,నందిగామ), గుంటూరు జిల్లాలో ( గుంటూరు ఈస్ట్, వెస్ట్, తెనాలి, పొన్నూరు,ప్రత్తిపాడు), బాపట్ల జిల్లాలో (బాపట్ల, వేమూరు, చీరాల, రేపల్లె, పర్చూరు), పల్నా డు జిల్లాలో (నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, గురజాల, మాచర్ల, వినుకొండ), మార్కా పురం జిల్లాలో మార్కా పురం, ఎర్రగొం డపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి), ఒంగోలుజిల్లాలో (ఒంగోలు, అద్దంకి, సంతనూతలపాడు, కొం డెపి,కందుకూరు) అసెంబ్లీ నియోజకవర్గాలుండనున్నాయి.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ( నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కావాలి, కోవూరు, ఉదయగిరి), గూడూరు జిల్లాలో( గూడూరు, వెంకటగిరి, సర్వేపల్లి, సూళ్లూరుపేట), . శ్రీ బాలాజీ తిరుపతి జిల్లాలో (తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి, చంద్రగిరి), చిత్తూరు జిల్లాలో (చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు,పలమనేరు, కుప్పం), మదనపల్లి జిల్లాలో (మదనపల్లి, పీలేరు, పుంగనూరు, తంబళ్లపల్లి), శ్రీ సత్యసాయి జిల్లాలో( హిందూపురం, కదిరి, ధర్మవరం,పుట్టపర్తి, పెనుగొండ, మడకశిర), అనంతపురం జిల్లాలో (అనంతపురం, రాయదుర్గం , కళ్యాణదుర్గం , గుంతకల్లు, ఉరవకొండ, రాప్తాడు, శింగనమల, తాడిపర్తి), ఆదోని జిల్లాలో (ఆదోని, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు,మంత్రాలయం), కర్నూలు జిల్లాలో (కర్నూలు, డోన్, నందికొట్కూరు, కోడుమూరు),నంద్యాల జిల్లాలో నంద్యాల, శ్రీశైలం, ఆళ్లగడ్డ, బనగానపల్లె, పాణ్యం), వైఎస్సా ర్ కడప జిల్లాలో (కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు,మైదుకూరు, కమలాపురం, పులివెందుల), అన్నమయ్య జిల్లాలో (రాజంపేట, రైల్వే కోడూరు, రాయచోటి, బద్వే లు) అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అయితే ఇది అధికారిక సమాచారం కాదు. అందిన సమాచారం మాత్రమే.

==========

# తీర ప్రాంతాల్లో భారీగా క్లస్టర్లు...

ఒంగోలు, నవంబర్ 11

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసింది. తీరం వెంబడి పోర్టులతో పాటు పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే సేవలు అందిస్తున్న పోర్టులతో పాటు.. నిర్మాణంలో ఉన్న పోర్టుల సమీపంలో పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటుకి సిద్ధమవుతోంది. ఈ మేరకు పోర్ట్ ప్రాక్సిమల్ ఏరియాలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 1,220 కోట్లు కేటాయించాలనే ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. ఒక్కో పోర్టు సమీపంలో వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నారు.ఆంధ్రప్రదేశ్‌కు సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. పోర్టులు, అనుబంధ పరిశ్రమలతో లక్షల మందికి ఉపాధి కల్పించే సామర్థ్యం ఈ తీర ప్రాంతానికి ఉంది. అయితే చాలా ప్రభుత్వాలు తీర ప్రాంత అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లలేకపోయాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తీర ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించింది. రాష్ట్రంలోని తీర ప్రాంతంలో పోర్టులు.. వాటికి అనుసంధానంగా పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక రూపొందించింది. తీర ప్రాంతం వెంట జిల్లాల్లో మారిటైం ప్రాజెక్టులు తెచ్చేలా ప్రణాళికలు రూపొందించింది. అందుకోసం పోర్ట్ ప్రాక్సిమల్ ఏరియా.. అంటే పోర్టు నుంచి కనీసం రెండు మూడు కి.మీ. పరిధిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి రూ. రూ.1,220 కోట్లతో ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.ఓడరేవు సమీపంలో జరిగే కార్యకలాపాలకు అనుగుణంగా.. ఆయా క్లస్టర్లు అభివృద్ధి చేయనున్నారు. దాని కోసం పోర్టుకు సమీపంలో ఉన్న ఉప్పు భూములను వినియోగించుకోవాలని భావిస్తున్న ప్రభుత్వం.. ఆ భూములను రాష్ట్రానికి కేటాయించేలా కేంద్రాన్ని కోరాలని ప్రయత్నాలు చేస్తోంది. ఇలాంటి పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధితో పాటు.. పోర్టు ప్రాక్సిమల్ ప్రాంతంలో ఉన్న గ్రామాలను కలుపుకుని నగరాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నగరాలకు కావాల్సిన మౌలికసదుపాయాల నిర్మాణానికి.. సాగరమాల 2.0 నిధులు ఉపయోగించుకునేలా ప్రణాళికలు రచిస్తోంది.ఏపీలో ఇప్పటికే విశాఖపట్నం, కాకినాడ, గంగవరం, కృష్ణపట్నంలో పోర్టులు ఉన్న సంగతి తెలిసిందే. వీటికి అదనంగా.. మచిలీపట్నం, రామాయపట్నం, మూలపేట, కాకినాడ సెజ్‌లో కొత్త పోర్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతేకాకుండా నావల్ ఆల్టర్నేటివ్ ఆపరేషన్స్ కోసం రాంబిల్లిలో.. మరో పోర్టును నిర్మిస్తున్నారు. వీటికి అదనంగా నక్కపల్లి, దుగరాజపట్నంలో పోర్టులు నిర్మించాలని ప్రభుత్వం అనుకుంటోంది. ఇలా ప్రతి 50 కిలోమీటర్లకు ఓ పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్లు, పోర్టు ఆధారిత పారిశ్రామిక క్లస్టర్లు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.ఇప్పటికే ఉన్న విశాఖపట్నం పోర్టు సమీపంలో సముద్ర ఆధారిత వాణిజ్యాన్ని ప్రోత్సహించేలా క్లస్టర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయి. మూలపేట పోర్టు సమీపంలో రసాయన పరిశ్రమలు, వాటికి అనుబంధ కార్యకలాపాలు నిర్వహించే యూనిట్ల క్లస్టర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాంబిల్లిలో నిర్మిస్తున్న పోర్టు సమీపంలో రక్షణరంగ పరిశ్రమల కోసం క్లస్టర్.. కాకినాడలో పెట్రోలియం ఆయిల్, లూబ్రికెంట్స్ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా క్లస్టర్.. మచిలీపట్నంలో హెవీ ఇంజినీరింగ్, ఆటోమొబైల్ రంగానికి సంబంధించిన క్లస్టర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇలా రామాయపట్నం, కృష్ణపట్నం, దుగ్గరాజపట్నం వంటి పోర్టుల సమీపంలో.. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రంగాలకు చెందిన పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

# అన్నవరంలో తిరుమల తరహా సేవలు



కాకినాడ, నవంబర్ 11

తిరుమల తరహాలోనే అన్నవరం సత్యదేవుని ఆలయంలోనూ భక్తులకు సేవ చేసే అవకాశం కల్పిస్తున్నారు. కార్తీక మాసం సందర్భంగా 5,225 మందికి పైగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రతిరోజూ సుమారు 200 మంది వాలంటీర్లు అన్నదానం, క్యూలైన్ల నిర్వహణ వంటి పనుల్లో తోడ్పడుతున్నారు. ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునేవారు ఆలయ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.తిరుమల శ్రీవారి ఆలయం, అనుబంధ ఆలయాల్లో భక్తులు సేవ చేసే అవకాశం కల్పిస్తోంది టీటీడీ. ఇదే తరహాలో రాష్ట్రంలో ప్రధాన ఆలయాల్లో కూడా సేవకు అవకాశం కల్పిస్తోంది. అన్నవరం సత్యదేవుని ఆలయంలో కూడా సేవలందించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఏకంగా 5,225 మంది ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం విశేషం. ప్రస్తుత కార్తీక మాసం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో ప్రతిరోజూ సుమారు 200 మంది వాలంటీర్లు సేవలు అందిస్తున్నారు. భక్తులు 25, 50, 100 మందితో బృందాలుగా ఏర్పడి సేవలు అందిస్తున్నారు.ఈ వాలంటీర్ల సేవలు అన్నవరం ఆలయ నిర్వహణకు ఎంతో తోడ్పడుతున్నాయి. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో వీరి పాత్ర కీలకం. అధికారులు వీరిని ఆలయ ప్రధాన సేవలు, అన్నదానం, భక్తులకు మంచినీటి సరఫరా, క్యూలైన్లలో సేవలందించేందుకు కేటాయిస్తున్నారు. బృందాలుగా ఏర్పడిన వాలంటీర్లకు వారి విధుల గురించి ముందుగానే తెలియజేస్తున్నారు. రోజువారీ పనులు, భక్తుల రద్దీ, పండుగల సమయంలో అవసరమయ్యే వాలంటీర్ల సంఖ్యను అధికారులు అంచనా వేసి, ఆ మేరకు వారికి సమాచారం అందిస్తారు. దీనివల్ల సేవా కార్యక్రమాలు సజావుగా సాగుతున్నాయి. రాబోయే రోజుల్లో సేవకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.అన్నవరం సత్యదేవుడి ఆలయంలో భక్తులకు సేవ చేయాలనుకునే సేవకులు ఆలయ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆసక్తి ఉన్న తెలుగు రాష్ట్రాల భక్తులు వెంటనే.. వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. అక్కడ నావలజీ శ్రీవాణిజబిశీపతినిని ఆప్షన్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసుకుంటే సరిపోతుంది. 'భక్తులు సేవ పేరు, ఎన్ని రోజులు, బృందాలుగా, వ్యక్తిగతంగా సేవ చేస్తారా, ఎందరు సభ్యులు, అన్నదానం, రద్దీ' తదితర అంశాలు.. ఎక్కడ సేవ చేయాలనుకుంటున్నారో కూడా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. టీమ్ ప్రతినిధి ఫోటో, ఐడీ కార్డు, పేరు, డేట్ ఆఫ్ బర్త్, వయసు, మొబైల్ నంబర్, ఫిట్‌గా ఉన్నారా లేదా, అడ్రస్ వంటి పూర్తి వివరాలు నమోదు చేయాలి. టీమ్‌లుగా సేవ చేయాలనుకుంటే కనుక.. టీమ్ సభ్యుల పేర్లు, వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. భక్తులు నమోదు చేసిన వివరాలు పరిశీలించిన అనంతరం ఆలయ గుర్తింపుకార్డు అందజేస్తారు. భక్తులకు సేవ చేయాలనుకునే సేవకులు నేరుగా ఆలయానికి వచ్చి కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలియజేశారు. భక్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అన్నవరం మాత్రమే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన ప్రధాన ఆలయాల్లో కూడా ఇలాగే సేవకులుగా సేవ చేసేందుకు భక్తులు ముందుకు వస్తున్నారు.

## సిరల గ్రామపంచాయతీని సందర్శించిన ఎంపీఓ జాదవ్ ప్రదీప్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 11 ( భారత శక్తి): ఫ్రైడే డ్రైడే కార్యక్రమం లో భాగంగా ఎంపీ ఓ. జదవ్ ప్రదీప్ మంగళవారం సిరల గ్రామపంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. ఆ తర్వాత కార్యాలయంలోని ఫైళ్లను పరిశీలించారు.

గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్‌తో ఎంపీఓ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు గ్రామంలో పరిశుభ్రత కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత పరిరక్షణలో ఎలాంటి లోపాలు రాకుండా చూడాలని, ప్రజల్లో పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

# 2029 కోసం పక్కా ప్లాన్...

గుంటూరు, నవంబర్ 11,

వైఎస్ జగన్మోహన్ రెడ్డి గట్టిగానే ప్లాన్ చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎదురైన దారుణ పరాజయాన్ని గుణపాఠంగా మార్చుకున్నారు. 2029 ఎన్నికలు అంత ఈజీగా తనకు అనుకూలంగా మారవని ఆయన గ్రహించారు. అందుకు చాలా కష్టపడాల్సి ఉంటుందని గుర్తించారు. అందుకు సంబంధించి కార్యాచరణను తయారు చేస్తున్నారు. ప్రజల మధ్యకు వెళ్లి.. వారితో మమేకమై.. 2029 ఎన్నికలను ఎదుర్కోవాలన్నది జగన్మోహన్ రెడ్డి ప్రణాళికగా తెలుస్తోంది. 2026 జనవరి నుంచి జనం బాట పట్టాలని ఒక షెడ్యూల్ నిర్ణయించుకున్నట్లు సమాచారం.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత జగన్మోహన్ రెడ్డి ఎక్కువగా బెంగళూరుకు పరిమితం అవుతున్నారు. వారంలో మూడు రోజులు పాటు మాత్రమే తాడేపల్లి వస్తున్నారు. మధ్యలో ప్రత్యేక కారణాలు చెప్పి రావడం కూడా మానేస్తున్నారు. ఈ క్రమంలో జగన్ వైఖరి పై సొంత పార్టీ శ్రేణులే విమర్శించే పరిస్థితి ఉంది. అందుకే ఇక్కడ నుంచి తాడేపల్లిలో అందుబాటులో ఉంటూ ఎన్నికల వరకు అదే పనిగా ప్రజల్లో ఉండాలని జగన్మోహన్ రెడ్డి సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో కూటమికి అవకాశం ఇవ్వకూడదని.. వచ్చే ఎన్నికల్లో ఆ మూడు పార్టీలు మళ్లీ కలిసి వెళ్లాయన్నది ఇప్పటికే ఒక స్పష్టత వచ్చింది కూడా. అందుకే దూకుడు పెంచాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు.ఈ రెండు నెలల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం పూర్తి చేయనున్నారు. నియోజకవర్గ ఇన్చార్జిలతో పాటు జిల్లా బాధ్యులు, రీజనల్ కోఆర్డినేటర్ల నియామకం పూర్తి చేయనున్నారు. పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను, బాధ్యులను నియమించే ప్రక్రియ పూర్తి చేయనున్నారు. జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర మొదలుకానుంది. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి వారానికి నాలుగు రోజులపాటు పర్యటించేలా ప్లాన్ చేస్తున్నారు. జూన్ నాటికి ఈ బస్సు యాత్ర ద్వారా జిల్లాల పర్యటనను పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. జూలైలో పార్టీ ప్లీనరీని ఏర్పాటు చేసి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారు. 2027లో మొదలయ్యే పాదయాత్ర.. 2029 ఎన్నికలు ఎలా ఎదుర్కోవాలి అనే దానిపై పార్టీ శ్రేణులకు కీలక ఆదేశాలు ఇస్తారు జగన్మోహన్ రెడ్డి. అయితే ఈసారి దాదాపు 5 వేల కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రకు ప్లాన్ చేస్తున్నారు.అయితే గతం మాదిరిగా జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర అంత సులువుగా సాగే అవకాశం లేదు. ఎందుకంటే లోకేష్ పాదయాత్ర సమయంలో జరిగిన పరిణామాలు తెలుసు. పైగా మునుపటిలా అన్ని వర్గాల ప్రజలు జగన్మోహన్ రెడ్డిని ఆదరించే పరిస్థితి ఉండదు. ఎందుకంటే గతంలో పాదయాత్ర చేసిన సమయంలో చాలా వర్గాలకు ఎన్నో హామీలు ఇచ్చారు. కానీ వాటిని నెరవేర్చలేకపోయారు. కేవలం పథకాల ద్వారా సంతృప్తి పరచాలని చూశారు. అయితే లోకేష్ పాదయాత్ర సమయంలో చంద్రబాబు అరెస్టు జరిగింది. ఆ సమయంలో లోకేష్ పాదయాత్రకు బ్రేక్ ఇచ్చారు. అటువంటి పరిస్థితి జగన్మోహన్ రెడ్డికి కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. పైగా జగన్మోహన్ రెడ్డి మునుపటిలా పాదయాత్రలో ఉత్సాహంగా ఉండే అవకాశం కూడా లేదు. ఎందుకంటే అప్పట్లో బలమైన ప్రతిపక్ష నేతగా ఉండేవారు.


## కోల్డ్ వేవ్ షురూ అయింది...

అదిలాబాద్, నవంబర్ 11

తెలుగు రాష్ట్రాల ప్రజలను నిన్నటి వరకు ఎడతెరిపిలేని వర్షాలు హడలెత్తించాయి. ఇటీవల మొంథా తుపాన్ రెండు రాష్ట్రాల్లో విధ్వంసం సృష్టించింది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తుపాను ప్రభావం తగ్గడంతో ఇప్పుడిప్పుడే ఇబ్బందుల నుంచి బయటపడుతున్నారు. వర్షాలు కూడా పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టాయి. అయితే, ఇప్పుడు తెలుగు రాష్ట్రాల ప్రజలపై చలి పులి పంజా విసురుతోంది. భయంకర కోల్డ్ వేవ్ కారణంగా వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మూడ్రోజులు జాగ్రత్తగా ఉండాలంటూ సూచనలు చేసింది.ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో చలి పంజా విసురుతోంది. రెండుమూడు రోజులుగా ఉదయం, రాత్రి వేళల్లో చలి గజగజలాడిస్తుంది. అయితే, వచ్చే మూడ్రోజులు సోమ, మంగళ, బుధ వారాల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో రెండు నుంచి మూడు డిగ్రీల సెల్సియస్ వరకు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

తెలంగాణ వ్యాప్తంగా ఈ ఏడాది వర్షాలు దంచికొట్టాయి. బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాల కారణంగా ఎడతెరిపిలేని వర్షాలు కురిశాయి. దీనికితోడు ప్రస్తుతం ఉత్తర, ఈశాన్య ప్రాంతాల నుంచి దిగువ స్థాయి గాలులు రాష్ట్రం వైపు వీస్తుండటంతో చలి తీవ్రత పెరుగుదలకు దోహదం చేస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారశనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గాయి. పటాన్ చెరులో 16.8 డిగ్రీల సాధారణ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కావాల్సి ఉండగా.. 3.6 డిగ్రీలు తగ్గి 13.2 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. అదిలాబాద్ లో 14.2, మెదక్ జిల్లాలో 14.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఇదిలాఉంటే.. నవంబర్ నెలలో చలి విజృంభణ కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా నవంబర్ 11 నుంచి 19వ తేదీ వరకు అతి చల్లని గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు అలర్ట్ జారీ చేశారు.

# నిర్లక్ష్యమే ప్రాణం తీసిందా




హైదరాబాద్, నవంబర్ 11

అందెశ్రీ అకస్మాత్తుగా చనిపోవడం యావత్ తెలంగాణ మొత్తంగ్ర్భ్భంతికి గురైంది.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి మొదలుపెడితే ఉద్యమకారుల వరకు కన్నీరు పెడుతున్నారు.. ఈ దారుణమైన పరిణామాన్ని తట్టుకోలేక నిర్వేదంలో మునిగిపోయారు. వాస్తవానికి అందెశ్రీ చనిపోవడం నిజంగా ఒక షాకింగ్ లాంటి వార్త. ఆరోగ్యంగా ఉన్న అందెశ్రీ.. ఉన్నట్టుండి ఎందుకు కుప్పకూలిపోయారు.. కుటుంబ సభ్యులు చూస్తుండగానే ఎందుకు చనిపోయారు? ఇప్పుడు ఈ ప్రశ్నలే సగటు తెలంగాణ వాదిని తొలుస్తున్నాయి.

గాంధీ హాస్పిటల్ హెచ్వోడి సునీల్ కుమార్ అందెశ్రీ మృతికి సంబంధించి కీలక విషయాలను వెల్లడించారు.. అందెశ్రీ ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాలని ఆయన పేర్కొన్నారు. అందెశ్రీ గడిచిన ఐదు సంవత్సరాలుగా హైపర్ టెన్షన్ తో ఇబ్బంది పడుతున్నారు.. ఒక నెల నుంచి ఆయన మందులు సరిగ్గా వాడడం లేదు. మందులు సరిగ్గా వాడకపోవడం వల్ల ఆయాసంతో ఇబ్బంది పడుతున్నారు.. చాతి భాగంలో కూడా ఆయనకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. వ్యక్తిగత ఆరోగ్య విషయంలో అందెశ్రీ నిర్లక్ష్యాన్ని కొనసాగించడం వల్లే చనిపోయారని సునీల్ కుమార్ పేర్కొన్నారు..ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత అందెశ్రీ మామూలుగానే పడుకున్నారు.. ఉదయం లేచి చూసేసరికి బాత్రూం వద్ద కింద పడిపోయారు.. అయితే ఆ రాత్రి ఏం జరిగిందనేది కుటుంబ సభ్యులకు తెలియదు.. సోమవారం తెల్లవారుజామున 6 గంటల 20 నిమిషాల ప్రాంతంలో కుటుంబ సభ్యులు అందశ్రిని కుటుంబ సభ్యులు గమనించారు.. వెంటనే గాంధీ ఆసుపత్రికి తీసుకువచ్చారు.. అందెశ్రీని పరీక్షించిన గాంధీ ఆసుపత్రి ఆర్ ఎం వో చనిపోయాడని నిర్ధారించారు.. అయితే ఆయన చనిపోయి అప్పటికే ఐదు గంటలు కావచ్చని గాంధీ ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు..తనకు అనారోగ్యంగా ఉన్నప్పటికీ కూడా వైద్యులను సంప్రదించకుండా అందెశ్రీ నిర్లక్ష్యం చేశారని.. గత నెల రోజులుగా ఆయన బీపీ మాత్రలు వేసుకోవడం లేదని వైద్యులు పేర్కొన్నారు.. వ్యక్తిగత ఆరోగ్యాన్ని అందెశ్రీ పరిరక్షించుకుంటే ఇక్కడ దాకా వచ్చేది కాదని గాంధీ ఆసుపత్రి వైద్యులు వివరించారు.. ఆయన ప్రతిరోజు నడకకు వెళ్లేవారని.. ఇదే క్రమంలో బీపీ మాత్రలు వేసుకొని ఉంటే పరిస్థితి ఇక్కడ దాకా వచ్చేది కాదని వైద్యులు పేర్కొంటున్నారు.. బీపీ మాత్రలు వేసుకోకపోవడం వల్ల హఠాత్తుగా గుండెపోటు వచ్చి ఉంటుందని.. అందువల్లే అందెశ్రీ చనిపోయారని వైద్యులు చెబుతున్నారు. హైపర్ టెన్షన్ ఉన్న వారు క్రమం తప్పకుండా మందులు వాడాలి.. మందులు వాడే విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సరే ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది.

కలల సౌధం పూర్తికాకుండానే

తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' రచయిత, ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ ఆకస్మిక మరణం సాహితీ లోకాన్ని, రాజకీయ వర్గాలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. అన్నిటికంటే బాధాకరం ఏంటంటే... ఆయన ఎంతో ఇష్టంతో, ఆశగా నిర్మించుకుంటున్న తన 'కలల సౌధం' పూర్తి కాకముందే ఈ లోకాన్ని విడిచివెళ్లడం. కొన్ని రోజుల్లోనే ఆ కొత్త ఇంట్లోకి అడుగుపెట్టాలనుకున్న ఆయన కోరిక నెరవేరలేదు.అందెశ్రీ తన జీవిత చరమాంకంలో కొత్త ఇంటి నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించిన సందర్భంగా.. ఆయనకు కోటి రూపాయల నజరానాతో పాటు, ఇంటి నిర్మాణానికి అవసరమైన 348 గజాల స్థలాన్ని కూడా బహుకరించింది. ఆయన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్.ఎఫ్.సి. నగర్ లోని ఆ స్థలంలో ఉ+3 పెంట్ హౌస్ నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. అందెశ్రీకి ఆ ఇంటి నిర్మాణంపై ఎంత మమకారం ఉందంటే.. చనిపోయే ముందు రోజు 2025, నవంబర్ 09వ తేదీ సాయంత్రం వరకు ఆయన అక్కడే గడిపారు. తానే స్వయంగా దగ్గర ఉండి నిర్మాణ పనులను పర్యవేక్షించి వెళ్లినట్లు మేస్త్రీలు, కాంట్రాక్టర్లు , కుటుంబ సభ్యులు తెలిపారు.

# సెహభాష్... తెలంగాణ పోలీస్




హైదరాబాద్, నవంబర్ 11,

మనం అనేక సందర్భాల్లో చెప్పుకున్నాం కదా.. పోలీసుల మీద రాజకీయ ఒత్తిడి లేకుంటే.. పోలీసులను వారి పని వారిని చేసుకొనిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని.. అసాంఘిక శక్తుల ఆటలు సాగవని.. సంఘవిద్రోహశక్తుల దుర్మార్గాలు ముందుకెళ్లవని.. అలాంటి పనిని తెలంగాణ పోలీసులు చేసి చూపించారు. యావత్తు దేశం మొత్తం తమ వైపు చూసుకునేలా చేశారు.నేటి స్మార్ట్ కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దుర్మార్గులు రకరకాల విధాలుగా ప్రజలను మోసం చేస్తున్నారు.. మెసేజ్లు పంపించడం.. లింకులు సెండ్ చేయడం.. డిజిటల్ అరెస్టులు.. మాదక ద్రవ్యాలు దొరికాయని చెప్పడం.. ఇలా రకరకాల విధానాల్లో మోసాలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు సైబర్ నేరగాళ్లు.. ఇలా అమాయకులను మోసం చేస్తే కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. పైగా ఈ డబ్బులను రకరకాల విధానాలలో మార్చేస్తూ తమ వద్దకు తెచ్చుకుంటున్నారు. ఇలా దొంగిలించిన డబ్బులను మ్యూల్ ఖాతాల సహాయంతో తమ వద్దకు తెచ్చుకుంటున్నారు.. అయితే ఈ తరహా మోసాలు ఇటీవల అధికంగా పెరగడంతో తెలంగాణ సైబర్ పోలీసులు దృష్టి సారించారు. అంతే కాదు సరికొత్త ఆపరేషన్ చేసి యావత్ దేశం మొత్తం తమ వైపు చూసేలా చేశారు.తెలంగాణ పోలీసులకు ఇటీవల కాలంలో సైబర్ ఫిర్యాదులు పెరిగిపోయాయి. తెలంగాణ సైబర్ పోలీసులు ఎన్ని విధాలుగా అవగాహన కల్పించినప్పటికీ నేరాలు తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల తమకు అందిన ఫిర్యాదుల ఆధారంగా తెలంగాణ సైబర్ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.. అయితే ఈ తీగను తెలంగాణలో లాగితే ఐదు రాష్ట్రాల్లో డొంక కదిలింది.. 95 కోట్ల స్కాం బయటపడింది.. అంతేకాదు 81 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.. తెలంగాణలో వచ్చిన సైబర్ మోసంపై పోలీసులు దర్యాప్తును మొదలుపెట్టారు.. మోసానికి పాల్పడిన వ్యక్తులు మొత్తం కూడా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటకలో ముఠాలుగా ఏర్పడ్డారని పోలీసుల విచారణలో తేలింది. ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో దాడులు నిర్వహించింది. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, ఏడుగురు మహిళలు, 58 మంది మ్యూల్ ఖాతాదారులు ఉన్నారు.నిందితుల నుంచి పోలీసులు 84 సెల్‌ఫోన్లతో పాటు 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న కోట్లాది రూపాయల నగదును సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఫ్రీజ్ చేశారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఈ మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేయనున్నారు.అంతేకాదు 81 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిపై 754 కేసులు ఉన్నాయి. 95 కోట్ల విలువైన మోసాలకు వీరు పాల్పడ్డారు. వారి వద్ద నుంచి 84 ఫోన్లు, 101 సిమ్ లు, 89 బ్యాంకు పాస్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాదు వారి ఖాతాలో ఉన్న కోట్ల నదులు మొత్తం ఫ్రీజ్ చేశారు.. తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసుల ఆపరేషన్లలో ఇది అతి పెద్దదని తెలుస్తోంది.

## పర్యాటక శాఖలో భారీగా ఉద్యోగాలు

హైదరాబాద్, నవంబర్ 11,

తెలంగాణ పర్యాటక రంగం చరిత్రలోనే తొలిసారిగా రూ. 13,819 కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించింది. ఈ నిధులు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా దేశీయ, అంతర్జాతీయ డెవలపర్ల నుంచి వచ్చాయి. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 17,960 మందికి పైగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. వికారాబాద్, బుద్ధవనం, సోమశిల వంటి ప్రాంతాల్లో ఎకో, అడ్వెంచర్ టూరిజం ప్రాజెక్టులతో పాటు, హైదరాబాద్‌లో ఒబెరాయ్, సెయింట్ రెజిస్ వంటి లగ్జరీ హోటళ్లు ఏర్పాటు కానున్నాయి.తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు పర్యాటక రంగంలో అంతర్జాతీయ గమ్యస్థానంగా రూపుదిద్దుకోబోతోంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత టూరిజం రంగంలో ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడులు రావడం ఇదే మొదటిసారి. దేశీయ, అంతర్జాతీయ డెవలపర్ల నుంచి రూ. 13,819 కోట్ల భారీ పెట్టుబడులు ఆకర్షించినట్లు రాష్ట్ర పర్యాటక శాఖ ప్రకటించింది. ఈ పెట్టుబడుల ద్వారా 17,960 మందికి పైగా ఈ రంగంలో ప్రత్యక్షంగా ఉ ద్యోగావకాశాలు లభించనున్నాయి. తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా పర్యాటక రంగ అభివృద్ధికి కొత్త బాటలు పడుతున్నాయి.ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టే 14 ప్రాజెక్టులకు గాను రూ. 7,081 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీని ద్వారా సుమారు 8,920 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. అలాగే.. పూర్తిగా ప్రైవేట్ భాగస్వామ్యంతో 17 ప్రాజెక్టులు చేపట్టేందుకు డెవలపర్లు ముందుకు రాగా.. రూ. 6,738 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 9,040 ఉద్యోగాలు కల్పించనున్నారు. హైదరాబాద్‌తో పాటు వికారాబాద్, నాగార్జున సాగర్, బుద్ధవనం, అమరగిరి, సోమశిల, అమ్రాబాద్ తదితర ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఈ పెట్టుబడులు కేంద్రీకృతమవుతున్నాయి.ఎకో, అడ్వెంచర్ టూరిజాన్ని ప్రోత్సహిస్తున్నారు. ట్రెక్కింగ్, సఫారీ, ఫారెస్ట్ రిసార్టులు ఏర్పాటు కానున్నాయి. మేఘా ఇంజనీరింగ్ సంస్థ అనంతగిరి హిల్స్‌లో 81 ఎకరాల్లో రూ. 1,021 కోట్లతో లగ్జరీ 'లా వీ వెల్‌నెస్ రిట్రీట్'ను నిర్మిస్తున్నది. బుద్ధవనంలో వెడ్డింగ్, వెల్‌నెస్ సెంటర్లు అభివృద్ధి చేస్తున్నారు. మహాబోధి సొసైటీ, థైవాన్ ఫోగువాంగ్ షాన్ వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా ఇక్కడ బుద్ధిస్ట్ మిషనరీ మెడిటేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేయనున్నాయి. కృష్ణా నది బ్యాక్‌వాటర్‌లోని సోమశిలను డెస్టినేషన్ వెడ్డింగ్స్ , అడ్వెంచర్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు.రామోజీ గ్రూప్ రామోజీ ఫిల్మ్ సిటీలో 600 ఎకరాల్లో కొత్త టూరిజం ఆకర్షణల కోసం రూ. 2,000 కోట్లు పెట్టుబడి పెడుతున్నది. సినిమా పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ, మాస్టా స్టూడియోస్ రూ. 550 కోట్లతో 'బాహుబలి థీమ్ పార్క్‌ను' నిర్మించనున్నది. హైదరాబాద్ నగరం కూడా లగ్జరీ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల హబ్‌గా మారుతోంది. ప్రెస్టీజ్ గ్రూప్ రాయదుర్గంలో ఒబెరాయ్‌తో 5-స్టార్ హోటల్ , బుద్వేల్‌లో సెయింట్ రెజిస్ హోటల్ వంటి అంతర్జాతీయ లగ్జరీ బ్రాండ్‌లతో ప్రాజెక్టులు చేపడుతున్నది. శంషాబాద్‌లో సిటాడెల్ హోటల్స్ రూ. 500 కోట్లతో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తుండగా.. నియోపోలీస్‌లో బ్రిగేడ్ గ్రూప్ ద్వారా ఇంటర్‌కాంటినెంటల్ హోటల్ రాబోతోంది. ఈ భారీ పెట్టుబడులతో తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరడమే కాకుండా.. రాష్ట్రం పర్యాటక రంగంలో ప్రపంచ పటంలో కీలక స్థానం సంపాదించనుంది

# నిజామాబాద్ లో భారీగా అక్రమ రేషన్ కార్డులు

హైదరాబాద్, నవంబర్ 11, (

జామాబాద్ జిల్లాలో కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.



క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం, లంచాల కారణంగా అనర్హులకు సైతం తెల్ల రేషన్ కార్డులు కేటాయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అర్హులైన పేదల కంటే లక్షకు పైగా ఎక్కువ కుటుంబాలకు కార్డులు మంజూరు కావడం దీనికి నిదర్శనం.తెలంగాణ ప్రభుత్వం ఇటీవల కొత్త రేషన్ కార్డులు జారీ చేసిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను.. ఎన్నికల హామీలో భాగంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ప్రారంభించింది. కొత్త కార్డుల మంజూరుకు దరఖాస్తులు స్వీకరించడంతో పాటు, పాత కార్డుల్లో అదనపు పేర్ల నమోదుకు కూడా అవకాశం కల్పించింది. అయితే కొన్ని చోట్ల అనర్హులు కూడా అక్రమంగా కార్డులు పొందారు. నిజామాబాద్ జిల్లా అర్బన్ ప్రాంతంలో కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం, కొందరు ఉద్యోగుల వసూళ్ల కారణంగా దారిద్ర్య రేఖకు దిగువన (ఃఖఒ) ఉన్న అర్హులను పక్కనపెట్టి.. ఆర్థికంగా స్థితిమంతులైన అనర్హులకు సైతం కొత్త 'ఆహార భద్రత' కార్డులు కేటాయించినట్లు తెలుస్తోంది.మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారించి, దరఖాస్తుదారులు బీపీఎల్ పరిధిలో ఉన్నారా లేదా అని నిర్ధారించాల్సి ఉంటుంది. కానీ, జిల్లాలోని ఏ మండలంలోనూ సరైన విచారణ జరగలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిశీలన కేవలం తూతూమంత్రంగానే జరిగిందని స్పష్టమవుతోంది. విచారణ సమయంలో కొందరు సిబ్బంది రూ.2 వేల నుంచి రూ. వేల వరకు వసూళ్లకు పాల్పడ్డారని.. తద్వారా ప్రభుత్వ, కాంట్రాక్టు ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లించే వారు వంటి అనర్హులు సైతం సులభంగా రేషన్ కార్డులు పొందారని తెలుస్తోంది. తహసీల్దార్ కార్యాలయాల నుంచి డీసీఎస్‌వో (జిల్లా పౌరసరఫరాల శాఖ) ఆమోదానికి వెళ్లిన దరఖాస్తులను సంబంధిత అధికారులు ఆమోదించడంతో అనర్హులకు కార్డులు మంజూరయ్యాయి.నిజామాబాద్ జిల్లాలో అనర్హులకు కార్డులు మంజూరయ్యాయనడానికి అధికారిక లెక్కలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా జనాభా 15,71,022 కాగా.. మొత్తం కుటుంబాల సంఖ్య 3,69,031. కానీ, ప్రస్తుత లెక్కల ప్రకారం జిల్లాలో తెల్ల రేషన్ కార్డులు పొందిన కుటుంబాల సంఖ్య ఏకంగా 4,92,806. అంటే, గత జనాభా లెక్కల్లో గుర్తించిన మొత్తం కుటుంబాల సంఖ్య కంటే లక్షకు పైగా కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు కావడం గమనార్హం. ప్రభుత్వ పథకాల లబ్ధి కోసమే కొందరు అడ్డదారుల్లో కార్డులు పొందినట్లు స్పష్టమవుతోంది. జిల్లాలో ప్రస్తుతం 31 మండలాలు, 640 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపాలిటీలు ఉండగా, 759 రేషన్ దుకాణాల ద్వారా 4,92,806 కార్డుల్లోని 16,98,898 మంది సభ్యులకు ఆహార ధాన్యాలు పంపిణీ అవుతున్నాయి.ఈ అక్రమాలను అరికట్టేందుకు రెవెన్యూ ప్రత్యేక బృందాలతో ప్రతి కార్డును పక్కాగా పరిశీలన చేపడితేనే అనర్హులెవరో తెలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అనర్హుల కార్డులు రద్దైతే అర్హులైన పేదలకు కొత్త కార్డులు మంజూరు చేయవచ్చునని.. తద్వారా ప్రభుత్వంపై పడుతున్న ఉచిత సన్న బియ్యం పంపిణీ భారం కూడా తగ్గుతుందని అంటున్నారు. ఈ అంశంపై విచారణ జరిపి.. అనర్హులు కార్డులు పొందినట్లు తేలితే వాటిని రద్దు చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు స్పష్టం చేశారు

# కొత్త కాంగ్రెస్ వర్సెస్ పాత కాంగ్రెస్

రంగారెడ్డి, నవంబర్ 11,

ఒకప్పుడు ఆయన అధికార పార్టీ ఎమ్మెల్యే. బీఆర్ఎస్ హయాంలో ఆ నియోజకవర్గంలో ఆయన హవానే వేరు. ఆయన ఎంత చెప్తే అంత అన్నట్లుగా ఉండేది పరిస్థితి. కానీ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడింది. తాను గెలిచినా తన పవర్ తగ్గినట్లు అర్థమైంది. దీంతో ఆ ఎమ్మెల్యే కారు దిగి హస్తం గూటికి చేరిపోయారు. అయితే తాను అనుకున్నది ఒక్కటి ..అయిందొక్కటి అన్నట్లుగా తయారైంది పరిస్థితి. అటు కాంగ్రెస్ నేతలు పిలవరు. ఇటు బీఆర్ఎస్ నేతలతో కలిసి పనిచేయలేరు. చివరకు తన నియోజకవర్గానికి మంత్రులు వచ్చినా ఎమ్మెల్యేకు ఇన్విటేషన్ ఉండట్లేదట. ఇంతకు ఎవరా ఎమ్మెల్యే? ఆయన కష్టాలకు కారణాలేంటి?పటాన్ చెరు నియోజకవర్గంలో ప్రొటోకాల్ రగడ నడుస్తోంది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడంపై ఆయన ఆగ్రహంతో ఉన్నారట. అధికారిక కార్యక్రమమైనా..కాంగ్రెస్ పార్టీ ప్రోగ్రామ్ అయినా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని పట్టించుకునే వాళ్లే లేరట. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన గూడెం..కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కారు దిగి హస్తం గూటికి చేరారు. అయితే గూడెం చేరికపై పటాన్ చెరు లోకల్ లీడర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ముందు నుంచి తమ నిరసన గళం వినిపిస్తున్నారు. అటు ఓటమి చెందిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుతోనూ బీఆర్ఎస్ లో ఉన్నప్పటి నుండే విభేధాలున్నాయి. దీంతో నియోజకవర్గంలో కొత్త కాంగ్రెస్ వర్సెస్ పాత కాంగ్రెస్ అన్నట్లుగా ఎమ్మెల్యే వర్గం, లోకల్ లీడర్లు చీలిపోయి రోడ్డెక్కి రచ్చ చేశారు. ఆ పంచాయితీ పార్టీ క్రమశిక్షణా కమిటీకి కూడా చేరింది. ఔట్ పుట్ ఏంటో ఇంకా తెలియదు కానీ.. పటాన్ చెరు కాంగ్రెస్ రచ్చ నడుస్తూనే ఉంది స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే మంత్రులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహంగా ఉన్నారట. ఇటీవల కొల్లూరులో డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో రూ.10 కోట్లతో ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణానికి వీఎస్టీ అనే సంస్థ సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద ముందుకు వచ్చింది. ఈ విషయంపై అధికారులు ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వలేదట. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో హౌసింగ్, మున్సిపల్, రెవెన్యూశాఖల అధికారులతో కలిసి నిర్మాణ పనులపై సమావేశాలు పెట్టారట. కలెక్టర్ ప్రావీణ్య, హౌసింగ్ ఎండీ గౌతమ్ కొల్లూరులో పర్యటించి ఈ పనులకు మంత్రులతో శంకుస్థాపన కార్యక్రమాన్ని పెట్టుకున్నారు. ఆ సమయంలో కూడా అధికారులు ఎమ్మెల్యే గూడెంకు కనీస సమాచారం అందించలేదట.క ప్రారంభోత్సవానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్, దామోదర్ రాజనర్సింహ వస్తున్నారంటూ అధికారులు ప్రకటించి ఆహ్వాన పత్రికలు పంచేశారు. ఇక చివరి క్షణంలో డీఈవో వెంకటేశ్వర్లు ద్వారా తనకు సమాచారం అందించారని ఎమ్మెల్యే గూడెం ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. దీంతో మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కు ఫోన్ చేసి అసహనం వ్యక్తం చేశారట ఎమ్మెల్యే. గతంలోనూ అమీన్ పూర్ మున్సిపల్ పరిధి కిష్టారెడ్డిపేటలో ఎక్సైజ్ కార్యాలయం శంకుస్థాపనకు మంత్రులు దామోదర్, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావును ఆహ్వానించగా ప్రొటోకాల్ పై ఎమ్మెల్యే నిలదీయడంతో అప్పటి కలెక్టర్ క్రాంతి కార్యక్రమాన్ని రద్దు చేశారు. సుల్తాన్ పూర్ మెడికల్ డివైజ్ పార్కు, రుద్రారం తోషిబా పరిశ్రమ ప్రారంభం వంటి సందర్భాల్లో కూడా ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.వరుసగా ప్రభుత్వ కార్యక్రమాలకు తనకు ఇన్విటేషన్ లేకపోవడంపై ఎమ్మెల్యే గుర్రుగానే ఉన్నారట. తన నియోజకవర్గంలో పనులపై తనకు ఏ సమాచారం లేకుండా అన్నీ అధికారులే నిర్వహిస్తూ చివరి క్షణంలో తనను రమ్మంటూ ఆహ్వానం పంపడంపై రుసరుసలాడుతున్నారట. ఇదంతా అధికారులే చేస్తున్నారా? లేదా వచ్చే మంత్రులే ఎమ్మెల్యే అవసరం లేదని చెపుతున్నారా? అధికారులపై లోకల్ లీడర్ల ప్రెజర్ ఏమైనా ఉందా? అన్నదానిపై క్లారిటీ వచ్చాక మీడియా ముందుకు వస్తానని గూడెం ఊగిపోతున్నారట. తనను ఇంతగా అవమానించడం ఏంటని అనుచరుల దగ్గర గూడెం బాధపడ్డట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం ఎమ్మెల్యేకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నామని, ప్రోటోకాల్ ప్రకారమే నడుచుకుంటున్నామని చెప్పుకొస్తున్నారు. ఏదేమైనా పటాన్ చెరులో ఎమ్మెల్యే ప్రోటోకాల్ రగడ చర్చనీయాంశంగా మారింది.

## ప్రసాదంలో ఏమి వాడారు సిట్ దర్యాప్తులో నిజాలు

తిరుమల, నవంబర్ 11

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా ఈ క్షేత్రం విలసిల్లుతోంది. తిరుమల వెంకటేశ్వర స్వామి ఎంత అయితే ప్రత్యేకమో? స్వామి వారి లడ్డు కూడా అంతే ప్రత్యేకం.. ఈ



లడ్డుకు సంబంధించి పేటెంట్ రైట్స్ కూడా తిరుమల తిరుపతి దేవస్థానం సొంతం చేసుకుంది.. ప్రపంచంలో ఏ క్షేత్రానికి లేని విశిష్టత ఈ ఆలయానికి ఉంది. ప్రతిరోజు స్వామి వారి అన్నదాన కేంద్రంలో 90,000 మంది దాకా ఉచిత భోజనం చేస్తుంటారు.. ధూప దీప నైవేద్యాల నుంచి మొదలు పెడితే లడ్డు ప్రసాదం వరకు తిరుమల క్షేత్రంలో ప్రతిదీ ప్రత్యేకమే.. స్వామివారి దర్శనం తర్వాత లడ్డు ప్రసాదాన్ని కొనుగోలు చేయడాన్ని భక్తులు తమ అదృష్టంగా భావిస్తుంటారు.ఎంతో విశిష్టమైన చరిత్ర ఉన్న తిరుమల లడ్డు ప్రాశస్త్యం 2019 నుంచి 2024 వరకు దెబ్బ తిన్నది. 2019 నుంచి 2024 వరకు ఏపీలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ సమయంలో తిరుమల దేవస్థానం లో లడ్డూ తయారీకి బోలే బాబా ఆర్గానిక్ డెయిరీ నుంచి 68 లక్షల కిలోల నెయ్యిని తిరుమల తిరుపతి దేవస్థానం కొనుగోలు చేసింది. ఆ సంస్థ పాలు లేదా వెన్న లేదా నెయ్యి తయారుచేసిన దాఖలాలు లేవు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెంకటేశ్వర స్వామి లడ్డుకు సంబంధించిన వ్యవహారం బయటపడింది. ఆ సమయంలో లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడారని తెరపైకి సరికొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. సీబీఐ కొంతకాలంగా లడ్డు తయారీలో చోటు చేసుకున్న అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు చేపడుతోంది..ఆ దర్యాప్తుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి సిబిఐ అందించింది. ఈ నివేదికలో దారుణమైన విషయాలు వెలుగు చూశాయి. తిరుమల తిరుపతి దేవస్థానం లో 2019 నుంచి 2024 వరకు లడ్డు తయారీలో అక్రమాలు చోటు చేస్తున్నాయని సిబిఐ నివేదికలో పేర్కొంది. లడ్డు తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించారని.. వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రాశస్త్యాన్ని దెబ్బతీశారని సిబిఐ నివేదికలో వెల్లడించింది. 2019 నుంచి 2024 వరకు దాదాపు 64 లక్షల కిలోల నెయ్యిని కొనుగోలు చేశారని.. ఇందులో అనేక రకాలైన రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని సిబిఐ తన నివేదికలో పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాన్ని "కమర్షియల్" చేశారని సిబిఐ తన నివేదికలో పేర్కొంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం ఆగ్రహంగా ఉంది. వైసిపి పై తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. ఇప్పుడు సిబిఐ నివేదికలో కూడా అక్రమాలు జరిగాయని తేలడంతో కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

## ఆ రైల్వేస్టేషన్ కు మహర్దశ

హైదరాబాద్, నవంబర్ 11,

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద హైదరాబాద్‌లోని ఉందానగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ. 12.37 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటికే 79 శాతం పనులు పూర్తయ్యాయి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. స్టేషన్ భవనం విస్తరణ, వెయిటింగ్ హాల్, పే అండ్ యూజ్ టాయిలెట్స్ వంటి నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ స్టేషన్ హైదరాబాద్ విమానాశ్రయానికి దగ్గరగా ఉండటం వల్ల ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని.. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన పునరాభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా.. ఆధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్న 40 తెలంగాణ రైల్వే స్టేషన్లలో ఉందానగర్ రైల్వే స్టేషన్ ఒకటి. ఉందానగర్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధికి మొత్తం రూ. 12.37 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటివరకు 79 శాతం పనులు పూర్తయినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సోమవారం తన ట్వీట్‌లో పేర్కొన్నారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతున్న ఈ పనుల ద్వారా ఉందానగర్ స్టేషన్‌లో ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. పునరాభివృద్ధి పనుల్లో భాగంగా స్టేషన్ భవనం విస్తరణ , మెరుగైన ప్రయాణికుల వెయిటింగ్ హాల్ , పే అండ్ యూజ్ టాయిలెట్స్ , సురక్షితమైన పార్కింగ్ షెడ్లు , ఎగ్జిట్ ఆర్చ్ నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యాయి. ప్లాట్‌ఫామ్-01 వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణం కూడా ముగించారు. వెయిటింగ్ హాల్‌లో రూఫ్ స్లాబ్, ప్లాస్టర్ పనులు పూర్తి కాగా, స్టేషన్ భవనం విస్తరణలో విండోస్, గ్రానైట్, గ్రిల్ ఫిక్సింగ్ పనులు పూర్తి చేశారు. పార్కింగ్ షెడ్లకు సంబంధించిన ఫౌండేషన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి.ఉందానగర్ రైల్వే స్టేషన్‌కు వ్యూహాత్మక ప్రాముఖ్యత ఉంది. ఇది హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారిపై ఉంది. ముఖ్యంగా.. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండటం వల్ల.. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ఇది కీలక రవాణా కేంద్రంగా మారనుంది.అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా కేవలం సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా.. ఉందానగర్ వంటి స్టేషన్లు ప్రాంతీయ అనుసంధానతను పెంచడానికి.. స్థానిక ఆర్థిక వ్యవస్థల వృద్ధికి దోహదపడతాయి. ఈ పునరాభివృద్ధి పనులు పూర్తయితే.. ఈ స్టేషన్ రైల్వే ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని ఇవ్వడంతో పాటు.. తెలంగాణలో రైల్వే ఆధునికీకరణకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది.

## భారీగా పెరిగిన ఎమ్మెల్యేల ఆస్తులు

న్యూఢిల్లీ, నవంబర్ 11,

ఒకప్పుడు ప్రజాసేవ చేసే వారంతా ఉదారంగా ఉండేవారు. నిరాడంబరమైన జీవితాన్ని గడిపేవారు.. వివాదాల జోలికి వెళ్లేవారు కాదు. సంపాదించుకోవాలి.. తరాలకు సరిపడా దాచుకోవాలి.. అడ్డగోలుగా దోచుకోవాలి అని అనుకునేవారు కాదు.. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ఏదైనా సరే.. ఏమైనా సరే.. దాచుకోవడం పెరిగిపోయింది. దోచుకోవడం ఒక స్థాయి దాటిపోయింది. పైగా వారసత్వ ఆస్తి లాగా రాజకీయాల్లోకి తమ కుటుంబ సభ్యులను తీసుకురావడం అధికమైపోయింది. దేశవ్యాప్తంగా ఈ పరిస్థితి ఉన్నప్పటికీ.. తెలుగు రాష్ట్రాల్లో అది అత్యంత తీవ్రంగా ఉంది.పలు రాష్ట్రాల ఎమ్మెల్యేల ఆస్తులపై ఏడీఆర్ ఒక నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం ఎమ్మెల్యేల ఆస్తులు 11,323 కోట్లు అని తేలింది. ఇక ఇదే లెక్కన తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేల ఆస్తులు 4,637 కోట్లు ఉన్నట్టు తెలుస్తోంది.. ఇక దేశంలో అత్యధికంగా కర్ణాటక రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు 14,179 కోట్ల ఆస్తులు ఉన్నట్టు తెలుస్తోంది. ఇక దేశంలో మొత్తం 119 మంది బిలియనీర్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇందులో కర్ణాటక రాష్ట్రం నుంచి 31 మంది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 27 మంది ఉన్నారు.మెజారిటీ ఎమ్మెల్యేలకు ఎక్కువగా మైనింగ్.. ఇతర వ్యాపారాలు ఉన్నాయి. చాలా మంది ఎమ్మెల్యేలు కాంట్రాక్టు సంస్థలను నిర్వహిస్తున్నారు.. వీరంతా కూడా తమ సంస్థలలో కుటుంబ సభ్యులను భాగస్వాములు చేశారు. రాజకీయ నాయకుల కాంట్రాక్టు సంస్థలు ప్రభుత్వ నిర్మాణాలలో పాలు పంచుకుంటున్నారు. ఆర్థికంగా స్థిరత్వం ఎక్కువగా ఉన్నవారు రాజకీయాల్లోకి వస్తున్నారు.. రాజకీయాలలోకి రావడం ద్వారా తమ సంపాదనను మరింత పెంచుకుంటున్నారు. అందువల్లే ఈ స్థాయిలో వారికి ఆస్తులు పెరుగుతున్నాయని తన నివేదికలో పేర్కొంది.ఆస్తులు ఈ స్థాయిలో పెరుగుతున్నప్పటికీ నేతల మీద నమోదవుతున్న కేసుల సంఖ్య అంతంత మాత్రం గానే ఉంది. పైగా ఆ కేసులు అంతగా విచారణకు నోచుకోవడం లేదు. ఒకవేళ విచారణకు నోచుకున్నప్పటికీ ఎమ్మెల్యేల ఆస్తుల అసలు బండారం బయటపడడం లేదు. మొత్తంగా చూస్తే అటు అధికార.. ఇటు ప్రతిపక్షం అని తేడా లేకుండా ఎమ్మెల్యేలు దండిగా సంపాదించుకుంటున్నారు. అడ్డగోలుగా వెనకేసుకుంటున్నారు. చూస్తుండగానే వేలకోట్లు సంపాదిస్తున్నారు.

## బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు పండిత్ మదన్ మోహన్ మాలవ్యా

### -దేశానికి ఈయన చేసిన సేవలకు భారతరత్నతో గౌరవించిన కేంద్ర ప్రభుత్వం -నేడు ఆయన వర్ధంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

పండిత్ మదన్ మోహన్ మాలవ్యా భారతీయ విద్యావేత్త, రాజకీయవేత్త, భారతీయ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న సమరయోధుడు. ఆయనను గౌరవంగా "పండిట్ మదన్ మోహన్ మాలవీయ"గా కూడా పిలుస్తారు. "మహాత్మా"గా కూడా గౌవరింపబడ్డాడు. మాలవ్యా బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు. ఈయన వారణాసిలో ఈ విశ్వవిద్యాలయాన్ని 1915 లో స్థాపించాడు. ఇది ఆసియాలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ విశ్వవిద్యాలయం , ప్రపంచంలోనే పెద్ద విశ్వవిద్యాలయం. ఇందులో 12,000 లకు పైగా విద్యార్థులు కళలు,విజ్ఞానశాస్త్రము, ఇంజనీరింగ్ , టెక్నాలజీ లలో విద్యనభ్యసిస్తున్నారు. మాలవ్యా ఆ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా 1919 నుండి 1938 వరకు పనిచేశారు. మాలవ్యా భారత జాతీయ కాంగ్రెస్ కు అధ్యక్షునిగా నాలుగు సార్లు (1909, 1913,1919,1932) పనిచేశారు. ఆయన 1934లో కాంగ్రెస్ ను విడిచిపెట్టారు. ఆయన హిందూ మహాసభలో ముఖ్యమైన నాయకునిగా కూడా ఉన్నారు. మాలవ్యా "భారతీయ స్కౌట్స్ , గైడ్సు"కు ఒక వ్యవస్థాపకుడు. ఆయన 1909 లో అలహాబాదు నుండి వెలువడుతున్న ఆంగ్ల పత్రిక లీడర్ పత్రికను స్థాపించారు. ఆయన 1924 నుండి 1946 వరకు హిందూస్థాన్ టైమ్స్కు చైర్మన్ గా ఉన్నారు. ఆయన సేవలు 1936 లో హిందీ ఎడిషన్ ప్రారంభానికి ఉపయోగపడ్డాయి.మాలవ్యా భారతదేశంలోని ప్రతిష్ఠాత్మక అవార్డు అయిన భారతరత్నకు డిసెంబర్ 24,2014 న ఎంపికైనారు. ఈ అవార్డును ఆయన 125 వ జన్మదినం ముందుగా పొందారు.మాలవ్య 1861, డిసెంబర్ 25న అలహాబాదులో ఒక నిష్టలైన హిందూ కుటుంబములో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు మూనాదేవి , బ్రిజ్ నాథ్ లు. వారి పూర్వీకులు మధ్యప్రదేశ్ లోని మాల్వా నుండి వచ్చారు. అందువలన వారు "మాలవీయ"గా పిలువబడతారు. అందువల్ల వారి యింటిపేరు "వ్యాస్"గా అయింది. మాలవ్యాలు బెనార్స్ లోని అగర్వాల్ వర్తకులకు ఇంటి పురోహితులుగా యున్నారు. ఆయన తండ్రి సంస్కృత గ్రంథములను అభ్యసించేవాడు. ఆయన శ్రీమద్భాగవతమును చెప్పి ధనం సంపాదించేవాడు. మాలవ్యా సంప్రదాయకంగా రెండు సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. ఆ తరువాత ఆయన ఆంగ్ల పాఠశాలలో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు. మాలవ్యా తన విద్యాభ్యాసాన్ని హరదేవా ధర్మ జ్ఞానోపదేశ పాఠశాలలో కొనసాగించాడు. అచట ఆయన ప్రాథమిక విద్యను పూర్తిచేశాడు.ఆ తరువాత ఆయన వైద వర్థిని సభ నడుపుతున్న పాఠశాలలో చేరాడు. ఆ తరువాత అలహాబాదు జిల్లా పాఠశాలలో చేరారు. అచట ఆయన "మకరంద్" అనే కలం పేరుతో కవిత్వం వ్రాయడం ప్రారంభించాడు. ఆ కవితలు వివిధ జర్నల్స్, మ్యాగజైన్లలో ప్రచురితమైనాయి. మాలవ్యా 1879 లో ముయిర్ సెంట్రల్ కాలేజీ నుండి మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. ఆ కళాశాల ప్రస్తుతం అలహాబాదు విశ్వవిద్యాలయంగా ప్రసిద్ధి చెందినది.హారిసన్ కాలేజి ప్రిన్సిపాల్ మాలవ్యాకు నెలసరి ఉపకార వేతనాన్ని అందించేవారు. మాలవ్యా కలకత్తా విశ్వవిద్యాలయం నుండి బి.ఎ.లో పట్టభద్రులైనారు. ఆయన సంస్కృతంలో ఎం.ఎ చేయాలనుకున్నప్పటికీ ఆయన కుటుంబ పరిస్థితులు సహకరించలేదు. ఆయన తండ్రి ఆయనను కూడా తన వృత్తిలోనికి సహాయకునిగా తీసుకుని వెళ్ళేవాడు. జూలై 1884 లో మదన్ మోహన్ మాలవ్యా తన ఉద్యోగ జీవితాన్ని అలహాబాదు ఉన్నత పాఠశలలో ఉపాధ్యాయునిగా చేరి ప్రారంభించారు. బ్రిటిష్ రాజ్యంలో భారత భవిష్యత్తును నిర్ధారించడానికి ఏర్పాటైన సైమన్ కమీషన్ను వ్యతిరేకించడానికి లాలా లజపతి రాయ్, జవహర్ లాల్ నెహ్రూ ఇంకా ఇతర స్వాతంత్ర్య సమరయోధులతో కలిశాడు. 1931లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీతో కలిసి కాంగ్రేసు పార్టీకి ప్రాతినిధ్యం వహించాడు. 1922-23 లో హిందు మహాసభ అధ్యక్షుడుగా చేశారు"సత్యమేవ జయతే" అనే నినాదాన్ని వ్యాపింపచేసాడు. అతడు గొప్ప విద్యావేత్త, కర్మయోగి, భగవద్గీతను పాటించెను. సమకాలిక నాయకుల వలే కులమత భేదములను పోగొట్టడానికి ప్రయత్నించాడు. జీవితకాలం మొత్తం బ్రహ్మచారిగానే గడిపిన మాలవ్య 12 నవంబర్ 1946లో మరణించారు. దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న అవార్డును కేంద్ర ప్రభుత్వం మదన్ మోహన్ మాలవ్యాకు 2014లో ప్రకటించి గౌరవించింది. ఈయనతో పాటు భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వాజ్‌పేయీకి సైతం భారతరత్న ప్రకటించింది.

## శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో భద్రతా చర్యల పర్యవేక్షణ

ఢిల్లీలో జరిగిన బాంబు దాడుల నేపథ్యంలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం పాలకమండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ఈరోజు ఆలయంలోని భద్రతా విభాగాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడి,భక్తుల భద్రత కోసం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, క్షుణ్ణమైన తనిఖీలు, సీసీ కెమెరా పర్యవేక్షణ, లగేజ్ స్కానింగ్ మరియు అత్యవసర ప్రతిస్పందన చర్యలు వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు.చైర్మన్ మాట్లాడుతూ ?"ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్క భక్తుడి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఏ చిన్న అనుమానం వచ్చినా వెంటనే పై అధికారులకు తెలియజేయాలి. భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం అనుమతించబడదు," అన్నారు.అలాగే సెక్యూరిటీ సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చి, అన్ని ప్రవేశ ద్వారాల వద్ద భద్రతా తనిఖీలను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.

## జూబ్లీహిల్స్లో ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

### భట్టి విక్రమార్క పర్యటన దుర్మార్గం

హైదరాబాద్‌జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పద్ధతి విస్మయకరంగా ప్రజాస్వామ్య విలువలను పాడు చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా నిబంధనలు పక్కనబెట్టి జూబ్లీహిల్స్లో పర్యటించడం ఘోరమైన ఎన్నికల నియమావళి ఉల్లంఘన. ఆయనతోపాటు మంత్రులు, కాంగ్రెస్ నాయకులు బరితెగించి డబ్బులు పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రలోభపెడుతున్నారు.ప్రజలు ప్రశ్నిస్తే కాంగ్రెస్ అనుచరులు దాడులకు దిగుతున్నారు. ఈ దౌర్జన్యాల మధ్య పోలీసులు, ఎన్నికల అధికారులు మౌనం వహించడం అత్యంత ఆందోళనకర విషయం. ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే ఈ చర్యలను వెంటనే ఆపాలని బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా డిమాండ్ చేస్తోంది. ఎన్నికల సంఘం వెంటనే దృష్టి సారించి, భట్టి విక్రమార్క సహా ఉల్లంఘనలకు పాల్పడిన కాంగ్రెస్ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

## ప్రజల కోసం పోలీసులు ప్రజల రక్షణలో పోలీసులుటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి

మహబూబాబాద్, నవంబర్ 11,

కేంద్ర హోం శాఖ దేశవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో, మహబూబాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్స్ పరిధిలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించగా మహబూబాబాద్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రద్దీ ప్రాంతాలైన రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, నెహ్రూ సెంటర్ పరిసరాల్లో బాంబ్ స్క్వాడ్ బృందం సహకారంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఏమైనా అనుమానాస్పద వ్యక్తులు, లేదా వస్తువులు గమనించిన పక్షంలో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. (

## నేడు మేడారాన్ని సందర్శించనున్న నలుగురు మంత్రులు

ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 11 (భారత శక్తి) : తెలంగాణ రాష్ట్ర మంత్రులు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమ శాఖల మంత్రిసీతక్క, ఎస్సీ, ఎస్టీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి



అడ్లూరు లక్ష్మణ్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ లు నేడు బుధవారం మేడారాన్ని సందర్శించనున్నారు. ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా మేడారం చేరుకుంటారు. మహాజాతర ఏర్పాట్లలో భాగంగా జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12గం.కు అధికారులతో సమీక్ష అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి 2 గం.కు హెలికాప్టర్లో తిరుగు ప్రయాణమవుతారు.

# పేదలకు ఆరోగ్య భరోసా!

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చొరవ : 83 మందికి రూ. 29 లక్షల సహాయం

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), నవంబర్ 11:

పేద ప్రజల కష్టాలను తీర్చడమే నిజమైన ప్రజాప్రతినిధి లక్షణమని నమ్ముతూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాలేరు నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. వైద్య సహాయం అవసరమైన లబ్ధిదారుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను వేగవంతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి క్యాంపు కార్యాలయ



ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంత్రి పొంగులేటి కృషితో పాలేరు నియోజకవర్గానికి ప్రతి నెలా దాదాపు రూ. 1 కోటి విలువైన సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు. ఈ నిధులతో నెలకు 400 మందికి పైగా లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు. తాజా పంపిణీలో 83 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 29 లక్షల విలువ చేసే చెక్కులను అందజేయడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎంఆర్ఎఫ్ సహాయం అందుకున్న పేద ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు ప్రభుత్వం అందించిన ఈ సహకారం ఎంతో గొప్పదని కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయస్థాయి కరాటే పోటీల్లో వేములవాడ విద్యార్థుల అద్భుత ప్రతిభ

### కరాటే ఛాంపియన్షిప్ సాధించిన ఉప్పుల పవన్ రాజ్.

వేములవాడ,నవంబర్ 11 (భారత శక్తి): ఒకినవా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్ అబ్దుల్ మన్నన్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందుతున్న వేములవాడ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తమ సత్తా చాటారు,జూనియర్ ఓపెన్ కుమ్మితే విభాగంలో ఉప్పుల పవన్ రాజ్ గ్రాండ్ ఛాంపియన్షిప్ సాధించారు. ఇటీవల కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో సిఎస్ కేఐ ఫౌండర్ ఈ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో



నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్ అబ్దుల్ మన్నన్ పేర్కొన్నారు.కుమ్మితే విభాగాలలో నాంపల్లి రిశ్విన్ బంగారం, బొడిగె క్రాంతి కుమార్ బి. భవ్యష్,సరస్వతి, సిహెచ్ సూర్య జయచంద్ర,ఎల్.రానా విరాట్, వెండి పతకాలు, సిద్దు,బి.దీవెర్ష్ జి. విగ్నయ్య,జి.వేదనశ్రీ, పి.కార్తీక్, ఎన్.సన్మయ కు కాంస్య పతకాలు సాధించారు.వీరిని ఒకినవా డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ కె.వసంత్ కుమార్,కుమార్,సీనియర్ మాస్టర్ లు మొండయ్య,సంపత్ కుమార్, సురభి వేణుగోపాల్,రాజిరెడ్డి, లింగయ్య,లింగయ్య టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ ఇప్ప శ్రీనివాస్, వేములవాడ ఇన్స్ట్రక్టర్స్ కనకరపు రాజశేఖర్,ఎం.తిరుపతి,లోలోపు రాజు,తదితరులు అభినందించారు.

# గొప్ప మానవతావాది డాక్టర్ అందెశ్రీ

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 11:

ప్రజా కవిగా, ప్రకృతి కవిగా సుప్రసిద్ధులైన డా. అందెశ్రీ వరంగల్జిల్లా, జనగాం మద్దూర్ మండలంలోని రేబర్తి అనే గ్రామంలో జన్మించారు. ఈయన అసలు పేరు అందె ఎల్లయ్య. ఈయన ఒక అనాథగా పెరిగారు. ఏ విధమయిన చదువూ చదవలేదు. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందారు.

గీత రచయితగా ఈయన గొడ్ల కాపరిగా పనిచేసారు. శృంగేరి మఠానికి సంబంధించిన స్వామీ శంకర్ మహారాజ్ ఇతను పాడుతుండగా విని ఇతడిని చేరదీసాడు. రాష్ట్రవ్యాప్తంగా ఈయన పాటలు ప్రసిద్ధం. నారాయణ మూర్తి ద్వారా వచ్చిన విప్లవాత్మక సినిమాల విజయం వెనుక ఈ పాటలు ఉండటం గమనార్హం. తెలంగాణ, ప్రకృతి లాంటి అంశాలపై ఈయన గేయరచన చేసారు. ఈయన అశువు కవిత్వం చెప్పటంలో దిట్ట. 2006 లో గంగ సినిమాకు గానూ నంది పురస్కారాన్ని అందుకున్నారు. ఈయన తెలంగాణ రాష్ట్ర మాతృగీతాన్ని రచించారు.

సినీ సంభాషణల రచయితగా బతుకమ్మ సినిమా కోసం ఈయన సంభాషణలు కూడా రాసారు.

సినీ గీతగా ఈయన ఎనిమిది గీతాలు రచించారు. అవి: జయజయహే తెలంగాణ జననీ జయకేతనం (తెలంగాణ మాతృగీతం), పల్లెనీకు వందనములమ్మో,

మాయమై పోతున్నాడమ్మో మనిషన్నవాడు, గలగల గజ్జెలబండి, కొమ్మ చెక్కితే బొమ్మరా,జన జాతరలో మన గీతం,యెల్లిపోతున్నావా తల్లి, చూడ చక్కని...

పురస్కారాలు, గుర్తింపులు:

తెలంగాణ ప్రభుత్వము ఈయనను భారత అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీ అందుకొనుటకు ప్రతిపాదించినది.

ఎర్ర సముద్రం సినిమా కోసం రచించిన మాయమైపోతుండమ్మో మనిషన్నవాడు ఆంధ్రప్రదేశ్ లోని విశ్వవిద్యాలయాల తెలుగు విషయం రెండో సంవత్సరం సిలబస్ లో చేర్చారు.

కాకతీయ విశ్వవిద్యాలయం ఈయనకు గౌరవ డాక్టరేట్ అందించింది.అకాడమి ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్, వాషింగ్ టన్ డి.సి వారి గౌరవ డాక్టరేట్ తోపాటు లోకకవి అన్న బిరుదునిచ్చి 2014 ఫిబ్రవరి 1లో సన్మానించారు.వంశీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారిచే దాశరథి సాహితీ పురస్కారం (2015 ఆగస్టు 14)డాక్టర్ రావూరి భరద్వాజ, రావూరి కాంతమ్మ ట్రస్ట్ వారిచే జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం (2015 జూలై 5)

నంది పురస్కారం కూడా అందుకున్నారు.

తెలంగాణ రాష్ట్ర గీత కర్తగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో కవిగా మహోన్నతమైన పాత్రను నిర్వర్తించాడు. అంతేకాకుండా తెలంగాణ ధూంధాం కార్యక్రమ రూపశిల్పిగా తెలంగాణ 10 జిల్లాల్లోని ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని కలిగించాడు.

అందెశ్రీ రచించిన జయజయహే తెలంగాణ గీతాన్ని తెలంగాణ ప్రజలు ముక్కోటి గొంతుకలతో... ఇప్పటికి విద్యాసంస్థలలో, ఇతర ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర కార్యక్రమాలలో తెలంగాణ జాతి గీతంగా, ప్రార్థనాగీతంగా పాడుకోవడం విశేషం. ఇంతటి మహోన్నత వ్యక్తి ఆకస్మికంగా మరణించడం తెలంగాణ సాహిత్య రంగానికి తీరని లోటు. డాక్టర్ అందెశ్రీ కి అక్షరాంజలి సమర్పిస్తున్నాను.

"సాహిత్య కళా విభూషణ్"

చౌదూరి నరసింహారావు

కవి, పత్రికారచయిత, విశ్లేషకులు

# ఓటింగ్ ప్రజాస్వామ్యానికి పునాది

==========================

ఒక వ్యక్తి కున్న ఓటు ప్రభుత్వాల నిర్ణయాన్ని ప్రభావితం చేసే సాధనం. సామాజిక 'ఆర్థిక 'రాజకీయ మార్పుకు ఓటే సాధనం .

:: ఓటింగ్ రాజ్యాంగ బాధ్యత ::

ఓటర్లు అందరు సకాలములో ఓటింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటు వెయ్యాలి. ఓటింగులో పాల్గొనడం ప్రతి ఓటరు రాజ్యాంగం కల్పించిన

ప్రాథమిక బాధ్యత. ఓటరుగా నమోదైన ప్రతి వ్యక్తి ఓటింగ్ లో తప్పని సరిగా పాల్గొనాలి. ఓటు వేసి తన సార్వభౌమాధికారాన్ని వినియోగించుకోవాలి. ఓటర్లు ఇతర ఓటర్లను కూడా ఓటు వేసే విధంగా ప్రభావితం చేయాలి. దేశంలో ఓటింగ్ ప్రజాస్వామ్యం పటిష్టతకు ముఖ్య సాధన ఓటర్లు తమ అభిప్రాయాలు చేయడానికి తెలియజేయడానికి ఓటింగ్ సరైన విధానం .

:: ఓటరు ఆలోచించాలి ::

ఓటు ఎవరికి వేయాలి? ఎందుకు వేయాలి? ఏమిచేస్తారని వేయాలి? అన్న ప్రశ్నలకు సమాధానం పట్ల ఆసక్తి గల ఓటరు ఆలోచించాలి . ఎన్నుకోబోయే పార్టీ/ అభ్యర్థి రాష్ట్ర ప్రజల భవిష్యత్ తరాలకు కావలసిన జీవన నాణ్యతను నిర్ణయించే శక్తి సామర్థ్యాలు ఉన్న అభ్యర్థిని ఎన్నుకోవాలి.

:: పట్టణ ఓటర్లు యువత ఓటింగు లో పాల్గొనాలి ::

పట్టణ ప్రాంత ప్రజలు యువత పోలింగ్ రోజును సెలవు దినంగా పాటించకూడదు.

తమ తల రాతను మార్చే శాసన కర్తలను ఎన్నుకునే దినంరాష్ట్ర ప్రగతి పురోగతికి పాటు పడే సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు దినంగా ఓటర్లు బావించాలి.ఓటు వేయకపోవడం వల్ల మీ గొంతును మీరు వదులుకోవడమే. మీరు ఓటు వేయకపోతే మీకోసం మరొకరు నిర్ణయం తీసుకుంటారు. అవినీతి పరులు నేర చరితులు రాజ్యమేలే అవకాశం కలిగించవద్దు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి 'ఆర్థిక ప్రగతి ప్రయోజనాలు చెకూర్చే సామర్థ్యం వున్న అభ్యర్థులకు ఓటు ద్వారా మద్దతు ఇవ్వాలి.

:: ఎన్నికలే మార్పుకు అవకాశం ::

ప్రజాస్వామ్యంలో మార్పు కోసం ఎన్నికలే ఓటర్లకు ఉన్న గొప్ప అవకాశం. ప్రతి వయోజనులు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి. పోలింగ్ జరిగే ప్రదేశానికి సకాలంలో వెళ్లాలి.ఓటు వేయడంసామాజిక.రాజకీయ హక్కు రక్షణగా భావించాలి. ఓటరుకు మాత్రమే పనికిమాలిన ప్రభుత్వాలను మార్చే శక్తి ఉంది. ప్రతి ఓటరు ఓటు వేయడం కర్తవ్యంగా భావించాలి. ఓటు వేయడానికి ప్రేరేపించాలి. ఆర్థిక ప్రలోభాలకు ఒత్తిడి కి లొంగ కూడదు.అభ్యర్థి చేసే ఒత్తిడి మాయ మాటలు నమ్మకూడదు. ఓటర్లు ప్రజలకు సేవ చేస్తున్న వారిని మాత్రమే ఎన్నుకోవాలి. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి పెట్టుబడుల సమీకరణక ఆదాయ కల్పనకు 'ఉపాధి కల్పన మహిళా 'యువత సాధికారిత సామర్థ్యం ఉన్న పార్టీని /అభ్యర్థులను మాత్రమే ఎన్నుకోవాలి. ఓటుతో ఆర్థిక ప్రగతికి చోటు ఇవ్వాలి. ప్రజలకు పనిచేసే అభ్యర్థిని మాత్రమే ఎన్నుకోవాలి. అభ్యర్థి కులం మతం లేదా ప్రాంతం ఆధారంగా ఓటు వేయకూడదు. ప్రజలకు నమ్మకంగా పనిచేసే నీతి నిజాయితీగా అభ్యర్థిని ఎన్నుకోవాలి. ఎన్నుకున్న తప్పుడు ప్రభుత్వం మన రాష్ట్రాన్ని ప్రజలను సమస్యల్లోకి నెట్టివేస్తుంది. ఓటర్ గాఢ నిద్ర నుండి మేల్కొని ఉత్తమ అభ్యర్థులకు ఓటు వేయాలి. ఓటు తప్పనిసరిగా వేసి అవినీతి నాయకుల నుండి రాష్ట్రాన్ని రక్షించాలి. ఓటర్లు ఎన్నికల సమయంలో మని మద్యం మజిల్ పవర్ కు భయపడకుండా ఓటు వేయాలి.

:: మార్పు కోసం ప్రతిజ్ఞ ::

మార్పు కోసంఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయాలి. ప్రతి ఓటరు ఓటింగ్లో పాల్గొనడం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవాలి. మార్పు కోసం ఓటును వినియోగించుకోవాలి. ఓటర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రజాస్వామ్య రక్షణకు తమ ఓటునుహక్కును పెట్టుబడిగా పెట్టాలి.

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు చేసిన వాగ్దానాలను మేనిఫెస్టోలను అమలు తీరును పరిశీలించాలి. రాష్ట్ర భవిష్యత్తు రాబోయేప్రభుత్వ చేతుల్లోనే ఉంటుంది కాబట్టి అవినీతి రహిత పేదరిక రహిత నిరుద్యోగ రహిత రాష్ట్ర ఆవిర్భావానికి నిజాయితీగల అభ్యర్థులకు ఓటర్లు మద్దతు పలకాలి. రాష్ట్రాన్ని ప్రగతిశీల రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేయాలి. ఓటు మార్పుకు సాధనం ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై అసంతృప్తిని వ్యక్తం చేయడానికి ఓటింగ్ అత్యంత ప్రభావంతమై నటువంటి మార్గం. ఓటింగు పౌరుల సమిష్టి స్వరం ప్రతిబింబిస్తుంది. విజ్ఞతతో వేసే ఓటు సమాజములో గణనీయమైన సామాజిక ఆర్థిక రాజకీయ మార్పులను తీసుకొస్తుంది .ఓటు

ప్రభుత్వాలను నడిపించే శక్తిని కలిగి ఉంది. చారిత్రకంగా చూస్తే ఓటు ప్రభుత్వాలను మార్చివేసింది.ఓటు వేయడం పౌరబాధ్యత.

ఓటర్లు మేల్కొవాలి ప్రగతి శీల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి.

నేదునూరి కనకయ్య

అధ్యక్షులుతెలంగాణ ఎకనమిక్ ఫోరమ్

కరీంనగర్9440245771

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 11: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్, మదన్ మోహన్, డిప్యూటి కలెక్టర్ రవితేజ, ఆర్డీఓలు కామారెడ్డి వీణ, ఎల్లారెడ్డి పార్థసారథి రెడ్డి లతో కలిసి అర్జీలను స్వీకరించారు.

జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు అధికారులకు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను ఓపిగ్గా వింటూ, సంబంధిత ఆయా శాఖ జిల్లా అధికారులకు అర్జీలను ఇస్తూ, తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిధిలో పరిష్కరించగలిగిన వాటిని వెంటనే పరిష్కరించాలని, పరిధికి సంబంధించినవి కాని అంశాలపై దరఖాస్తుదారులకు సరైన సూచనలు అందించాలని తెలిపారు.అలాగే ప్రజావాణి పెండింగ్ లో ఉన్న ఆయా జిల్లా అధికారులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజావాణిలో మొత్తం 80 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు.ప్రజావాణిలో ఆయా జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సాహితీ లోకానికి సూరీడు సీపీ బ్రౌన్ :జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు

## -కలెక్టరేట్ లో ఘనంగా సిపి బ్రౌన్ 227 జయంతి ఉత్సవాలు

కడప, నవంబర్ 11(భారతశక్తి): తెలుగు సాహితీ లోకానికి వెలుగునిచ్చిన సూరీడు, తెలుగు భాషోద్ధరణకు విశేష కృషి చేసిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సీపీ బ్రౌన్) సేవలు ప్రపంచానికే స్ఫూర్తిదాయకం అని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు కొనియాడారు.

తెలుగు భాషకు ఎనలేని సేవలు అందించిన సిపి బ్రౌన్ 227 జయంతి ఉత్సవాలను కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో రాష్ట్రీయ ఉత్సవంగా ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా డిఆర్వో విశ్వేశ్వర నాయుడు తోపాటు భాషా పరిశోధకులు డాక్టర్ భూతపరి గోపాల కృష్ణ, వల్లూరు జడ్పీ హైస్కూల్ తెలుగు పండిట్ డాక్టర్ జీవీ సాయిప్రసాద్, బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, జిల్లా టూరిజం, ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా డిఆర్వో విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ తెలుగు భాషా ప్రియులకు సిపి బ్రౌన్ చేసిన సేవలు మరువలేనివన్నారు. తెలుగు భాష సాహిత్యాన్ని పునర్లిఖించిన ఆంగ్లేయ సాహితీ శిఖరం "చార్లెస్ ఫిలిప్ బ్రౌన్" అని ఆయన సేవలు తెలుగు భాషా సాహితీవేత్తలకు ఆదర్శనీయం అన్నారు. సి.పి.బ్రౌన్ ఈస్ట్ ఇండియా ఉద్యోగిగా మన దేశానికి వచ్చి తెలుగు నేర్చుకోవడమే కాకుండా.. తెలుగు భాషను ఆంధ్రరాష్ట్ర వ్యాప్తంగా పరిమళింపజేసిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. తెలుగు భాషా అభిమానిగా తాళపత్ర గ్రంథాలను సేకరించి తెలుగు వారికి వేమన విజ్ఞాన సారాంశాన్ని పంచిన ఘనత సి.పి. బ్రౌన్ కే దక్కుతుందన్నారు. సి.పి బ్రౌన్ సేకరించిన గ్రంథాలను భద్రపరచడంలో జానమద్ది హనుమచ్ఛాస్త్రి తన శేష జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న ఆయన పేరుతో మన జిల్లా కేంద్రంలో గ్రంథాలయం నడుస్తూ లక్షలాది మందికి సాహితీ, భాష గ్రంథ నిధిని అందిస్తుందని చెప్పడానికి గర్వాంగా ఉందన్నారు.

తెలుగు పండిట్ డాక్టర్ జీవీ సాయిప్రసాద్ "బ్రౌన్ ఉద్యోగ ప్రస్థానం జీవితం" అనే అంశాన్ని ప్రస్తావిస్తూ సిపి బ్రౌన్ గారు కేవలం భాషా పరిశోధకుడిగానే కాక, తెలుగు, సంస్కృతం, హిందీతో సహా అనేక భారతీయ భాషలకు ఆంగ్ల అనువాదకుడిగా పేరు గాంచారన్నారు. ఆయన కృషి వల్ల అనేక వ్యాసాలు, పుస్తకాలు, ముఖ్యంగా నిఘంటువులు వెలువడ్డాయన్నారు. ఉద్యోగ రీత్యా కడపకు తిరిగి వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకొని, సొంత డబ్బుతో పండితులను నియమించి, కడప, మచిలీపట్నంలో పాఠశాలలు పెట్టి ఉచితంగా విద్య, భోజన వసతి కల్పించారన్నారు. 1832-33లో సంభవించిన గుంటూరు కరువు సమయంలో ప్రజలకు బ్రౌన్ గారు చేసిన సేవలు ఇప్పటికీ ప్రశంసనీయమన్నారు. 1865లో లండన్ యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసరుగా నియమితులై తెలుగు భాష కీర్తిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన మహోన్నత బాషా ప్రియులు అన్నారు.

డాక్టర్ భూతపరి గోపాల కృష్ణ "బ్రౌన్ సాహితీ సేవ"అనే అంశంపై గొప్పగా వివరించారు. 1798 నవంబర్ 10న కలకత్తాలో జన్మించిన సీపీ బ్రౌన్ గారు, 1817లో ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగంలో చేరి, 1820 ఆగస్టులో కడపలో డిప్యూటీ కలెక్టరుగా కూడా పనిచేశారన్నారు. బ్రౌన్ గారు తెలుగు నేర్చుకోవడంలో ఉన్న ఇబ్బందులను తొలగించడానికి శాస్త్రీయ విధానాన్ని రూపొందించారన్నారు. వేమన, సుమతి శతకాల తో పాటు పల్నాటి యుద్ధం వంటి కావ్యాలను నన్నయ్య, తిక్కన, పోతన వంటి కవుల రచనలను ముద్రించి, తెలుగు సాహిత్యానికి పునరుజ్జీవం కల్పించారన్నారు. తొలి తెలుగు శబ్ద కోసమును పరిష్కరించి ప్రచురించడం జరిగిందన్నారు. సిపి బ్రౌన్ డిక్షనరీని ఇప్పటికీ తెలుగులో ప్రామాణికంగా ఉపయోగించడం జరుగుతుందన్నారు. తెలుగు జాతికి సేవ చేసిన నలుగురు ఆంగ్లేయులలో ఒకరిగా సి పి బ్రౌన్ ను పరిగణిస్తారని అన్నారు. మిగతా ముగ్గురు ఆర్థర్ కాటన్, కాలింగ్ మెకంజీ, థామస్ మన్రో లు అని అన్నారు. ఆంధ్ర భాషోద్ధారకుడు అని గౌరవించబడిన మహానుభావుడు సిపి బ్రౌన్ అని అన్నారు.

బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ విదేశీయుడు అయినా కూడా సిపి బ్రౌన్ తెలుగు భాషకు ఆకర్షితుడై తెలుగు భాషను నేర్చుకొని తెలుగు భాషకు ఎవరు చేయలేని సేవను చేసిన కారణజన్ముడు అని తెలుగువారు మరచిపోకూడని మహోన్నత వ్యక్తి, తెలుగు సాహిత్య అభివృద్ధి కి విశేష కృషిచేసిన ఆంగ్లేయుడు సిపి బ్రౌన్ అని అన్నారు. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన కృషి ప్రతి తెలుగు జాతీయుడి హృదయంలో చిరస్థాయిగా చెరగని ముద్రను వేశారన్నారు. ఆయన పేరుతో జిల్లా కేంద్రంలో అధునాతన వసతులతో విద్యార్థులు, భాషా ప్రియులు, సాహితీవేత్తలకు, ఎంతో మంది బాషా పరిశోధకులకు విశిష్ట సేవలను అందిస్తున్న సిపి బ్రౌన్ కేంద్ర బాషా పరిశోధనా కేంద్రం.. జిల్లా ప్రజలకు మాత్రమే కాకుండా రాష్ట్రీయ, రాష్ట్రేతరులకు కూడా అందుబాటులో ఉండడం గర్వించదగ్గ విషయం అన్నారు.

మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపకులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, వెల్లాల వెంకటేశ్వరాచార్యులు మాట్లాడుతూ సిపి బ్రౌన్ కేంద్ర బాషా పరిశోధక గ్రంథాలయం కోసం జిల్లాలోని బాషా పండితులు జానుమద్ది హనుమత్సాస్త్రి సేవలను కొనియాడారు. ఎంతో మహోన్నత వైభవం ఉన్న సిపి బ్రౌన్ గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవడం ద్వారా జీవితాంతం గ్రంథ నిధి మనచెంత ఉన్నట్లేనని ప్రతి ఒక్కరూ సమయం చూసుకుని గ్రంథాలయాన్ని సందర్శించి గ్రంథాలయ సేవలను విద్యార్థులకు తెలియజేయాలని కోరారు.

కార్యక్రమంలో ముందుగా ముఖ్య అతిథులచే సిపి బ్రౌన్ గారి చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించిన అనంతరం, జ్యోతి ప్రజ్వలన గావించి వక్తల ప్రసంగించారు.

ఈ కార్యక్రమానికి విద్యావేత్తలు రాజారత్నం ఐజాక్, తెలుగు పండిట్ రాజారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తెలుగు భాషాభిమానులు, కళాశాల, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యతోనే సమాజంలో పేదరికం దూరం: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, నవంబర్ 11 (భారత శక్తి): అందరూ విద్యావంతులైతే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు పేదరికం కూడా దూరం అవుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వ్యాఖ్యానించారు.

మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 138వ జయంతి వేడుక కార్యక్రమం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, వక్ఫ్ బోర్డు డైరెక్టర్లు దావూద్ భాక్వి, బెపారి జకీర్ హుసేన్, ఫాస్టర్ శామ్యూల్ బాబు లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో పేదరికాన్ని దూరం చేయగలమని, కులం, మతం, వర్గం ఇవేవీ.%శ్రీ% విద్యకు ప్రమాణికాలు కావన్నారు. భారత దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, భారత రత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విద్యకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని స్వతంత్య సమరయోధులుగా, కవిగా, రచయితగా, పాత్రికేయులుగా, విద్యావేత్తగా ఆయన సేవలు చిరస్మరనీయం అన్నారు. ఆయన జయంతి వేడుకను జాతీయ విద్యా దినోత్సవంగా, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా జరుపుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు.

ప్రస్తుతం మన దేశం నుండి ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్టమైన సేవలు అందిస్తున్నారంటే అందుకు కారణం విద్యారంగానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషే అన్నారు. ఆయన కృషీ ఫలితంగానే గత 70 ఏళ్ల నుండి ఇప్పటివరకు మన దేశంలో విద్యాభివృద్ధి సాధ్యమైందన్నారు. ఎవరూ దొంగిలించలేని స్థిరమైన ఆస్తి విద్య మాత్రమే అని, ప్రతి విజయానికీ నాంది కూడా విద్యనే అన్న నిజాన్ని సభికులను అర్థమయ్యేలా కలెక్టర్ సందేశమిచ్చారు.

అనంతరం సమావేశానికి హాజరైన మదరసా విద్యార్థులను ఉద్దేశించి ముఖ్య అతిథులు మాట్లాడుతూ మన దేశ స్వాతంత్ర్య సమరయోధులు, శాస్త్రవేత్తలను, మహనీయులను, సమాజానికి సేవకులనందించిన ప్రతి ఒక్కరినీ స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని విద్యార్థులకు సూచించారు.

కార్యక్రమంలో ముందుగా వేదికను అలంకరించిన ముఖ్య అతిథులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు అర్పించగా చివరగా మదరసా నిర్వాహకులను, విద్య, ఉద్యోగ, వృత్తిలో ఉన్నత స్థాయికి ఎదిగిన పలువురు ముస్లిం మైనారిటీలను ముఖ్య అతిథులు సత్కరించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి అధికారి హిదాయతుల్లా, మైనారిటీ నాయకులు అమీర్ బాబు, మన్సూర్ అలీ, జిలానీ, మైనారిటీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ముస్లిం మైనారిటీ పెద్దలు, పలువురు మైనారిటీ అధికారులు సంఘ సేవకులు, మదరసా నిర్వాహకులు, విద్యార్థులు హాజరయ్యారు.

# భైంసా నూతన సబ్ రిజిస్ట్రార్‌గా ప్రవీణ్ బాధ్యతలు స్వీకరణ

### -సిబ్బంది ఆత్మీయ స్వాగతం -%పారదర్శక సేవలకు కట్టుబడి ఉంటానన్న ప్రవీణ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 11 (భారత శక్తి):భైంసా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నూతన అధికారి ప్రవీణ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతకుముందు ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు. నిర్వహించారు. బదిలీపై భైంసాకు చేరుకున్న ప్రవీణ్, అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు భైంసా సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన శ్రీలత బదిలీతో ఆదిలాబాద్‌కి వెళ్లారు. ఈ సందర్భంలో కార్యాలయ సిబ్బంది కొత్త అధికారి ప్రవీణ్‌ను ఆత్మీయంగా ఆహ్వానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

తరువాత భైంసా సబ్ రిజిస్ట్రార్ ప్రవీణ్ మాట్లాడుతూ, "భైంసా ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా, అవినీతి రహిత సేవలు అందించేందుకు కృషి చేస్తాను" అని తెలిపారు. స్థానిక ప్రజల సహకారంతో ఉత్తమ సేవలందించడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు.

# సామినేని హంతకుల అరెస్టు చేయాలి..

### -డీజీపీకి సీపీఐ (ఎం) రాష్ట్ర నాయకుల వినతి
### - రాజకీయ కక్ష్యలతోనే హత్య
### -ఘటన జరిగి 12 రోజులైనా కేసును ఛేదించటంలో నిర్లక్ష్యం

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), నవంబర్ 11:



ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఐ (ఎం) రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హంతకులను అరెస్ట్ చేయాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెసరకాయల జంగారెడ్డి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) బి. శివధర్ రెడ్డికి హైదరాబాదులో మంగళవారం వినతి పత్రం సమర్పించారు. పార్టీకి చెందిన సామినేని రామారావును అక్టోబర్ 31వ తేదీన పాతర్లపాడు గ్రామంలో ఉదయం 5:30 గంటల సమయంలో అతి కిరాతకంగా హత్య చేశారని. ఈ ఘటన జరిగి ఇప్పటికీ 12 రోజులు అవుతున్నా నిందితులను అరెస్టు చేయటంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు. పాతర్లపాడు గ్రామానికి చెందిన బొర్రా ప్రసాద్, కంచుమర్తి రామకృష్ణ, మద్దినేని నాగేశ్వరరావు, కంద్రా పిచ్చయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర్లుతో పాటు మరికొందరు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. రాజకీయ కక్షతోనే హత్యరామారావు బతికి ఉంటే సీపీఐ (ఎం)ను ఓడించటం సాధ్యం కాదని భావించి రాజకీయ కక్షలతోనే ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కుట్రపన్ని హత్య చేశారని ఆరోపించారు. హంతకులను నేను స్వయంగా చూశాను. అని వారి పేర్లతో సహా రామారావు భార్య స్వరాజ్యం పోలీసులకు పిటిషన్ ఇచ్చినా ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయకపోవటాన్ని తప్పు పట్టారు. రామారావు నిస్వార్థ నాయకుడు, వారి స్వగ్రామానికి రెండుసార్లు ఆయన ఏకగ్రీవ సర్పంచిగా ఎన్నికయ్యారని తెలిపారు. రామారావు సతీమణి ఒకసారి గ్రామ సర్పంచ్ గా పనిచేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలోని పేదలకు తమ సొంత భూమిని ఇండ్ల స్థలాల కోసం పంచిన చరిత్ర రామారావు కుటుంబానికి ఉందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిగా రామారావు సేవలు అందించారని, సీపీఐ (ఎం)లో దాదాపు 50 ఏళ్లుగా కొనసాగుతున్నారని వివరించారు. గత కొంతకాలంగా తన స్వగ్రామం పాతర్లపాడు లో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఇది సహించలేని కాంగ్రెస్ నాయకులు ఆయన ఉంటే రాజకీయంగా తమ మనుగడ సాగదని భావించి, కుట్ర చేసి హత్య చేశారని ఆరోపించారు. ఈ హత్యకు కారణమైన వారందరినీ అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీజీపీకి వినతిపత్రం అందజేశారు.

# ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

## నివాళులు అర్పించిన ఇంచార్జి కలెక్టర్.



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 11 (భారత శక్తి): స్వాతంత్ర సమర యోధుడు, భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి ఇంచార్జి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతు దేశ స్వాతంత్ర్య పోరాటంలో, దేశ విద్యా వ్యవస్థ నిర్మాణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలను కొనియాడారు. ఇక్కడ మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి భారతి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# ఆదరణ ఫౌండేషన్ కు నిత్యావసర సరుకుల పంపిణి చేశిన షైన్ స్కూల్ యాజమాన్యం.

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), నవంబర్ 11:

షైన్ హై స్కూల్ మానేజ్మెంట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరొక్కసారి వారి విశాల హృదయాన్ని, సహాయక తత్వాన్ని చాటుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆధరణ ఫౌండేషన్ లో వున్న వృద్దులకు, మతిస్థిమితం లేని వారికి షైన్ స్కూల్ మేనేజ్మెంట్ బియ్యం, నూనె,టిఫిన్ సామాగ్రి,కూరగాయలు, పండ్లు,వంటి నిత్యావసర వస్తువులు అందించారు. ఈ సందర్భంగా కరెస్పాండంట్ అన్సార్ పాషా మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సహకరించిన తల్లిదండ్రులకి ధన్యవాదములు తెలిపారు. ఆదరణ ఫౌండేషన్ నడుపుతున్న నిస్సిని అభినందించారు. ఈ కార్యక్రమం లో కరెస్పాండంట్ అన్సార్ పాషా,డైరెక్టర్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ శ్వేత,అడ్మినిస్ట్రేషన్ నాగేశ్వరావు, ముస్తఫా, పాల్గొన్నారు.

# జాతీయ లోక్-అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి:జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, నవంబర్ 11 :



రాజీమార్గమే - రాజా మార్గమని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు.క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్-అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని అన్నారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన, చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో కక్షిదారులు రాజీపడేలా లోక్ అదాలత్ దోహదపడుతుందని, ఈ నెల 15 వ తేదీ వరకు జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులకు సూచించారు. రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవిత సంబంధిత కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో ఇరువర్గాల సమ్మతితో రాజీకి కుదుర్చుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు.

సైబర్ నేరాలకు సంబంధించి, బాధితులు కోల్పోయిన డబ్బులు త్వరగా బాధితులకు అందే విధంగా చూడాలని, 25 వేల రూపాయల కంటే తక్కువ డబ్బు కోల్పోయిన కేసులలో లోక్-అదాలత్ ద్వారా ఫిర్యాదు చేసుకొని, ఎఫ్ఐఆర్ లేకుండానే రీఫండ్ ప్రక్రియా చేసుకోవచ్చని అన్నారు.

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం అయ్యేలా అధికారులు నుండి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరు భాధ్యత యుతంగా వ్యవహరించి, రాజీ పడదగిన అన్ని కేసులలో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి, వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీపడేలా చూడాలన్నారు. జాతీయ లోక్-అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం జరుగుతుందని అవగాహన కల్పించాలని అన్నారు.

# నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (NCC) ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఐడియా & ఇన్నోవేషన్ పోటీ (IIC) 2025

%విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 11:

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, విజయవాడలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక ఆల్ ఇండియా ఐడియా & ఇన్నోవేషన్ పోటీ 2025 రెండో రోజు ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రముఖ పరిశ్రమ నిపుణులు, స్టార్టప్ మెంటార్లు, విద్యా సంస్థల నాయకులు క్యాడెట్లతో అమూల్యమైన విషయాల్ని, ఆలోచనల్ని పంచుకుని, జాతీయ ప్రగతికి ఆవిష్కరణలను సాధనంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఎక్స్‌పో మెంటర్ల ఆధ్వర్యంలో జరిగిన పరస్పర చర్చల్లో మొత్తం 91 మంది క్యాడెట్లు చురుకుగా పాల్గొన్నారు. ఈ చర్చలు సృజనాత్మక సమస్య పరిష్కారాలు, స్థిరమైన సాంకేతిక పరిష్కారాలు, ప్రోటోటైప్ అభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారించాయి. ఈ సెషన్ లో పాల్గొన్నవారికి సృజనాత్మక భావనలను ఆచరణాత్మక పరిష్కారాలుగా ఎలా మలుచుకోవచ్చో అనుభవపూర్వకంగా తెలిసింది. తరువాత డైరెక్టరేట్ టీమ్‌ల ప్రెజెంటేషన్ క్రమం నిర్ణయించేందుకు లాటరీ డ్రా జరిగింది.అనంతరం, రెండు డైరెక్టరేట్‌లు తమఆవిష్కరణాత్మక ప్రాజెక్టులను ప్రతిష్ఠాత్మక జ్యూరీ ప్యానెల్ ముందు ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టులు భారత్ అభివృద్ధి లక్ష్యాలైన సుస్థిరత, డిజిటల్ మార్పులు, గ్రామీణ సాధికారత, సాంకేతిక స్వావలంబన వంటి అంశాలకు అనుగుణంగా రూపొందించారు. ఈ కార్యక్రమం NCC యువ ఆవిష్కర్తలకు వికసిత భారత్ ఏ 2047 %-% స్వావలంబన, సాంకేతికంగా శక్తివంతమైన భారతదేశ దృష్టిని నిర్మించేందుకు తమ సృజనాత్మకతను మార్గనిర్దేశం చేసే అద్భుత వేదికగా కొనసాగుతోందని అధికారులు, అతిథులు పేర్కొన్నారు.

# కేఎస్ పీపీలో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన విద్యా షా 'రంగ్ సుఫియానా'

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 11:ప్రఖ్యాత భారతీయ గాయని, స్వరకర్త, రచయిత్రి విద్యా షా సూఫీ సంగీతం 'రంగ్ సుఫియానా' మంగళవారం హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్ పీపీ)లో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. 'సంస్కృతి' పేరిట కేఎస్ పీపీ నిర్వహిస్తున్న తొలి సాంస్కృతిక కార్యక్రమం ఇది.దక్షిణ భారత కుటుంబంలో జన్మించి, కర్ణాటక సంగీతంలో శిక్షణ పొందిన విద్యా షా విభిన్న సంగీత సంప్రదాయాలను సమాన అభిరుచితో సాధన చేశారు. తుమ్రీ, దాద్రా లేదా సూఫీ అయినా దాని స్ఫూర్తిలో పూర్తిగా మునిగిపోయినప్పుడే నిజమైన సంగీతం ప్రారంభమవుతుందని ఆమె నమ్ముతారు. 'సంగీతం హృదయాలను తాకుతుంది. ఆ భావోద్వేగ సంబంధం అన్నిరకాల సంగీతానికి సారాంశం' అని ఆమె తన ప్రదర్శన సమయంలో నిరూపించడమే గాక, తన హృదయపూర్వక ప్రదర్శనలు, సంభాషణల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకుంటారు.సారంగిపై కమల్ అహ్మద్, తబలాపై సర్దార్ ఖాన్, కీబోర్డుపై ఉమర్ ఖాన్, ప్యాడ్ లో మానస్ దాస్ గుప్తా తదితరులు విద్యా షాకు సహకారం అందించారు. న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ గాయని, స్వరకర్త విద్యా షా, ఉత్తర భారత శాస్త్రీయ సంప్రదాయాలలో విద్వాంసులు శుభ ముద్గల్, ముజాహిద్ హుస్సేన్ ఖాన్, శాంతి హీరానంద్ ల వద్ద శిక్షణ పొందే ముందు కర్ణాటక సంగీతాన్ని కూడా నేర్చుకున్నారు. ఆమె తాన్సేన్ సమారోహ్ (గ్వాలియర్), ది కెన్నెడీ సెంటర్ (వాషింగ్టన్ డీసీ), ది ఆసియా సొసైటీ (న్యూయార్క్), ది బోదే మ్యూజియం (బెర్లిన్) వంటి ప్రతిష్ఠాత్మక వేదికలలో ప్రదర్శనలు ఇచ్చారు.ఆమె చేపట్టిన ప్రాజెక్టు-'ఉమెన్ ఆన్ రికార్డ్'కు చార్లెస్ వాలెస్ అవార్డుతో పాటు, భారత ప్రభుత్వం నుంచి సీనియర్ ఫెలోషిప్ గ్రహీత అయిన విద్యా షా రచన గ్రామోఫోన్ యుగం నుంచి తొలి మహిళా ప్రదర్శనకారుల వారసత్వాన్ని పునికిపుచ్చుకుంది. భక్తి కవయిత్రులపై ఆమె చేసిన పరిశోధన దాగూర్ స్కాలర్ షిప్ (2023)ను కూడా అందుకుంది.జల్సా: ఇండియన్ ఉమెన్స్ జర్నీ ఫ్రమ్ ది సలోన్ టు ది స్టూడియో' (తులిక బుక్స్) రచయిత్రి విద్యా షా. గోవా విశ్వవిద్యాలయంలో (2016-20) భారతీయ సంగీతం కోసం నానా షిర్గావ్కర్ చైర్ ప్రొఫెసర్ గా ఆమె పనిచేశారు. 'మాంటో' చిత్రంలో 'బోల్ కే లబ్ ఆజాద్ హై తేరే' పాటతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం, ఆమె భారతదేశ అస్పృశ్య సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడి, ప్రోత్సహించడానికి అంకితమైన భూమా ట్రస్టుకు డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలి: జిల్లా కలెక్టర్ తేజస్నందలాల్ పవర్

సూర్యాపేట,భారత శక్తి జిల్లా ప్రతినిధి,నవంబర్ 11

కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చూసుకోవాలని అదేవిధంగా రైతులు సరైన తేమశాతం తో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.మంగళవారం ఆయన సూర్యాపేట జిల్లా, తిరుమలగిరి మండలం తొండ, కోక్యా నాయక్ తండా,ఫణిగిరి లలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ముందుగా తొండ లో ఎఫ్ పి వో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ఆ కొనుగోలు కేంద్రానికి ట్యాగింగ్ చేసిన మిల్లు వివరాలు ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత ముందు పంపించాలని ఇదివరకే చెప్పడం జరిగిందని, ధాన్యం తడిచినప్పటికి ఇబ్బంది లేకుండ మిల్లులకు పంపించాలని , పౌరసరఫరాల అధికారులు మిల్లర్లతో మాట్లాడి ధాన్యం తీసుకునే విధంగా చర్చించాలన్నారు.అనంతరం ఇదే మండలం కోక్యానాయక్ తండ



లో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం డ్రైయర్ ను పరిశీలించారు. అంతేకాక రైతులతో మాట్లాడుతూ ఎంత దాన్యం తీసుకువచ్చారని తేమశాతం ఎంత ఉందని అడిగారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ రకాల రిజిస్టర్ లను పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని కుప్పలు వచ్చాయని సీరియల్ నెంబర్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తున్నది ?లేనిది? తనిఖీ చేశారు. 57 మంది రైతులు దాన్యం తీసుకు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కొనుగోలు కేంద్రానికి నియమించిన ఏఈ ,ఏఈఈ వివరాలను అడగడమే కాకుండా వారితో మాట్లాడారు. ధాన్యం తేమశాతాన్ని పరిశీలించి లారీలు, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయ అని అడిగి తెలుసుకున్నారు. అంతేకాక ట్రక్ షీట్ వివరాలను అడిగారు. కేంద్రం ద్వారా ఇప్పటివరకు చేసిన చెల్లింపులు, తదితర వివరాలన్నింటిని కనుక్కున్నారు.ఫణిగిరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆయన పరిశీలించారు.ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు చేయాలని, సరైన తేమశాతంతో కొనుగోలుకు ఎన్ని కుప్పలు సిద్ధంగా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. హమాలీ ఎంత తీసుకుంటున్నారని? ప్రశ్నించారు. టాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తూకం సరైన విధంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి సరైన తేమ శాతం తో ధాన్యం వచ్చినట్లయితే జాప్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని ఆదేశించారు .

జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్ బాబు ,పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాము,తిరుమలగిరి తహసిల్దార్ హరిప్రసాద్, తదితరులు ఉన్నారు

# మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన రాజేందర్ రావు జూబ్లీహిల్స్ ఎన్నికలపై మానిటరింగ్



కరీంనగర్, నవంబర్11(భారతశక్తి ప్రతినిధి):

హైదరాబాదులో బిసి సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎన్నికలపై మంత్రితో చర్చించారు. ఓటింగ్ శాతంపై మానిటరింగ్ నిర్వహించారు. ఉదయం నుంచి నమోదైన పోలింగ్ శాతం వివరాలను రాజేందర్ రావు మంత్రికి వివరించారు. జూబ్లీహిల్స్ ఓటర్లు ప్రజలు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని, నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని రాజేందర్రావు ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో జూబ్లీహిల్స్ ప్రజలు నవీన్ యాదవ్ కు ఓటర్లు పట్టం కట్టబోతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను ప్రపంచవ్యాప్తంగా పెంచడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. నవీన్ యాదవ్ విజయంతో కాంగ్రెస్ పార్టీలో రెట్టింపు ఉత్సాహం నెలకొంటుందన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురులేదని జూబ్లీహిల్స్ ఎన్నికతో రుజువు అవుతుందని వెలిచాల రాజేందర్ రావ్ పేర్కొన్నారు.

# మౌలానా అబుల్ కలాం సేవలు మరువలేనివి:జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, నవంబర్11(భారతశక్తి ప్రతినిధి):మొదటి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు.

మంగళవారం ఆయన జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయన సేవలకు గుర్తుగా జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా, మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఆధునిక విద్యావ్యవస్థకు పునాదివేశారన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ UGC), ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (%××%)లు ఏర్పాటు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మైనారిటీ సంక్షేమ అధికారిమైనారిటీ సంక్షేమ అధికారి, డీఆర్ఓ బి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# బూతు స్థాయిలోనే మహిళా కాంగ్రెస్ బలోపేతం: రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య



కరీంనగర్, నవంబర్11(భారతశక్తి ప్రతినిధి) :

బూత్ స్థాయిలో కమిటీల నియామకం, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ నేతల గెలుపే లక్ష్యంగా నేడు జిల్లా మహిళా కాంగ్రెస్ నేతలు పనిచేయాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య పిలుపునిచ్చారు. మంగళవారం పద్మనగర్ లోని డిసిసి కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సుకన్య మాట్లాడుతూ బూత్ స్థాయిలో మహిళా కాంగ్రెస్ బలోపేతం, పార్టీ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడం తదితర అంశాలపై మహిళా నేతలతో చర్చించి వారి అభిప్రాయాలను సూచనలను స్వీకరించడం జరిగింది..స్థానిక సంస్థల ఎన్నికల నాటికి బూత్ స్థాయిలో మహిళా కమిటీల నియామకం పూర్తి చేయాలని, ఎన్నికలకు సంసిద్ధం కావాలని సూచించినారు. ఎన్నికల బరిలో నిలిచే మహిళా నేతల గెలుపు కోసం ఆయా ప్రాంతాలకు చెందిన మహిళ కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు కృషి చేయాలని వారి గెలుపులో భాగస్వాములు కావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గడిచిన నెలరోజులలో జిల్లావ్యాప్తంగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల నివేదికను జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యం ప్రసన్న రెడ్డి కార్యవర్గ సభ్యుల సమక్షంలో పిసిసి మహిళా కాంగ్రెస్ ప్రతినిధికి అందజేసినారు.

అనంతరం ఇటీవల నల్గొండ జిల్లా ప్రాంతానికి చెందిన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప గారి అకాల మరణం పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేసినారు.. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంగల జ్యోతి రెడ్డి, కార్యదర్శి వంగల కళ్యాణి రెడ్డి, నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి. వెన్నం రజిత రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, అసెంబ్లీ ఇంచార్జి లు, పద్మ, హసీనా, హుజురాబాద్ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుష్పలత, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దేవేంద్ర, రాధ, జిల్లా ఉపాధ్యక్షులు మల్లిక, స్వప్నశ్రీ, ప్రధాన కార్యదర్శులు స్వరూప, సుజాత, కార్యదర్శులు శిల్ప, సునీత, జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు మండల పట్టణ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ చిన్నారులను సొంత పిల్లలుగా చూసుకోవాలి

## -కేంద్రాలను మరింతగా అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి

## -స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే

కరీంనగర్, నవంబర్11(భారతశక్తి ప్రతినిధి):

అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులను తమ సొంత పిల్లలుగా చూసుకుంటూ అత్యుత్తమ సేవలు అందించాలని కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు.

మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన లో భాగంగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారుల బరువు, రిజిస్టర్లను పరిశీలించటంతో పాటు ప్రీ స్కూల్ పిల్లలతో సంభాషించారు ప్రీ స్కూల్ ఆక్టివిటీని పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు పనితీరు అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో అంగన్వాడీ కేంద్రాలను తయారు చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలు, ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకునేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను గర్భిణీలు బాలింతలు, కిషోర్ బాలికలు చేసుకోవాలని కోరారు. విద్య రంగంలో అంగన్వాడీ కేంద్రాలే తొలిమెట్టు అని ఇవి బాగా పనిచేస్తాయని, పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. పిల్లలతో అదనపు కలెక్టర్ కాసేపు ముచ్చటించి వారికి అందిస్తున్న పౌష్టికాహారం ఆహారం వివరాలను సిబ్బంది నుంచి తెలుసుకున్నారు . అంగన్వాడీ కేంద్రం ద్వారా



వారికి నేర్పిస్తున్న విద్యాభోదనలు, రైమ్స్ అదనపు కలెక్టర్ ఆలకించారు. ఈ సందర్భంగా పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ విద్యార్థిని విద్యార్థుల సామర్థ్యాలను గమనించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను కలియ తిరిగి డ్రింకింగ్ వాటర్, కిచెన్ షెడ్, ఇతర సౌకర్యాలను పరిశీలించి సమర్థ నిర్వహణకు తగిన సూచనలు చేశారు. గ్రామంలో పారిశుద్ధ పనులను పకడ్బందీగా నిర్వహించాలని మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగించాలనీ సూచించారు. తీసిన చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించాలనీ, దోమల వ్యాప్తిని నివారించేలా ప్రజలకు అవగాహన కల్పించాలనీ, వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలనీ అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాట్లు ఇవ్వండి సారు - రైతుల వినతి



గుమ్మడిదల, భారత శక్తి ప్రతినిధి, నవంబర్11:

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలోని సర్వే నంబర్ 109లో ఉన్న అసైన్ భూములను గత కొద్ది నెలల క్రితం రైతులు ప్రభుత్వానికి అప్పగించారు. అప్పగించే సమయంలో అధికారులు భూ పరిహారంతో పాటు ప్రతి కుటుంబానికి 100 గజాల ప్లాట్ కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటికీ ఆ ప్లాట్లు ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్ నేతృత్వంలో రైతులు గుమ్మడిదల తహసిల్దార్ పరమేశంకి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం తక్షణమే హామీ ఇచ్చిన 100 గజాల ప్లాట్లను కేటాయించి రైతుల న్యాయమైన డిమాండును నెరవేర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సోషలిస్ట్ సమాజం కోసం విద్యార్థులు కంకణ బద్ధులు కావాలి : పి డి ఎస్ యు

## మాజీ నాయకులు అడ్వకేట్ జేఏసీ చైర్మన్ జగన్నాథం పిలుపు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 11: సోషలిస్ట్ సమాజం కోసం విద్యార్థులు కంకణ బద్ధులు కావాలని, మాజీ పిడిఎస్యు నాయకులు అడ్వకేట్ జేఏసీ చైర్మన్ జగన్నాథం విద్యార్థి లోకానికి పిలుపును ఇచ్చారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో పిడిఎస్యు స్థానిక కార్యాలయంలో పిడిఎస్యూ జిల్లా మహాసభల సందర్భంగా విలేకరుల సమావేశం, పిడిఎస్యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు సమాజంలో భాగమే అయినందున సమాజం పట్ల బాధ్యతాయుతమైన పాత్రను నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. అందుకే "గ్రామాలకు తరలండి" అని ప్రజల్లో మమేకం అయి వారి బాతుకు పోరాటల్లో వారి భాధ తప్త బ్రతుకు పోరాటల్లో భుజం భుజం కలిపి పనిచేయాలి అన్నారు. సమాజంలో ధనిక, పేద అంతరాలు పెరిగి పోతున్నాయని, ప్రజలంత సమానంగా ఉండే సమాజ నిర్మాణం విద్యార్థుల కర్తవ్యం కావాలి అన్నారు. నేడు కార్పొరేట్ మతోన్మాదం పెరిగి సమాజంలో ప్రజల మధ్య చిచ్చుపెడుతుందని అన్నారు. పెట్టుబడి దారి సమాజంలో నిరుద్యోగం, పేదరికం మరింత పెరిగి పోతున్న సందర్భంలో విద్యార్థులపై మరింత గురుతరమైన బాధ్యత ఉంది అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామిక ఉద్యమాలకు, సోషలిస్ట్ ఉద్యమాలకు అనుకూలమైన వాతావరణం ఉంది అని, విద్యార్థులు ప్రజాపోరాటల్లో మమేకమై పోరాడిల్సిన అవసరం ఉంది అన్నారు. పిడిఎస్యూ విద్యార్థుల్లో శాస్త్రీయ చదువులు కావాలని,



విద్యార్థులలో మమేకమై పనిచేస్తుందని అన్నారు. నవంబర్ 28,29 తేదీల్లో కామారెడ్డిలో జరిగే పిడిఎస్యూ నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త 23వ, మహాసభలను, ఖమ్మంలో డిశంబర్ 5,6,7 తేదీల్లో జరిగే రాష్ట్ర 23వ, మహాసభలను జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విక్షణం సంపాదకులు వేణుగోపాల్, డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విజయరామరాజు, సీపీఐ(ఎం. ఎల్.) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ప్రభాకర్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కామారెడ్డి జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ రాష్ట్ర నాయకులు దేవారం, పిడిఎస్యూ జిల్లా అధ్యక్షులు నరేందర్, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా నాయకులు శ్రీకాంత్, రాకేష్, శ్రీనివాస్, వేణు, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 11 :

సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన పుల్కల్ లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం కు వచ్చిన ధాన్యం వివరాలు ఇప్పటివరకు తూకం వేసి మిల్లులకు పంపిన ధాన్యం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం కు వచ్చిన ధాన్యం సరైన తేమ శాతం ఉన్న ధాన్యం తూకం వేసి వెంటనే మిల్లులకు పంపించాలని సిబ్బందికి సూచించారు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని హార్వెస్టర్ యజమానులతో సమావేశం నిర్వహించి ఆర్పిఎం ఎక్కువగా ఉంచి హార్వెస్టర్లు నడిపేలా అవగాహన కల్పించాలని తాసిల్దార్ కు సూచించారు. ఆర్పిఎం ఎక్కువగా ఉంచితే ధాన్యం లో తాలు రాదని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంపై హార్వెస్టర్ యజమానులకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం గ్రామ శివారులోని కోదండ రామా ఇండస్ట్రీస్ లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగోలు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు రైతులకు నూతన పత్తి కొనుగోలు విధానంపైఅవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ,అధికారులకు మార్కెటింగ్ శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులు కిసాన్ కంపాస్ యాప్ స్లాట్ బుక్ చేసుకొని అందులో సూచించిన విధంగా నిర్ణీత సమయానికి సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకురావాలని సూచించారు. పుల్కల్ మండల పర్యటనలో భాగంగా సింగూరు లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను (బాలుర ) ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు . విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పరీక్షలంటే ఉండే భయాన్ని తొలగించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని స్టోర్ రూమ్ను డైనింగ్ హాల్ను కిచెన్ షెడ్ ను పరిశీలించారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బియ్యం సంచుల కింద బియ్యం తడవకుండా చెక్కలు వేసి వాటిపై బియ్యం సంచులు నిల్వ ఉంచాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలోని విద్యార్థుల కోసం వచ్చిన స్కూలు యూనిఫామ్ క్లాత్ ను వెంటనే పంపి యూనిఫామ్స్ కుట్టించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలల్లో తాగునీటి వసతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి అయినట్లు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు .పుల్కల్ మండలం గొంగ్లూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిర ఇండ్లు కలెక్టర్ పరిశీలించారు. ఇండ్ల నిర్మాణం స్థాయినిబట్టి వెంట వెంటనే బిల్లులు మంజూరయ్యేలా అధికారులు చర్యలు

తీసుకోవాలన్నారు. మండలానికి మంజూరైన ఇండ్లు ఇప్పటివరకు నిర్మాణం లో ఏ దశల్లో ఉన్నాయో అధికారులుఅడిగితెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ ఆర్ డి ఓ పాండు, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక మాసంలో భగవంతుని కృపకై దీపం వెలిగించండి

# కరీంనగర్‌లో ఈనెల 14న కార్తీక దీపోత్సవం

## దీపోత్సవ వ్యవస్థాపక అధ్యక్షులు సుగుణాకర్ రావు

కరీంనగర్, నవంబర్11(భారతశక్తి ప్రతినిధి):

పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని, కరీంనగర్ పట్టణ



ప్రజలందరికీ సామూహిక దీపారాధనలో పాల్గొనే అవకాశం కల్పించాలనే సదుద్దేశ్యంతో, నవంబర్ 14 శుక్రవారం సాయంత్రం 6 గంటలకు, కరీంనగర్ గాంధీ రోడ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి కళ్యాణ మండపం ఆవరణలో కార్తీక దీపోత్సవం భవ్యంగా నిర్వహించనున్నట్లు కార్తీక దీపోత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పోల్సాని సుగుణాకర్ రావు తెలిపారు. ముందుగా కార్తీక దీపోత్సవ గోడప్రతిని ఆవిష్కరించారు. మంగళవారం టిడిడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సుగుణాకర్ రావు మాట్లాడుతూ "కార్తీక మాసం" అత్యంత విశిష్టమైనదనీ, ఆధ్యాత్మిక మాసంగా పరిగణిస్తారనీ, శివకేశవుల ఇరువురినీ పూజించడం ఈ మాసం ప్రత్యేకత అన్నారు. దీపం వెలిగించడం ద్వారా చెడు అనే చీకటిని పారదోలి, వెలుగు అనే జ్ఞానాన్ని, దైవకృపను పొందవచ్చు," అని తెలిపారు. బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ మార్గదర్శకత్వంలో, పర్యవేక్షణలో జరుగుతుందనీ చెప్పారు. భక్తులకు ఆధ్యాత్మిక సందేశం, ప్రవచనం అందజేస్తారు.

దీపారాధనకు కావలసిన ప్రమిదలు, నూనె, వత్తులు మొదలైన అన్ని సామాగ్రులు కార్తీక దీపోత్సవ సమితి ద్వారానే సమకూర్చబడతాయనీ, కరీంనగర్ పట్టణ భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ చేతులతో దీపాలను వెలిగించి, అనంతరం తీర్థప్రసాదం స్వీకరించి భగవంతుని కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ సమావేశంలో గంప జగన్ , మహిపాల్, దుర్గం మారుతి, తాడూరి బ్రహ్మం, గుడిపాటి జితేందర్ రెడ్డి, తోట రాజేందర్, కామారపు నరహరి, దేవిశెట్టి హన్మాండ్లు, విశ్వనాథం, పిట్ల స్వామి, మల్లేశం, తిరుపతి, విజయలక్ష్మి, చంద్రకళ, కాటకం చంద్రయ్య,మొలుగురి కిషోర్,పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి కొనుగోలు తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 11: మంగళవారం కామారెడ్డి జిల్లా, ఇస్రోజి వాడి గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అదనపు కలెక్టర్ విక్టర్, డిప్యూటి ట్రైనీ కలెక్టర్ రవితేజ లతో కలసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మట్లాడి వరి కొనుగోలు ప్రక్రియ, తేమ శాతం, తూకం విధానం, ధాన్యం నిల్వ నదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే కేంద్రంలో తూకం యంత్రాలు సరిగ్గా పనిచేస్తున్నాయా, తగిన బస్తాల సరఫరా జరుగుతున్నదా అనే అంశాలను పరిశీలించారు.



అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వరి కొనుగోలు నిర్వహించాలని, తేమ శాతం ఆధారంగా నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం ఎండబెట్టే ప్రదేశాలను పర్యవేక్షించి అవసరమైన సూచనలు సలహాలు చేశారు.

రైతులు సమయానికి చెల్లింపులు అందేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రాల్లో పారదర్శకత పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీల పనితీరును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలో మొత్తం 427 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు రైతుల నుండి కొనుగోలు చేసింది 1, 23, 993 మెట్రిక్ టన్నులు, ఇందులో దొడ్డురకం 59,162, సన్నరకం 64,831.

11,196 మంది రైతులనుండి కొనుగోలు చేయడం జరిగి, రైతుల ఖాతాలో 145 కోట్లు జమ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై వెంకటేశ్వర్లు, డిఎమ్ శ్రీకాంత్, డిసిఓ రామ్మోహన్, ఎంపీడీవో, పంచాయితి సెక్రటరి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే మానసిక ఉల్లాసం: టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్11:

క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమం సందర్భంగా బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... శారీరక మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదని చేస్తాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ముందుకు వెళితే ప్రభుత్వ ఉద్యోగాల్లో సైతం క్రీడాకారులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అధిక సమయాన్ని సెల్ఫోన్లకు వెచ్చించకుండా విద్యార్థులు చదువు క్రీడలపై దృష్టి సాధించి మెరుగైన ఫలితాలు రాబడితే సమాన అవకాశాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ అధ్యక్షుడు బంగారు కృష్ణ నాయకులు తుపాజీ అనంత కిషన్ కూన సంతోష్ కిరణ్ గౌడ్ మహేష్ సాయికుమార్ భాను ప్రసాద్ మల్లేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్‌లో ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవ వేడుకలు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 11: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మదన్ మోహన్, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ రవితేజ, మైనారిటీ సంక్షేమ శాఖ ఇంచార్జి అధికారి జయరాజ్, డీ.పి.ఆర్.ఓ తిరుమల, విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 11న మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని జరుపుకుంటారని, ఈ రోజే భారతదేశపు తొలి విద్యా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం కూడా అని పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు అబుల్ కలాం గులాం ముహియుద్దీన్. ఆయన "మౌలానా ఆజాద్" గా ప్రసిద్ధి చెందారు. భారత స్వాతంత్ర్య సమర యోధుల్లో ఒకరైన ఆయన గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమానికి మద్దతు ఇచ్చి 1920లో భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరి, 1940లో రామ్‌ఘర్ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడయ్యారు. 1946 వరకు ఆ పదవిలో కొనసాగారు. స్వాతంత్ర్యం అనంతరం 1947 నుండి 1958 వరకు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో విద్యా మంత్రిగా పనిచేసి, భారతదేశ ఆధునిక విద్యా వ్యవస్థకు పునాది వేశారు. ఆయన ఆధ్వర్యంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజీసి), ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటిఎస్) వంటి ప్రధాన విద్యా, శాస్త్రీయ సంస్థలు ఏర్పాటయ్యాయి. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1992లో మరణానంతరం భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నతో సత్కరించబడ్డారని కలెక్టర్ పేర్కొన్నారు.

# నవీన్ యాదవ్‌కు భారీ మెజార్టీ ఖాయం: పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్

హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో...పోలింగ్ జరిగిన తీరు, క్షేత్ర స్థాయిలో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు చెబుతున్న సమాచారం మేరకు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు భారీ మెజారిటీ వస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సరళిపై ఆయన స్పందించారు. చాలా ప్రశాంతంగా ఉప ఎన్నిక జరిగిందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తమ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇచ్చినట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, అభ్యర్థికి మద్దతు ఇచ్చినట్లుగా అక్కడ ఉన్న తమ నాయకుల ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి



మహేశ్ కుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తూ అందరికీ సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు నడిపించారని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, మహిళ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ విభాగాలతోపాటు సీనియర్ నాయకులు అందరూ ప్రభుత్వ పథకాలను జనంలోకి తీసుకెళ్లడంలో విజయవంతం అయ్యారన్నారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉండటంతో.. తమ అభ్యర్థికి పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. భారీ మెజారిటీతో తమ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.




# జూబ్లీహిల్స్ పోలింగ్.. పలువురు ఎమ్మెల్యేలపై కేసు నమోదు

హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించిన పలువురిపై హైదరాబాద్ పోలీసులు 3 కేసులు నమోదు చేశారు. ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్రనాయక్, రాందాస్‌పై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, మెతుకు ఆనంద్‌పై బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైనట్టు పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తున్నట్లు హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా జరగాలంటే ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియామవళిని గౌరవించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# జూబ్లీహిల్స్ పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ జరుగుతోంది

హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ కొనసాగుతున్న వేళ.. భారత రాష్ట్రసమితి అభ్యర్థి మాగంటి సునీత కీలక ఆరోపణలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ జరుగుతోందని, ఓటర్లను భయపెడుతున్నారని ఆరోపించారు. పలుచోట్ల రౌడీషీటర్లు తిరుగుతున్నారని, ఓటర్లను ప్రలోభాలకు గురిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,



ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు జూబ్లీహిల్స్‌లో ఏం పని?అని ప్రశ్నించారు. మరోవైపు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్‌ను హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. డ్రోన్ల ద్వారా పోలింగ్ స్టేషన్ల వద్ద పరిస్థితిని వీక్షించారు. పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోందని, దేశంలోనే తొలిసారి డ్రోన్ టెక్నాలజీ ద్వారా పోలింగ్ పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. మొత్తం 150 డ్రోన్ కెమెరాలు ఉపయోగిస్తున్నట్లు చెప్పారు.

# అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం: సీఎం రేవంత్

ఘట్‌కేసర్, నవంబర్ 11 (భారత శక్తి): అందెశ్రీ మరణం వ్యక్తిగతంగా తనకు, తెలంగాణ సమాజానికి తీరని లోటు అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో రాష్ట్రం గురించి అనేక విషయాలు ఆయనతో చర్చించినట్లు తెలిపారు. జయ జయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా నిర్ణయించిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. అందెశ్రీ అంత్యక్రియల అనంతరం ఘట్ కేసర్‌లో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ''అందెశ్రీ ప్రతి మాట ప్రజా జీవితంలో నుంచి పుట్టుకొచ్చింది.. ప్రతి పాట తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపింది. జయ జయహే తెలంగాణ గీతాన్ని పాఠ్య పుస్తకాల్లో చేరుస్తాం. అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాం. తన జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేసిన మహనీయుడు ఆయన. ఆయన రచనలకు సంబంధించిన 'నిప్పులవాగు' పుస్తకాన్ని ప్రతి గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతాం.'' అని రేవంత్‌రెడ్డి తెలిపారు.





# మొంథా తుపాను.. దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం మంజూరు

హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి): రాష్ట్రంలో మొంథా తుపాను బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం మంజూరు చేసింది. దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతులకు రూ.12.99 కోట్లు విడుదల చేసింది. 15 జిల్లాల్లోని 8,662 ఇళ్లకు రూ.15వేలు చొప్పున తక్షణ సాయం పంపిణీ చేయనున్నారు. తెలంగాణలో మొంథా తుపాను కారణంగా ఆయా జిల్లాల్లో జరిగిన నష్టంపై ఇప్పటికే జిల్లాల కలెక్టర్లు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. భీకర వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 16 మంది మృతిచెందగా.. వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాల్లో తుపాను ప్రభావం చూపినట్లు ఆర్అండ్‌బీ శాఖ గుర్తించింది. మొత్తం 334 ప్రాంతాల్లో 230.41 కిలో మీటర్ల రహదారులు దెబ్బతిన్నాయి. 201 రహదారులపై నీరు పొంగిపొర్లింది. 8 రోడ్లకు పగుళ్లు వచ్చాయి. 156 ప్రాంతాల్లో రాకపోకలు ఆగిపోగా.. పలుచోట్ల అధికారులు పునరుద్ధరించారు. 61 చోట్ల కల్వర్టులు పాడయ్యాయి.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. కోడ్ ఉల్లంఘించిన స్థానికేతర ప్రజాప్రతినిధులపై కేసులు

హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన స్థానికేతర ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. కోడ్ ఉల్లంఘించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను గుర్తించామన్నారు. కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనధికారికంగా పోలింగ్ బూత్‌ల వద్ద ఉన్నారని చెప్పారు.



* **మా కార్యకర్తలపై కార్పొరేటర్ దాడులు: మాగంటి సునీత**

తమ పార్టీ కార్యకర్తలపై కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ దాడులు చేస్తున్నారని భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి సునీత ఆరోపించారు. దాడులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చూసే బాధ్యత పోలీసులదే అని పేర్కొన్నారు.

# గ్రేటర్ లో తాగునీటి సమస్య రాకుండ చూడండి : సీఎస్ సమీక్ష



హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి) ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గ్రేటర్ హైదరాబాద్ లో రానున్న రోజుల్లో తాగు నీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో జలమండలి పని తీరుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంజీరా, సింగూరు, గోదావరి రెండు, మూడో దశ పనులపై సమీక్ష చేశారు. భూసేకరణ, పైప్ లైన్ల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ, రోడ్లు, భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ నిర్దేశించిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సహకరించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, జలమలండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పీసీసీఎఫ్ డాక్టర్ సి. సువర్ణ, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కలెక్టర్లు, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విజయవాడ- దువ్వాడ సెక్షన్ మధ్య పలు రైళ్లు రద్దు

సికింద్రాబాద్, నవంబర్ 11 (భారత శక్తి): రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా విజయవాడ దువ్వాడ సెక్షన్ మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణ మధ్యరైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ పోర్టు విశాఖపట్నం (17267), విశాఖ కాకినాడ పోర్టు (17268), రాజమండ్రి విశాఖ (67285), విశాఖ రాజమండ్రి (67286) మధ్య నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 20న రద్దు చేసినట్టు పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈనెల 12న నర్సాపూర్ సికింద్రాబాద్, 15న అనకాపల్లిసికింద్రాబాద్‌కు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

# ఏడాదికి రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు టార్గెట్ : మంత్రి

* **రాష్ట్రంలో సాగుకు 12 లక్షల ఎకరాల భూమి అనువుగా ఉంది**
* **మూడేళ్లలో 10 లక్షల ఎకరాల విస్తీర్ణంతో దేశంలో మొదటి స్థానంలో నిలుస్తాం**

తెలంగాణ బ్యూరో, నవంబర్ 11 (భారత శక్తి) : రాష్ట్రాన్ని ఆయిల్ పామ్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం సచివాలయంలో ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని ఇందులో 73,696 మంది రైతులు భాగస్వామ్యమయ్యారని తెలిపారు. 2021 22 నుండి ఇప్పటి వరకు 2.28 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చినట్టు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 1.25 లక్షల ఎకరాల లక్ష్యం నిర్ధేశించగా, ఇప్పటివరకు 31,158 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగినట్టు చెప్పారు. మార్చి నాటికి మిగిలిన 93,842 ఎకరాలు సాగులోకి రావాల్సి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగుకు 12 లక్షలకు పైగా అనువైన భూమి ఉంది. వచ్చే నాలుగు సంవత్సరాలపాటు ప్రతి ఏడాది రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పని చేయాలి. మూడు సంవత్సరాల్లో పది లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగుతో తెలంగాణ దేశంలోనే ఆయిల్ పామ్ ఉత్పత్తిలో మొదటి రాష్ట్రంగా నిలుస్తుందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో రాష్ట్రానికి 6.54 లక్షల ఎకరాల లక్ష్యం కేటాయించగా, కేవలం 2.28 లక్షల ఎకరాలు మాత్రమే సాగులోకి వచ్చిందని తెలిపారు. ఆయిల్ పామ్ విస్తరణలో నిర్లక్ష్యం వహించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తక్కువ పురోగతి ఉన్న జిల్లాలుగా వరంగల్, నారాయణపేట, వనపర్తి, రాజన్న సిరిసిల్ల, గద్వాల్, కరీంనగర్, నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాలను గుర్తించినట్లు ఈ జిల్లాల్లో ఆయా కంపెనీలు లక్ష్యాలకు అనుగుణంగా వేగంగా పనిచేయాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణలో కంపెనీలు మరింత బాధ్యతతో వ్యవహరించాలని, ప్రతి కంపెనీ తమ పరిధిలోని జిల్లాల్లో సరిపడా సిబ్బందిని నియమించుకుని, రైతులతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండాలని సూచించారు. తోటల



యాజమాన్యంలో నీటి వినియోగం, ఎరువుల పంపిణీ, అంతర పంటలు, కలుపు నివారణ వంటి అంశాలపై పూర్తి దృష్టి సారించాలన్నారు. కొత్త తోటలలో గెలల దిగుబడులు తగ్గకుండా పర్యవేక్షణ చేయడం, విజయవంతమైన రైతుల అనుభవాలను కొత్త రైతుల ప్రోత్సాహానికి వినియోగించడం అవసరమని సూచించారు. తక్కువ ఎత్తు, తక్కువ ఆకు పొడవు, అధిక దిగుబడి ఇచ్చే కొత్త వేరైటీ మొలకలను దిగుమతి చేసుకోవాలని, రాబోయే ఏడాదికి ఆయిల్ పామ్ మొక్కల డిమాండ్ పెరగనున్నందున ప్రతి కంపెనీ తన లక్ష్యానికి అనుగుణంగా నర్సరీలను ఏర్పాటు చేసుకొని, నాణ్యమైన మొక్కలు రైతులకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

# బీహార్‌లో మళ్లీ ఎన్డీయే ప్రభంజనం... ముక్తకంఠంతో చెబుతున్న ఎగ్జిట్ పోల్స్!

బీహార్, నవంబర్ 11 (భారత శక్తి): బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే మరోసారి ఘన విజయం సాధించబోతోందని ఎగ్జిట్ పోల్స్ ముక్తకంఠంతో చెబుతున్నాయి. మంగళవారం రెండో విడత పోలింగ్ ముగిసిన వెంటనే వెలువడిన దాదాపు అన్ని సర్వేలు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకే అధికారాన్ని కట్టబెట్టాయి. ఆర్జేడీ కాంగ్రెస్ కూటమి అయిన మహాగట్బంధన్ కూటమికి తీవ్ర నిరాశ తప్పదని అంచనా వేశాయి. వివిధ జాతీయ సర్వే సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్ ప్రకారం, ఎన్డీయేకు 130 నుంచి 167 సీట్ల వరకు దక్కే అవకాశం ఉంది. మరోవైపు, మహాగట్బంధన్ కూటమి 70 నుంచి 108 స్థానాల మధ్య పరిమితం కావొచ్చని తెలుస్తోంది. బీహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 122 సీట్ల మేజిక్ ఫిగర్ అవసరం కాగా, ఎన్డీయే సునాయాసంగా ఆ మార్కును దాటుతుందని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రభావం చూపుతారని భావించిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' పార్టీ ఏమాత్రం సత్తా చాటలేకపోయిందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. చాలా సర్వేలు ఆయన పార్టీకి 0 నుంచి 5 సీట్ల లోపే వస్తాయని పేర్కొన్నాయి. దీంతో, బీహార్ రాజకీయాలపై 'పీకే ఫ్యాక్టర్' పనిచేయలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. మ్యాట్రిజ్ ఎగ్జిట్ పోల్ ప్రకారం, మిథిలాంచల్, భాగల్‌పూర్ వంటి ప్రాంతాల్లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, 65 శాతం మంది మహిళా ఓటర్లు ఎన్డీయేకు మద్దతుగా నిలిచినట్లు ఈ సర్వే వెల్లడించింది. అలాగే, 51 శాతం ఓబీసీలు, 49 శాతం ఎస్సీ ఓటర్లు కూడా ఎన్డీయే వైపే మొగ్గు చూపినట్లు పేర్కొంది. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలున్న బీహార్‌లో రెండు విడతల్లో పోలింగ్ జరిగింది. వెలువడిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఈ విధంగా ఉన్నప్పటికీ, పూర్తి ఫలితాలు తెలియాలంటే ఓట్ల లెక్కింపు వరకు వేచి చూడాల్సిందే. బీహార్‌లో మొత్తం 243 స్థానాలకు గాను... నవంబరు 6న జరిగిన తొలి విడతలో 121 స్థానాలకు పోలింగ్ జరిగింది. నేడు (నవంబరు 11) రెండో విడతలో మిగిలిన 122 స్థానాలకు పోలింగ్ చేపట్టారు. పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగియగానే, ఎగ్జిట్ పోల్స్ వెల్లడయ్యాయి. రెండు విడతల పోలింగ్ పూర్తయ్యాక ఎగ్జిట్ పోల్స్ ప్రకారం ఏ పార్టీ పరిస్థితి ఎలా ఉందో చూస్తే...

**పీపుల్స్ ఇన్ సైట్**
ఎన్డీయే 133-148
మహాకూటమి 87-102
జన్ సురాజ్ 0-2
ఇతరులు 3-6

**జేవీసీ పోల్స్**
ఎన్డీయే 135-150
మహాకూటమి 88-103
జన్ సురాజ్ 0
ఇతరులు 3-6

**మ్యాట్రిజ్**
ఎన్డీయే 147-167
మహా కూటమి 70-90
జన్ సురాజ్ 0-2
ఇతరులు 2-8

**దైనిక్ భాస్కర్**
ఎన్డీయే 145-160
మహాకూటమి 73-91
జన్ సురాజ్ 0
ఇతరులు 510

**పీపుల్స్ పల్స్**
ఎన్డీయే 133-159
మహా కూటమి 75-101
జన్ సురాజ్ 0-5

**పి-మార్క్**
ఎన్డీయే 142-162
మహాకూటమి 80-98
జన్ సురాజ్ 1-4
ఇతరులు 0-3

**చాణక్య స్ట్రాటజీస్**
ఎన్డీయే 130-138
మహాకూటమి 100-108
జన్ సురాజ్ 0
ఇతరులు 3-5

**డీవీ రీసెర్చ్**
ఎన్డీయే 137-152
మహా కూటమి 83-98
జన్ సురాజ్ 2-4, ఇతరులు 1-8

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీదే గెలుపు: ఎగ్జిట్ పోల్ సర్వేలు

హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు సూచిస్తున్నాయి. దాదాపు అన్ని సర్వేలు కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నాయి. మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈరోజు పోలింగ్ ముగియగా, 14వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. సాయంత్రం 6 గంటలలోపు క్యూలైన్‌లో నిలబడిన వారికి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు.వివిధ ఎగ్జిట్ పోల్ సర్వేల ప్రకారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 46 శాతానికి పైగా ఓట్లు వచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 41 శాతం నుంచి 42 శాతం ఓట్లు, బీజేపీకి 6 నుంచి 8 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉందని ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయి.
వివిధ ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు ఈ విధంగా ఇలా ఉన్నాయి.

చాణక్య స్ట్రాటజీస్ - కాంగ్రెస్ 46 శాతం, బీఆర్ఎస్ 41 శాతం, బీజేపీ 6 శాతం.

పీపుల్స్ పల్స్ -కాంగ్రెస్ 48 శాతం, బీఆర్ఎస్ 41 శాతం, బీజేపీ 6 శాతం.

స్మార్ట్ పోల్ -కాంగ్రెస్ 48.2 శాతం, బీఆర్ఎస్ 42.1 శాతం, బీజేపీ 8 శాతం.

## అమరావతి విచ్చేసిన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్

అమరావతి, నవంబర్ 11 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ భేటీ అయ్యారు. చంద్రబాబు ఆహ్వానం మేరకు శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం నాడు అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రితో సీఎం చంద్రబాబు దాదాపు గంటపాటు సమావేశమయ్యారు. రాష్ట్రంలోని వ్యవసాయ రంగ సమస్యలు, రైతుల సంక్షేమానికి అవసరమైన కేంద్ర ప్రభుత్వ సహకారంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఇటీవల రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన 'మొంథా' తుపాను వల్ల జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తుపాను కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, ఆదుకోవాలని కోరారు. ముఖ్యంగా మైనర్ ఇరిగేషన్ కింద సాగు చేసే రైతుల సంక్షేమానికి కేంద్రం నుంచి ప్రత్యేక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రతిపాదనలను సీఎం కేంద్ర మంత్రి ముందుంచారు. పీఎం ఆర్కేవీవై పీడీఎంసీ (ప్రధానమంత్రి కృషి వికాస్ యోజన పర్ డ్రాప్ మోర్ క్రాప్) పథకం కింద రాష్ట్రానికి అదనపు నిధులు కేటాయించాలని కోరారు. 2024 25, 202526 ఆర్థిక సంవత్సరాలకు కలిపి రూ. 695 కోట్లు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. అదేవిధంగా, మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద తోతాపూరి మామిడి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను చంద్రబాబు వివరించారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా రూ. 100 కోట్లను వెంటనే విడుదల చేయాలని శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. రాష్ట్ర రైతాంగ సమస్యలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ సమావేశంలో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్... ఆరుగురు మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్, నవంబర్ 11 (భారత శక్తి): ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో మంగళవారం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఆపరేషన్ మావోయిస్టుల కార్యకలాపాలను అణచివేయడంలో కీలక ముందడుగు అని పోలీసు అధికారులు వెల్లడించారు. పక్కా నిఘా సమాచారంతో ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. బీజాపూర్, దంతెవాడ జిల్లాల డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) బృందాలు సంయుక్తంగా అడవుల్లోకి వెళ్లాయి. ఉదయం 10 గంటల సమయంలో భద్రతా బలగాలను గమనించిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించగా, బలగాలు దీటుగా ఎదురుకాల్పులు జరిపాయి. సాయంత్రం వరకు కాల్పులు అడపాదడపా కొనసాగాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ధృవీకరించారు. ఘటనా స్థలం నుంచి ఇన్సాస్ రైఫిల్స్, స్టెన్ గన్స్, .303 రైఫిల్స్‌తో పాటు భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. మావోయిస్టుల యూనిఫాంలు, కమ్యూనికేషన్ పరికరాలు, విప్లవ సాహిత్యం పుస్తకాలు కూడా లభించాయని తెలిపారు. ఈ ఆపరేషన్‌పై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ స్పందించారు. "ప్రస్తుతం మావోయిస్టు సంస్థ నాయకత్వం, దిశానిర్దేశం లేకుండా నైతికంగా దెబ్బతింది. కేవలం అబూజ్‌మఢ్ అడవుల్లోని కొన్ని ప్రాంతాలకే వారి ఉనికి పరిమితమైంది. నిఘా ఆధారిత ఆపరేషన్ల విజయానికి ఇది నిదర్శనం" అని ఆయన వ్యాఖ్యానించారు. తప్పించుకున్న మావోయిస్టులు పొరుగు జిల్లాల్లోకి ప్రవేశించకుండా అదనపు బలగాలను మోహరించి, అడవులను జల్లెడ పడుతున్నామని ఆయన తెలిపారు.

## ఢిల్లీ పేలుడు... భారత్ కు ప్రపంచదేశాల సంఘీభావం

ఢిల్లీ, నవంబర్ 11 (భారత శక్తి): దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం సాయంత్రం జరిగిన ఘోర కారు పేలుడు ఘటన యావత్ దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. చారిత్రక ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకర ఘటనపై ప్రపంచ దేశాల నుంచి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. పలు దేశాల అధినేతలు, రాయబారులు భారత్‌కు తమ సంఘీభావాన్ని తెలియజేస్తూ, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద పార్క్ చేసి ఉన్న హర్యానా రిజిస్ట్రేషన్ గల కారులో సోమవారం సాయంత్రం భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి సమీప ప్రాంతమంతా దద్దరిల్లింది. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనతో ఢిల్లీలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. ఈ భయానక ఘటనపై అంతర్జాతీయ సమాజం తీవ్రంగా స్పందించింది. ఐర్లాండ్ ఉప ప్రధాని సైమన్ హారిస్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, "ఈ ఢిల్లీలో జరిగిన విషాదకరమైన పేలుడు గురించి విని చాలా బాధపడ్డాను. ప్రాణాలు కోల్పోయిన వారికి, గాయపడిన వారికి, వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి. ఈ కష్ట సమయంలో భారత ప్రజలకు, ప్రభుత్వానికి మా పూర్తి మద్దతు, సంఘీభావం తెలియజేస్తున్నాం" అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారత్‌లో చైనా రాయబారి జు ఫీహాంగ్ కూడా ఈ విషాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన పేలుడు నన్ను కలచివేసింది. బాధితులకు నా ప్రగాఢ సానుభూతి. ప్రభావితమైన ప్రతి ఒక్కరి గురించి నేను ఆలోచిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో జర్మనీ రాయబారి ఫిలిప్ అకర్‌మాన్ కూడా పేలుడు వార్త విని దిగ్భ్రాంతికి, తీవ్ర ఆవేదనకు గురయ్యానని తెలిపారు. "ఎర్రకోట సమీపంలో నిన్న జరిగిన పేలుడు వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దుర్ఘటనలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు నా హృదయపూర్వక సానుభూతి. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను" అని తెలిపారు. ఈ కష్టకాలంలో భారత ప్రజలకు, ప్రభుత్వానికి అండగా ఉంటామని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. "న్యూఢిల్లీ నడిబొడ్డున జరిగిన విషాదకర పేలుడులో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం, గాయపడటం పట్ల భారత ప్రజలు, ప్రభుత్వం పడుతున్న దుఃఖాన్ని ఉక్రెయిన్ పంచుకుంటుంది. బాధితుల కుటుంబాలకు మా సంతాపం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం" అని పేర్కొంది. యూకే కన్జర్వేటివ్ పార్టీ ఎంపీ ప్రీతి పటేల్ కూడా ఢిల్లీ నుంచి వస్తున్న వార్తలు భయంకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదే సమయంలో, ఢిల్లీలో ఉన్న బ్రిటిష్ పౌరులకు అవసరమైన మద్దతు అందించాలని, సహాయం కోసం వచ్చే అభ్యర్థనలపై స్పందించాలని ఆమె యూకే ప్రభుత్వాన్ని కోరారు. ఈ కష్ట సమయంలో భారత్‌కు అండగా నిలుస్తామని పలు దేశాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు, ఈ పేలుడు ఘటనపై భారత దర్యాప్తు సంస్థలు విచారణ ముమ్మరం చేశాయి.

## ముగిసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్..


హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద గేట్లు మూసివేశారు. సాయంత్రం ఆరు గంటల వరకు క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లకు ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. 2023లో బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఓట్ల లెక్కింపు ఈ నెల 14న జరగనుంది. జూబ్లీహిల్స్ బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు నిలిచారు. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు నెలకొంది. బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీత, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేశారు. గెలుపుపై ఆయా పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలి... ప్రధానిని కోరతా: సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి): ప్రముఖ రచయిత, జన వాగ్గేయకారుడు అందెశ్రీ మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించిన సీఎం, అందెశ్రీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, ఆయన కీర్తిని శాశ్వతం చేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, అందెశ్రీకి మరణానంతరం పద్మశ్రీ పురస్కారం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. "అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని కోరుతూ ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశాను. త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి ఈ విషయంపై వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేస్తాను. ఇందుకు కేంద్ర మంత్రులు కూడా సహకరించాలి" అని ఆయన కోరారు. తెలంగాణ ఉన్నంత వరకు అందెశ్రీ పేరు నిలిచి ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని సీఎం గుర్తుచేసుకున్నారు. "రాజకీయ నేతలను నేరుగా కలవనని చెప్పిన అందెశ్రీ గారితో మీడియా ద్వారానే పరిచయం ఏర్పడింది. ఆయన మరణం నాకు వ్యక్తిగతంగా ఒక ఆప్తుడిని కోల్పోయిన బాధను మిగిల్చింది" అని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "జీవితాంతం తెలంగాణ కోసం తపించిన గొప్ప వ్యక్తి ఆయన. రచయితగా, కళాకారుడిగా ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు పడ్డారో అందరికీ తెలుసు. తన ఆరోగ్యం గురించి కానీ, డబ్బు గురించి కానీ ఏనాడూ ఆలోచించని నిస్వార్థ జీవి" అని కొనియాడారు. అందెశ్రీ రచించిన 'నిప్పుల వాగు' పుస్తకం 20 వేల ప్రతులను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉంచుతామని సీఎం వెల్లడించారు. ఆయన అభిమానుల నుంచి కూడా సలహాలు, సూచనలు స్వీకరించి, ఆయనకు సముచిత న్యాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## కారు బాంబు పేలుడు.. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా

ఢిల్లీ, నవంబర్ 11 (భారత శక్తి): ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలకు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ పేలుడులో 13 మంది మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబాలకు ఢిల్లీ ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి మాట్లాడుతూ, శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి రూ. 5 లక్షలు, క్షతగాత్రులకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు తెలిపారు.



బాధితులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. ఈ పేలుడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి రేఖా గుప్తా సంతాపం తెలియజేశారు.

## అందెశ్రీ పాడెను మోసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ పాడెను మోశారు. అందెశ్రీ అంత్యక్రియలు హైదరాబాద్ నగర శివారులోని ఘట్‌కేసర్‌లో నిర్వహించారు. ఈ అంతిమ సంస్కారాలకు రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అంతిమ యాత్రలో అందెశ్రీ పాడెను రేవంత్ రెడ్డి మోశారు.తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అందెశ్రీ అంత్యక్రియల అనంతరం ముఖ్యమంత్రి



మీడియాతో మాట్లాడారు.

*** వ్యక్తిగతంగా, తెలంగాణ సమాజానికి లోటు: రేవంత్ రెడ్డి**

అందెశ్రీ మరణం వ్యక్తిగతంగా తనకు, తెలంగాణ సమాజానికి తీరని లోటు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో రాష్ట్రం గురించి అనేక విషయాలు ఆయనతో చర్చించినట్లు తెలిపారు. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్రగీతంగా నిర్ణయించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అందెశ్రీ ప్రతి మాట ప్రజా జీవితం నుంచి పుట్టుకు వచ్చిందని అన్నారు. ప్రతి పాట తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపిందని అన్నారు. 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని పాఠ్యపుస్తకాల్లో చేరుస్తామని అన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని అన్నారు. తన జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేసిన మహనీయుడు ఆయన అని అన్నారు. ఆయన రచనలకు సంబంధించిన 'నిప్పులవాగు' పుస్తకాన్ని ప్రతి గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతామని అన్నారు.



# చైతన్యపురి పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై అవగాహన

ఎల్బీనగర్, నవంబర్ 11 (భారత శక్తి): చైతన్యపురి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఎల్బీనగర్ ఏసీపీ ఏ. కృష్ణయ్య ఇన్‌స్పెక్టర్ కె. సైదులు నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన సమావేశంలో ప్రజలకు సైబర్ మోసాలు, ఫేక్ ఖాతాలు, ఆన్‌లైన్ భద్రతపై జాగ్రత్తలు తీసుకోవడాన్ని వివరించారు.సందేహాస్పద లింకులు, మెసేజిలను క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి వివరించరాదని, పాస్ వర్డలను సురక్షితంగా ఉంచాలని, సోషల్ మీడియా అకౌంట్లను గోప్యతా సెట్టింగ్స్‌తో వాడాలని సూచించారు.ఏదైనా అనుమానాస్పద చర్యలు కనబడితే తన పరిధిలోని వెంటనే పోలీస్ స్టేషన్‌కు తెలియ జేయాలని కోరారు. అలాగే, పోలీస్ 100 అంక్షల సేవలను విలీనం చేసి అన్ని అత్యవసర సేవలకి 112 నంబర్‌ను నిర్వహిస్తున్నట్లు, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో 112కి కాల్ చేయాలని అందరికీ తెలియజేశారు. సైబర్ నేరాల పెరుగుదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉన్నట్లు ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య సూచించారు.

# మల్లన్నకు ఎలక్షన్ కమిషన్ లో చుక్కెదురు

* **ఇక నుండి టీఆర్పీ (TRP)పదాన్ని ఉపయోగించం.**



హైదరాబాద్, నవంబర్ 11(భారత శక్తి) : తెలంగాణ రిపబ్లికన్ పార్టీ, టిఆర్పి TRP పదంతో 2018 నుండి పార్లమెంట్ ,అసెంబ్లీ ఎలక్షన్లో పోటీ చేసి ముందుకు సాగుతుంది. తెలంగాణ రాజ్యాధికార పార్టీతో తీన్మార్ మల్లన్న టిఆర్పి పదంతో ముందుకు వెళుతున్నారు దీనిపై అభ్యంతరం తెలుపుతూ తెలంగాణ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు యదీశ్వర్ నక్క తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ కు గత నెల ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన ఎలక్షన్ కమిషన్ తెలంగాణ రాజ్యాధికార పార్టీకి నోటీసులు పంపింది. నోటీసులకు స్పందించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ జనరల్ సెక్రెటరీ ఈనెల టిఆర్పి అనే పదం వాడబోమని ఎలక్షన్ కమిషన్ కు అఫిడవిట్ సమర్పించారు. ఎలక్షన్ కమిషన్ సత్వరమే పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ విషయాన్ని ఈరోజు తెలంగాణ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు, సెక్రెటరీ యాదీశ్వర్ నక్క, చెన్నోజు శ్రీనివాసులు మీడియాకు తెలియజేశారు.

# మూడున్నర కిలోల గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఎల్బీనగర్, నవంబర్ 11 (భారత శక్తి): గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం...విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నెల 9 రాత్రి నాగోల్ చౌరాస్తా దగ్గర ఉన్న నిమంత్రన్ ప్యాలెస్ సమీపంలో అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా గోల్లేపల్లి గ్రామానికి చెందిన శ్యామల అరవింద్ ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుండి 3 కిలోల 542 గ్రాముల గంజాయిని స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. అనంతరం అరవింద్ తమతో తన కాలనీకి చెందిన వేణు అనే వ్యక్తి తన నలుగురు స్నేహితులతో కలిసి కిడ్నాప్ చేసి హయాత్ నగర్ లో తన స్నేహితుని ఇంట్లో అక్రమంగా నిర్బంధించారని తెలుపటంతో చైతన్యపురి పోలీస్ స్టేషన్ నందు అరవింద్ పై గంజాయి సెక్షన్ల క్రింద కేసు నమోదు చేయగా వేణు అతని నలుగురు స్నేహితులపై కిడ్నాపింగ్ సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసినట్లు సిఐ సైదులు తెలిపారు. కేసు నమోదు చేసిన తర్వాత మా అదుపులో ఉన్న అరవింద్ ఈ నెల 10 రాత్రి 10 గంటల సమయంలో మరికొంత గంజాయి తన ఫ్రెండ్ చంటి వద్ద ఉందని అక్కడికి తనను తీసుకెళ్తే అతడిని చూపించి గంజాయితో సహా పట్టిస్తానని తెలిపాడని పేర్కొన్నారు. అక్కడికి వెళ్ళిన తర్వాత అరవింద్ స్నేహితుడు చంటి గంజాయితో పట్టుబడ్డాడని పంచనామా చేయడానికి ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు పంచులుగా అవసరం కావడంతో ఈ నెల 10 రాత్రి 10:30 గంటలకు అందుబాటులో ఉన్న కొత్తపేట్ ఫ్రూట్ మార్కెట్ దగ్గర గల ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్ కు లిఖిత పూర్వక లేఖ పంపినట్లు తెలిపారు. అక్కడ సబ్ స్టేషన్ లో ఉన్న ఇద్దరు సిబ్బందికి తాము పంపిన లెటర్ పై అవగాహన లేకపోవటంతో మా సిబ్బందితో వాగ్వాదం పెట్టుకొని ఒకరినొకరు తోసుకోవటం జరిగిందన్నారు. ఈసంఘటనపై విచారణ చేస్తున్నట్లు, తప్పు ఎవరిదైనా, వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ సైదులు తెలిపారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలకు కేటీఆర్ కృతజ్ఞతలు

హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి) జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ ముగిసిన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర ట్వీట్ పెట్టారు. ''గత నెలరోజులుగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేసిన పార్టీ నేతలు, కార్యకర్తలకు పేరుపేరున కృతజ్ఞతలు.. అధికార పార్టీ ఎన్ని దౌర్జన్యాలకు పాల్పడినా, భయభ్రాంతులకు గురిచేసినా బయటకు వచ్చి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు'' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఉపఎన్నిక నిర్వహించిన విషయం తెలిసిందే. 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా.. ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు.

# సంధ్యా శ్రీధర్ రావుకు హైకోర్టులో చుక్కెదురు

* **ఎఫ్‌సీఐ లే ఔట్‌లో రహదారుల పునరుద్ధరణకు ఆదేశం**
* **బాధితులకు అండగా ఉంటామని చెప్పిన హైకోర్టు**
* **హైడ్రాకు పలు సూచనలు చేసిన న్యాయమూర్తి**



హైదరాబాద్, నవంబర్ 11(భారత శక్తి): గచ్చిబౌలిలోని ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే ఔట్‌లో సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు ఆక్రమణలను హైకోర్టు మంగళవారం తప్పు పట్టింది. రహదారులు ఆక్రమించి పలు నిర్మాణాలు చేపట్టడాన్ని సీరియస్‌గా పరిగణించింది. మొత్తం 20 ఎకరాల పరిధిలో వేసిన లేఔట్‌లో 162 వరకూ ప్లాట్లుండగా.. అందులోని మెజార్టీ ప్లాట్లు నావనే ఉద్దేశంతో రహదారులు, పార్కులు ఆక్రమిస్తే వ్యవస్థలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించింది. హైడ్రా అందుకే ఆక్రమణలను తొలగించిందని పేర్కొంది. ఒకసారి లేఔట్ వేస్తే.. అదే కొనసాగుతుందని స్పష్టం చేసింది.సంధ్యా శ్రీధర్ రావు రహదారుల ఆక్రమణలను ఇటీవల హైడ్రా తొలగించిన విషయం విధితమే.ఈ విషయమై సంధ్యా శ్రీధర్ రావు హైకోర్టును ఆశ్రయించారు.మంగళవారం ఈ కేసు విచారణలో భాగంగా జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డిపై వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా బాధిత ప్లాట్ యజమానులు కూడా వారి గోడును హైకోర్టుకు విన్నవించుకున్నారు. లే ఔట్‌లో సరిహద్దులన్నీ చెరిపేసి ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నారని సంధ్యా శ్రీధర్ రావుపై ఫిర్యాదు చేశారు. ఎక్కువ ప్లాట్లు కొని.. తమను భయపెట్టి మిగతావి కూడా సొంతం చేసుకోవాలని సంధ్యా శ్రీధర్ రావు ప్రయత్నించారని పేర్కొన్నారు. ఎక్కువ ప్లాట్లు తనవే ఉన్నాయని, లేఔట్‌లోని రహదారులు, ఆ పక్కనే ఉన్న తమ ప్లాట్లు, పార్కులు సరిహద్దులు పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇదేమని అడిగితే తమపై దాడి చేసేవారని తెలిపారు.

**హైడ్రాను ఆశ్రయించాం..**

ఓ ప్లాట్ యజమానురాలిపై దాడి చేయడమే కాకుండా తప్పుడు కేసులు కూడా పెట్టారని సంధ్యా శ్రీధర్ రావుపై బాధితులు ఫిర్యాదు చేశారు. ఇందుకు గాను సంధ్య శ్రీధర్ రావుకు రూ. 10 లక్షలు సుప్రీంకోర్టు జరిమానా విధించిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తమ ప్లాట్లు చూడడానికి కూడా వీలు లేకుండా చేశారని వాపోయారు. నేరుగా దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేసిన సమయంలో తాము హైడ్రాను ఆశ్రయించామని బాధితులు తెలిపారు. హైడ్రా అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారుల ఆక్రమణలను నిర్ధారించాక చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. మమ్మలను పెట్టిన దారుణమైన ఇబ్బందులను కోర్టుకు విన్నవించుకోవడానికే తాము ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యామని చెప్పారు.బాధితుల ఫిర్యాదులన్నీ విన్నాక జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ఇప్పటికే రహదారుల పునరుద్ధరణకు తాము హైడ్రాకు సూచించామని బాధితులకు తెలిపారు. అందులోని ప్లాట్ల యజమానులకు అండగా హైకోర్టు ఉంటుందని ధైర్యం చెప్పారు.లేఔట్‌లోని రహదారులను, పార్కులను పునరుద్ధరించాలని హైడ్రాకు హైకోర్టు మరోసారి సూచించింది. ఫైనల్ హియరింగ్ కోసం ఈనెల 18 వ తేదీకి కేసును వాయిదా వేసింది.

# ఆదివాసి యువత గ్రామస్థాయిలోనే ఆగిపోకుండా ప్రపంచాన్ని చుట్టి రావాలి

* **ఆదివాసి యువత సమ్మేళనంలో మధుయాష్కీ గౌడ్**



హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి): ఆదివాసి గ్రామాల నుంచి వచ్చిన యువత తాము ఎంచుకున్న లక్ష్యం వైపు పట్టుదలతో కృషిచేసి.. ఉన్నత స్థానాలకు ఎదగాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు.మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సౌజన్యంతో మేరా యువభారత్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరగనున్న 17వ ట్రైబల్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంను (ఆదివాసి యువత సమ్మేళనం) కార్యక్రమం రాజేంద్రనగర్ లోని టీజీకాబ్ సీటీఐలో ప్రారంభమైంది. చత్తీస్గడ్, ఒడిస్సా, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆదివాసి యువత హాజరయ్యారు.ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరై సమ్మేళనాన్ని ప్రారంభించిన మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ, యువత ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, లాయర్లు కావాలన్నా లక్ష్యాలే కాకుండా రాజకీయాల్లోనూ రావాలని సూచించారు. ఆదివాసి యువతకు రాజ్యాంగం రిజర్వేషన్ కల్పించిందని, మహిళలకు 33% రిజర్వేషన్ కూడా అమలు కానున్నాయని..గ్రామ సర్పంచ్ నుంచి ఎంపీ వరకు పోటీ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఇప్పటికీ చాలా ఆదివాసి గ్రామాలలో ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, బస్సు, రోడ్డు సదుపాయాలు లేకపోవడం బాధాకరమన్నారు. దేశ నిర్మాణంలో ఆదివాసీల పాత్ర ఎంతో ఉందని, వారి శ్రమకు సరిపడా సంపద దక్కటం లేదన్నారు. సామాజిక ఆర్థిక, అసమానత నక్సలిజం వైపు ఆ ప్రాంతాల యువత వెళ్తున్నారన్నారు.అందుకే చత్తీస్గడ్, ఒడిస్సా, జార్ఖండ్ రాష్ట్రాలలో ఆదివాసీలకు సంపద లో వాటా దక్కాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఆదివాసి యువత గ్రామస్థాయిలోనే ఆగిపోకుండా... ప్రపంచాన్ని చుట్టి రావాలని, తమ ఎదుగుదలతో పాటు.. తాము పుట్టి పెరిగిన ప్రాంతాలని అన్ని రంగాలలో అభివృద్ధి వైపు నడిపించాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో నడుస్తున్న ట్రైబల్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంలో తమ అభిప్రాయాలను పంచుకోవాలని, కొత్త ఆవిష్కరణలతో తమ జీవితాలకు కొత్త బాటలు వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా, మేరా యువ భరత్ స్టేట్ డైరెక్టర్ అన్షుమాన్ ప్రసాద్, రిటైర్డ్ డైరెక్టర్ పి. వైద్యనాథ్ రావు, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ కుష్బూ గుప్తా, ఎన్ఎస్ఎస్ యూత్ ఆఫీసర్ సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్స్ రిలీజ్



హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి) ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఈ వారం బిల్స్ రిలీజ్ చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారంలో రూ.202.90 కోట్లను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణ పనుల దశలను బట్టి విడుదల చేయాల్సిన బిల్లు మొత్తాలను ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ ప్రక్రియలో భాగంగా ఈనెల 11వ తేదీ నాటికి పురోగతి సాధించిన మేరకు 18,247 మంది లబ్ధిదారులకు బిల్లులను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ వారం లబ్ధిదారులకు చేసిన చెల్లింపుల్లో బేస్‌మెంట్ లెవల్ నిర్మాణాలు 4,615, రూఫ్ లెవల్ (గోడలు పూర్తి) అయినవి 8,517, శ్లాబ్ వేసిన 5,115 ఇండ్లు ఉన్నాయని వివరించారు.

**ఇంతవరకు రూ.2,900 కోట్ల చెల్లింపు**

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇంతవరకు మొత్తం రూ.2,900.35 కోట్లను చెల్లించినట్లు ఎండీ వీపీ గౌతం తెలిపారు. వీటిలో బేస్‌మెంట్ లెవల్ దాటిన ఇండ్లకు రూ.1,610.79 కోట్లు, రూఫ్ లెవల్ (ఆర్ఎల్) రూ.716.91 కోట్లు, రూఫ్ క్యాస్టెడ్ అయిన ఇండ్లకు రూ.572.65 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంతవరకు 2,33,069 ఇండ్ల పనులు ప్రారంభం కాగా, వాటిలో బేస్‌మెంట్ స్థాయిలో 90,613, గోడల నిర్మాణం పూర్తయిన స్థాయిలో 41,212 ఇండ్లు, శ్లాబ్ పూర్తయినవి 37,400 ఇండ్లు ఉన్నాయని పేర్కొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.